
పెన్ పవర్
తెలంగాణ రౌండప్



రుద్ర కన్‌స్ట్రక్షన్ భవనానికి చూపబడిన అధికారిక స్కెచ్ ప్లాన్..

- ఏ ప్రాతిపదికన 'రుద్ర'పై చర్యలకు జాప్యం వహిస్తున్నారో..? కాస్త చెబుతారా..?
- 'నోటీసులు- సీజింగ్'లు కూడా అవసరం లేని ఈ "మోస్ట్ డేంజరస్" అక్రమ నిర్మాణం..?
- ప్రజలను ప్రమాదంలో పెడుతున్న వైనం..! నిజాంపేట్ సిఎంసి టౌన్‌ప్లానింగ్ నిర్లక్ష్యం..?
- పొరపాటున ప్రమాదం సంభవిస్తే..? ఒక్కరైనా.! ప్రాణాలతో బయట పడతారా..?
- ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న 'బిల్డర్‌లు- అధికారుల'పై విమర్శలు..?
- సిఎంసి సర్కిల్ ఏదైనా..! చైన్‌మెన్‌ల వ్యవస్థే వసూళ్ళలో కీలకపాత్ర అంటూ ఆరోపణలు..

# 'రుద్ర' కన్‌స్ట్రక్షన్‌పై చర్యలేవి..? 'సిఎంసి' కమిషనర్..?

- 'ఎస్‌టిఎఫ్' టీమ్ నియామకం.. జస్ట్ ఫార్మాలిటి కోసమేనా..?
- సీజింగ్‌ల పేరుతో.. కూల్చివేతలకు కాలయాపన.. ఒప్పందంలో భాగమేనా..?
- చుట్టూ 6 మీటర్ల సెట్‌బ్యాకులు 100 శాతం కబ్జాకు గురైనట్లు కళ్ళెదుటే సాక్షాత్కారం..




బాచుపల్లి రుద్ర కన్‌స్ట్రక్షన్.. జీరో సెట్‌బ్యాకులతో నిబంధనలు ఉల్లంఘన..




- హెచ్‌ఎండిఏ నుండి 1274 గజాల్లో డబుల్ సెల్లార్‌తో, హైవేకు రెసిడెన్షియల్ పర్మిషన్..!
- భవనం చుట్టూ 20 ఫీట్ల (6 మీ.) ఉన్న సెట్‌బ్యాకులు కూడా 100 శాతం కబ్జా..?
- 200 అడుగుల మియాపూర్, గండిమైసమ్మ హైవే స్థలాన్ని కూడా 20 ఫీట్లు ఆక్రమణ..?
- డబుల్ సెల్లార్,ఆపై సెట్‌బ్యాకుల ఆక్రమణ.. ప్రమాదం జరిగితే..! గాలి రాదు ఊపిరాడదు..!
- ఈ దశ వరకూ, భవన నిర్మాణానికి సహకరించిన నిజాంపేట్ టౌన్‌ప్లానింగ్..?
- నిద్రావస్థలో "హెచ్‌ఎండిఏ-సిఎంసి"..! నోటీసులిచ్చాం..! సీజ్‌చేశాం..! ఇదేనా..?
- 'రుద్ర' కన్‌స్ట్రక్షన్‌లో కరప్షనే కనిపిస్తుంది..? అధికారుల బాధ్యతేది..?పారదర్శకత ఏది..?
- రెండు 'నోటీసులు-సీజింగ్'ల ప్రక్రియతో చర్యలకు కాలయాపన దేనికి..?
- 'రుద్ర' కన్‌స్ట్రక్షన్ నిర్మాణం పూర్తయ్యే వరకూ..! ఇదే ధోరణితో వ్యవహరిస్తారా..?
- ప్రజలకు ఆగ్రహం తెప్పిస్తున్న నిజాంపేట్ సిఎంసి అధికారుల వ్యవహార శైలి..

ఓవైపు ప్రమాదకర నిర్మాణాలు, కళ్ళెదుటే అక్రమమని తేటతెల్లం అవుతుంది. అయినప్పటికీ చట్టప్రకారమే చర్యలు తీసుకుంటున్నాం, అన్న సాకుతో..! ఆ చట్టాలను ధిక్కరించి, నిర్మాణ నిబంధనలను అధికారులే ఉల్లంఘిస్తున్నారా..? సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని టౌన్‌ప్లానింగ్ వ్యవస్థపై సిఎంసి కమిషనర్ నిర్లక్ష్యం వెనుక ఆంతర్యం..? దుండిగల్-నిజాంపేట్ సర్కిల్‌లలో సిఎంసి కమిషనర్ చర్యల ఆదేశాలు సక్రమంగానే, అమలు అవుతున్నాయా..? నాయకుల సిఫార్సుల పేరిట, కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల దందా వెనుక, సిఎంసి ఉన్నతాధికారుల హస్తం లేకుండా సాధ్యమేనా..? అన్న ప్రశ్నలు కీలకంగా తలెత్తుతున్నాయి.. వందల సంఖ్యలో గచ్చిబౌలి ఘటన తరహా అక్రమ కట్టడాలు వెలుస్తుంటే..! కూల్చివేతల ప్రక్రియ అక్రమార్కులకు అనుకూలంగా చేపట్టడం అనుమానాలను రేకెత్తిస్తుందని, సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి.. నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి పరిధి బాచుపల్లిలోని, 'రుద్ర' నిర్మాణ సంస్థ నిర్మిస్తున్న భారీ అక్రమ కట్టడంలో నిబంధనల ఉల్లంఘన, అధికారుల సౌజన్యంతోనే జరుగుతోందని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.. రుద్ర నవీన్ తన, జీరో సెట్‌బ్యాకుల అక్రమ కట్టడంపై చర్యలు తీసుకోకుండా, పలుకుబడి అస్త్రం ఉపయోగించాడని పలు ప్రశ్నలు లేవనెత్తుతోంది.. సిఎంసి బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 9:

-4లో




## చట్ట సభల్లో ప్రజాప్రతినిధులు హుందాగా వ్యవహరించాలి

### తెలంగాణ అసెంబ్లీలో ప్రజాస్వామ్య విలువలు కరవు


### సంసద్ రత్న అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** చట్టసభల్లో ప్రజాప్రతినిధులు హుందాగా వ్యవహరించాలని, తమను ఎన్నుకున్న ప్రజల సమస్యలను సభలో ప్రస్తావించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సూచించారు. దేశంలో పార్టీల కన్నా పార్లమెంటరీ విలువలే ప్రధానమని, ప్రజాస్వామ్యంలో పార్లమెంటే దేవాలయమని పేర్కొన్నారు. బుధవారం దిల్లీలో జరిగిన 2026 సంసద్ రత్న అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్, భారాస వ్యవహార శైలి అప్రజాస్వామికంగా ఉంది. దీన్ని చూస్తే.. ప్రజాస్వామ్యం ఎటుపోతోందో అనిపిస్తుంది. ప్రభుత్వ పనితీరు నచ్చకపోతే విపక్షాలు సునిశితంగా విమర్శించాలి.. ప్రశ్నించాలి. లేదంటే వాకౌట్ చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెబుతుండేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. సభను గందరగోళం చేయడం

-5లో

## సంగారెడ్డి కలెక్టర్ ఆఫీస్ లో ఏసీబీ సోదాలు..

### లంచం తీసుకుంటూ పట్టుబడ్డ విద్యాశాఖ అధికారి




**హైదరాబాద్ పెన్ పవర్:** సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దాడులు నిర్వహించారు. ఓ ప్రైవేట్ కాలేజీకి అనుకూలంగా ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్ ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన విద్యాశాఖ అధికారిని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.సంగారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ కాలేజీని తనిఖీ చేసి, పాజిటివ్ రిపోర్ట్ ఇచ్చేందుకు సంబంధిత విద్యాశాఖ అధికారి గోవింద్ రామ్ రూ.50 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.ఈ క్రమంలో బాధితుడు గత వారం రూ.30 వేల నగదును అధికారికి ఇచ్చినట్లు సమాచారం. అనంతరం మిగిలిన రూ.20 వేల కోసం అధికారి ఫోన్ చేసి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ట్రాప్ నిర్వహించారు. సంగారెడ్డిలోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో రూ.20 వేల నగదును తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలోని బృందం గోవింద్ రామ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది.అనంతరం కార్యాలయంలో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు ఏసీబీ దర్యాప్తు పూర్తయిన అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

## ఫీజు రీయింబర్స్‌మెంట్, 22ఏపై భాజపా పట్టు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఫీజు రీయింబర్స్‌మెంట్, నిషేధిత భూముల జాబితా (22ఏ) అంశంపై చర్చించాలంటూ భాజపా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చర్చకు పట్టుబట్టారు. వాయిదా అనంతరం బుధవారం మధ్యాహ్నం సభ ప్రారంభం కాగానే భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రెండు అంశాలపై చర్చించాలని కోరారు. దళితులు నడిచిన ప్రాంతాన్ని భారాస నేతలు శుద్ధి చేసిన అంశంపై సభలో అధికార పక్షం చర్చిస్తుండగా ఏలేటితో పాటు భాజపా సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. మధ్యాహ్నం 2.15 నుంచి 3.05 వరకు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. సీట్లలోకి వెళ్లి కూర్చోవాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్

-5లో



# 'రుద్ర' కన్‌స్ట్రక్షన్‌పై చర్యలేవి..? 'సిఎంసి' కమిషనర్..?


పెన్ పవర్ తెలంగాణ రౌండప్
'రుద్ర'కన్‌స్ట్రక్షన్‌కి..! 'రూల్స్' వర్తించవా..?


పెన్ పవర్
'నోటీసుల'తో మమ..! చర్యలు డుమ్మా..!


పెన్ పవర్
'రుద్ర' సీల్..! ఎన్నాళ్ళు సారూ..?


పెన్ పవర్ తెలంగాణ రౌండప్
'రుద్ర'సీజ్ చేస్తే..! సెట్‌బ్యాకుల ఆక్రమణ కూల్చేసినట్లేనా..?

రుద్ర కన్‌స్ట్రక్షన్ వెనుకవైపు రోడ్డులోనూ ఉల్లంఘించిన నిబంధనలు..




**నోటీసులు-సీజింగ్‌లతో, సెట్‌బ్యాకుల ఆక్రమణపై చర్యలు చేపట్టినట్టే అవుతుందా..? హెచ్‌ఎండిఏ అనుమతుల్లో భవనం చుట్టూ, 6 మీటర్లు చూపించిన, సెట్‌బ్యాకులు 5 అంతస్తుల ఎత్తున కబ్జాకు గురైనట్లు కళ్ళెదుటే స్పష్టంగా కనిపిస్తుంది.. ఏ విధంగా చూసినా..? కూల్చివేత ఒక్కటే మార్గం..! అయినప్పటికీ పట్టణ ప్రణాళిక అధికారుల్లో ఎందుకింత నిర్లిప్తత..? ఎవరి మెప్పు పొందటానికి..? అధికారుల ధనదాహంతో ప్రజలను ప్రమాదంలో పెడతారా..? ఒకవైపు అండర్ గ్రౌండ్‌లో ఉన్న డబుల్ సెల్లార్, మరోవైపు వందశాతం సెట్‌బ్యాకుల ఆక్రమణ.. పొరపాటున అగ్నిప్రమాదం సంభవిస్తే..! ప్రాణనష్టం ఏ మేరకు ఉంటుందో ఊహించారా..? అక్రమ కట్టడాలకు, నాయకుల సిఫార్సులు, అధికారుల చేతివాటం..? హైదరాబాద్ నగరానికి పెను ప్రమాదంగా తయారైందని స్థానికులు ఆరోపిస్తున్నారు..**

## కళ్ళెదుటే ఉల్లంఘనలు..

బాచుపల్లి రుద్ర కన్‌స్ట్రక్షన్, సెట్‌బ్యాకుల నిబంధనలు ఉల్లంఘించినట్లు ప్రారంభం నుండే తెలిసిపోతుంది.. అయినప్పటికీ 2 సెల్లార్‌లు ం 1 గ్రౌండ్ ం 5 పై అంతస్తులకు గాను 4 అంతస్తులు నిర్మించిన తర్వాతే, 'సీలింగ్' ప్రక్రియ ప్రారంభించారు.. ఆ వెంటనే కుత్బుల్లాపూర్ సిఎంసి జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ఐఏఎస్, రుద్ర కన్‌స్ట్రక్షన్‌ను సందర్శించిన విషయాన్ని కూడా, సర్కిల్ డిప్యూటీ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ ఏసిపి-టిపిఎస్ మీడియాకు తెలియకుండా, గోప్యంగా ఉంచారు.. అక్రమ భవనం చుట్టూ ఉండాల్సిన 6 మీటర్లు (20 అడుగులు) సెట్‌బ్యాకులు పూర్తిగా కబ్జాచేసి నిర్మాణం చేపట్టారు.. కళ్ళెదుటే జీరో సెట్‌బ్యాకులు సాక్షాత్కారిస్తుంటే..! నేలమట్టం చేయాల్సిన భవన నిర్మాణానికి, కొందరు పనికిమాలిన సిఫార్సులు చేస్తున్నారని, చర్యలు తీసుకోకుండా, సహకరించడం గమనార్హం.. టౌన్‌ప్లానింగ్ విధులు అంటే తమ తాతల నుండి వస్తున్న వారసత్వంగా అధికారులు భావిస్తూ, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పలువురు వ్యంగ్యారోపణలు చేస్తున్నారు..

-

3 పేజి తరువాయి

రుద్ర కన్‌స్ట్రక్షన్‌కు చెందిన ఓ అక్రమ భారీ భవన నిర్మాణం, టౌన్‌ప్లానింగ్ అధికారుల అవినీతిని బట్టబయలు చేస్తోందని, పలువురు విమర్శిస్తున్నారు.. అధికారులు ఏమేరకు బరితెగించి విధులు నిర్వర్తిస్తున్నారో..? ఏ స్థాయిలో కరప్షన్ దందాకు తెరలేపారో..? ఉన్నతాధికారుల 'అండా దండా' అదే స్థాయిలో ఉందని సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిజాంపేట్ సర్కిల్–58లో, హెచ్‌ఎండిఏ నిబంధనలు కొందరికే వర్తిస్తాయని సంబంధిత అధికారులే, పరోక్షంగా నిర్ధారిస్తున్నారు..! బడా నిర్మాణ సంస్థలకు ఈ రూల్స్ వర్తించవని స్పష్టతను ఇస్తున్నారు..? నిజాంపేట్ సర్కిల్–58 సిఎంసి పరిధి బాచుపల్లిలో 200 ఫీట్ల రహదారి పక్కన, బాచుపల్లి సర్వే నెం.135/పార్ట్, 136లో.. ప్లాట్ నెంబర్: 34, 35, 71 అండ్ 72 కు సంబంధించి, రుద్ర' కన్‌స్ట్రక్షన్ సంస్థకు చెందిన 1274 గజాల స్థలానికి "డబుల్(2) సెల్లార్ +1 గ్రౌండ్ + 5 పై అంతస్తులకు రెసిడెన్షియల్ (ఇంటికి) అనుమతులు పొందారు.. నిర్మాణానికి ముందు బాగంలో 200 (60 మీటర్లు) అడుగుల రహదారి, వెనుకవైపు 33 అడుగుల (10 మీటర్లు) రోడ్డు ఉన్నట్లు, ప్లాన్ షోయింగ్ స్కెచ్ ప్లాన్‌లో క్లియర్‌గా చూపించారు.. భవనానికి మూడు వైపులా 6 మీటర్లు(చుట్టూ 20 ఫీట్లు) సెట్‌బ్యాకులు.. ముందువైపు దాదాపు 35 ఫీట్లు (10.72 మీటర్లు) వదిలిపెట్టి నిర్మాణం చేపట్టాలి.. అయితే ఈ నిబంధనలు ప్రారంభంలోనే ఉల్లంఘించారు..! అయితే నిజాంపేట్ సర్కిల్–58 సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు, అక్రమార్కులతో ఒప్పందమే కుదుర్చుకున్నారో.. సిఫార్సులే చేయించారో తెలియదు కానీ.. మామూళ్ళ మత్తులో చర్యలు విస్మరిస్తున్నారని స్పష్టమవుతుంది..?

## నోటీసులు-సీజింగ్‌ల డ్రామాతో..! చర్యల జాప్యం..!

రుద్ర కన్‌స్ట్రక్షన్ నిబంధనలు ఉల్లంఘించినట్టు గుర్తించిన నిజాంపేట్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు.. నోటీసులు–సీజింగ్‌ల పేరుతో కూల్చివేతల ప్రక్రియపై దాటవేసే ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.. హెచ్‌ఎండిఏ అనుమతులు మంజూరు చేసినప్పటికీ..! స్థానిక నిజాంపేట్ సర్కిల్ అధికారుల పర్యవేక్షణ ఉండాలి.. నిత్యం అక్రమ నిర్మాణాల వద్దకు పరుగులు పెట్టే, చైన్‌మెన్‌లు, ఉన్నప్పటికీ, రుద్ర కన్‌స్ట్రక్షన్ నిరాటంకంగా కొనసాగటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.. మరోవైపు స్థానికులు ఫిర్యాదులు, పత్రికా ప్రతినిధులు ప్రశ్నించిన వెంటనే అప్రమత్తమైన టౌన్‌ప్లానింగ్, మొక్కుబడిగా షోకాజ్ నోటీసు జారీ చేశారు.. ఆతర్వాత పత్రికా కథనాలు వెలువడిన వెంటనే, సీజింగ్ ప్రక్రియ చేపట్టినా..! నేటికీ కూల్చివేతల ప్రస్తావనే లేకపోవడం గమనార్హం..

---

## సర్కార్ వారి రైడింగ్ యాప్..

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు, ఆటో డ్రైవర్లకు శుభవార్త అందించింది. ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు ప్రధాన నగరాల్లో ర్యాపిడో, ఉబర్, ఓలా లాంటి బైక్, ఆటో క్యాబ్ సర్వీసులు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ ప్రైవేట్ యాప్స్‌లో ధరలు అధికంగా ఉండటంతో పాటు రిజిస్టర్ చేసుకుని సేవలు అందించేవారి నుంచి అధిక కమీషన్లు వసూలు చేస్తున్నారు. దీంతో ప్రజలతో పాటు ఆటో డ్రైవర్లకు కూడా నష్టం జరుగుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తక్కువ ధరకే ప్రజలకు క్యాబ్ సర్వీసులు అందించడంతో పాటు కమీషన్ల భారం నుంచి ఆటో డ్రైవర్లకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వమే సొంతగా ఒక యాప్ తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది. త్వరలో ఈ యాప్ ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఓలా, ఉబర్, ర్యాపిడో లాంటి ప్రైవేట్ అగ్రిగేటర్ల యాప్‌ల తరహాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక రైడ్ హేలింగ్ యాప్‌ను ప్రారంభించనున్నట్లు పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. సచివాలయంలో ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలపై చర్చించారు. డ్రైవర్లతో పాటు ఇతర కార్మికుల భద్రత కోసం ఇన్స్యూరెన్స్ పాలసీని అమలు చేయడంపై ప్రభుత్వం సమాలోచనలు చేస్తోందని అన్నారు. ఆటో కార్మికుల సంక్షేమం, ఉపాధి అవకాశాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా ప్రభుత్వం తరపున ప్రత్యేక రైడ్ హేలింగ్ యాప్ తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ యాప్ ద్వారా అత్యంత తక్కువ ధరల్లో ప్రజలకు క్యాబ్ సర్వీసులు అందిస్తామన్నారు. అలాగే ఆటో డ్రైవర్లకు కమిషన్ల భారం కూడా తగ్గి వారికి ప్రయోజనం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కూడా దృష్టి పెట్టినట్లు తెలిపారు.సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కేబినెట్‌లో చర్చించి అనంతరం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడతామని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. 2012 తర్వాత ఆటో ఛార్జీలను పెంచలేదని, ప్రస్తుతం పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆటో కార్మికుల సంఘాలు, రవాణశాఖ అధికారులతో ఛార్జీల పెంపుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఎంత పెంచాలనే దానిపై కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి త్వరలో నివేదిక సమర్పించనుందని, ఆ నివేదిక పరిశీలించాక ఎంత పెంచాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. టీజీఎస్ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టనున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం అలాంటి ఆలోచన ప్రభుత్వానికి లేదని పేర్కొన్నారు.

## ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నది బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:**
ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నది. పర్సనల్ ఈగోలతో సభను జరగనివ్వడం లేదని బీజేపీ శాసనసభ్యుడు వెంకటరమణా రెడ్డి అన్నారు. ప్రతి సారి దాడికి ప్రతి దాడి మంచిది కాదు. పోలీసులను ఇబ్బందికి గురిచేయడం తప్పు. రోడ్డు అర్ధనగ్న ప్రదర్శన చేయడం ఏం సందేశం ఇస్తున్నట్లు. కులాల మధ్య అంతరాన్ని పెంచే విధంగా మాట్లాడుతున్నారు. సభలో లేని వారిని (గంగుల కమలాకర్) కూడా సస్పెండ్ చేశారు. అధికారం ఉంది కదా అని వారికి తోచినట్లు చేస్తున్నారు. వ్యక్తిగా సభలో లేని వ్యక్తులను సస్పెండ్ చేయడం నేను వ్యతిరేకిస్తున్నాను. పది సంవత్సరాలు మమ్మల్ని ఇబ్బంది పెట్టారు. ఇప్పుడు మేము ఇబ్బంది పెడతాం అనే విధంగా వ్యవహరిస్తున్నారు. ప్రజా సమస్యలపై చర్చ జరగాలి, మాట్లాడాలని అన్నారు.
సభ ఆరు రోజుల్లో మూడు రోజులు ఇప్పటికీ ఏం చర్చ లేదు. ఎవరి ఇంటిపై దాడి జరిగినా అది మంచిది కాదు. హుందాతనంతో శాసన సభ్యులు వ్యవహరించాలని అన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్, 22ఏపై భాజపా పట్టు

-3 పేజి తరువాయి

వారికి పదేపదే విజ్ఞప్తి చేశారు.

భాజపా ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబు, ధన్‌పాల్ సూర్యనారాయణ, రామారావు పటేల్, రాకేశ్‌రెడ్డి వెల్‌లో నిరసనలు కొనసాగించడంపై మంత్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు. భారాస నాయకులు శుద్ధి చేసిన సంఘటన సామాజిక అంశమనీ.. ఈ విషయంలో సభలో చర్చ జరగాలని శ్రీధర్‌బాబు కోరారు. విద్యాశాఖలో ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, 22ఏ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అసెంబ్లీలో భారాస చేసిన తప్పులనే భాజపా చేస్తోందని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మండిపడ్డారు. భారాస దళితుల్ని అవమానించిన అంశంపై చర్చ జరగాలని అన్నారు. అసెంబ్లీ రూల్ బుక్ చూడాలనీ.. ప్లకార్డులు ప్రదర్శించవద్దని మంత్రి సీతక్క భాజపా ఎమ్మెల్యేలకు సూచించారు. తెలంగాణకు సరైన నిధులివ్వకుండా అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని భాజపా ఎమ్మెల్యేలు ప్రశ్నించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

**ప్రజా సమస్యలపై చర్చించారా..?**

వెల్‌లో 50 నిమిషాలు ఉన్న తర్వాత ఏలేటి స్పందిస్తూ మాట్లాడే అవకాశమిస్తే నిరసన ఆపేస్తామన్నారు. స్పీకర్ అంగీకరించడంతో ఆయన మాట్లాడుతూ.. సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక లక్షలమంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. 22ఏతో భూముల యజమానులు, బకాయిలు రాక విశ్రాంత ఉద్యోగులు కష్టాలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. 'ఫీజు రీయింబర్స్‌మెంట్, నిషేధిత భూముల జాబితా అంశంపై చర్చించేందుకు ఎప్పుడు అనుమతిస్తామరో స్పష్టమైన తేదీ, సమయం ప్రకటించాలి. శాసనసభ సమావేశాలు ప్రారంభమై మూడు రోజులైంది. ఇప్పటివరకు ఒక్క ప్రజాసమస్యపైనైనా చర్చించారా?'అని ప్రశ్నించారు. ఈ అంశాలపై చర్చకు సభాపతి అనుమతించకపోవడంతో తన పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన సభ నుంచి వాకౌట్ చేశారు.

**'ఆర్ఆర్ రూల్ బుక్' వ్యాఖ్యలపై వివాదం**

అంతకుముందు ఏలేటి చేసిన వ్యాఖ్యలపై కొంతసేపు వివాదం నెలకొంది. ఫీజు రీయింబర్స్‌మెంట్, 22ఏ పై చర్చించాలంటూ మహేశ్వర్‌రెడ్డి వాయిదా తీర్మానం ఇవ్వగా స్పీకర్ తిరస్కరించారు. దీంతో ఏలేటి స్పందిస్తూ... 'మీపై (స్పీకర్‌ను ఉద్దేశిస్తూ) జరిగిన దాడికి మేం రెస్క్యూకు వచ్చాం. అదేవిధంగా రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా సభలో లేనివారిని కూడా సస్పెండ్ చేయడం బాధాకరం. మీరు కొత్తగా ఏమైనా 'ఆర్ఆర్ రేవంత్‌రెడ్డి' రూల్‌బుక్ ఏర్పాటు చేసుకున్నారా? అని పేర్కొన్నారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ... 'సభా నాయకుడి గురించి ఏకవచనంతో మాట్లాడటం సరికాదు. మీ వ్యాఖ్యల్ని సవరించుకోవాలి' అని ఏలేటికి సూచించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ... సభ ఔన్నత్యాన్ని, స్పీకర్ గౌరవాన్ని కాపాడటం సభ్యులందరి బాధ్యత అని అన్నారు. 'స్పీకర్‌పై జరిగిన దాడికి రెస్క్యూకు వచ్చామని అనడం ఏంటి?' అంటూ ఏలేటి వ్యాఖ్యల్ని తప్పుపట్టారు. స్పీకర్ అంత బలహీనులు కాదని అన్నారు. తన వ్యాఖ్యల అర్థాన్ని ఉపముఖ్యమంత్రి మరోలా చెబుతున్నారని ఏలేటి బదులిచ్చారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... సభా నాయకుడైన సీఎంను ఏకవచనంతో సంబోధించడం సరికాదని, ఆయన తన వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి రూల్‌బుక్ నడుస్తుందా? అని తాను అడిగానని? అది ఏ రూల్ ప్రకారం అని ఏలేటి మరోసారి అనడంతో కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తనతోపాటు మంత్రి కూడా కోరారని, ఆ రెండు పదాల్ని వెనక్కి తీసుకోవాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఏలేటిని మరోసారి కోరారు.

**అనుచిత వ్యాఖ్యలు చేయకుండా ఆదేశించాలి: కూనంనేని**

కేసీఆర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ విషయంపై శంకర్‌తో మాట్లాడితే రాహుల్‌గాంధీపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేసినందుకే తానూ బదులిచ్చినట్లు చెప్పారని వివరించారు. అదేవిధంగా సీఎం రేవంత్‌రెడ్డికి పిండప్రదానం చేయడం నేరం, ఘోరం.. ఇలాంటి వారిపై కేసులు పెట్టాలని కోరారు. సీఎంపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికాదనీ.. ఇలాంటి భాష ఎవరైనా, ఎక్కడైనా మాట్లాడకుండా ఆదేశాలు జారీ చేయాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. భారాస సభ్యులపై సస్పెన్షన్ సమావేశాలు పూర్తయ్యేంతవరకు కాకుండా ఒకరోజుకు పరిమితం చేయాలని సూచించారు.

# చట్ట సభల్లో ప్రజాప్రతినిధులు హుందాగా వ్యవహరించాలి

-3 పేజి తరువాయి

పైనే విపక్షాలు దృష్టి పెడుతున్నాయి' అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రైమ్ పాయింట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 4 పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌లతో కలిపి 16 మంది ఎంపీలకు సంసద్ రత్న అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్, కేంద్ర సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం, పలువురు పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

# మంత్రాల నెపంతో మహిళ దారుణ హత్య.. అర్ధరాత్రి మరిది ఘాతుకం

**మంచిర్యాల: పెన్ పవర్:** మంత్రాలు చేస్తున్నారనే అనుమానం ఓ మహిళ ప్రాణాలను బలిగొన్న విషాద ఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని నెల్కి వెంకటాపూర్ గ్రామానికి చెందిన సింగతి లక్ష్మి (42) అనే మహిళను ఆమె మరిది అర్ధరాత్రి సమయంలో దారుణంగా నరికి హత్య చేసినట్లు సమాచారం. గ్రామంలో అందరూ నిద్రిస్తున్న సమయంలో జరిగిన ఈ ఘటన ఒక్కసారిగా కలకలం రేపింది. మంత్రాల నెపంతోనే లక్ష్మిపై దాడికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అర్ధరాత్రి సమయంలో జరిగిన ఈ దారుణ ఘటనతో కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. హత్యకు అసలు కారణాలు ఏమిటి? మంత్రాలపై ఉన్న అనుమానమే దాడికి కారణమా? లేక కుటుంబ కలహాలకు మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో నెల్కి వెంకటాపూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మూఢనమ్మకాల కారణంగా ఓ మహిళ ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి రావాల్సి ఉంది.

# శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సస్పెండ్

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ శాసనసభ మూడవ రోజు బుధవారం సమావేశమయింది. తాజాగా సభనుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసారు. సభ జరగనున్న అన్ని రోజులు ఈ సెషన్ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్ బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. స్పీకర్ తీర్మానాన్ని ఆమోదించి సస్పెండ్ చేసారు. 22 ఏ లాంటి ప్రజా సమస్యలు చర్చకు రాకుండా రేవంత్ సర్కార్ మరో కుట్రకు తెర లేపిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. ప్రజా సమస్యలపై చర్చకు భయపడి ఈ నిర్ణయం అని అన్నారు.

# ఆటలాడుతూ కుప్పకూలిన విద్యార్థి

**ఖమ్మం: పెన్ పవర్:** గురుకుల పాఠశాలలో తీవ్ర విషాదం నెలకొంది. ఎనిమిదో తరగతి విద్యార్థి ఆటలాడుతూ ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. గుండెపోటుతో మరణించినట్టు అనుమానం. ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఘటన చోటు చేసుకుంది. సాత్విక్ (14) అనే ఎనిమిదో తరగతి విద్యార్థి ఆటలాడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందాడు. సాత్విక్ తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామానికి చెందిన హరీష్, ప్రియాంక దంపతుల కుమారుడిగా గుర్తించారు.

# రోజుకు రూ.8-12 లక్షల ఖర్చు.. అసెంబ్లీలో ప్రజా సమస్యపై చర్చ ఏది?



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు.. 6 రోజులు నిర్వహించాలని నిర్ణయించారు. అంటే.. ఈ గురు, శుక్ర, శనివారంతో ఈ సభలకు ముగింపు పలకనున్నారు. కీలకమైన బిల్లులను ఈ సభలో ప్రవేశ పెట్టి ఆమోదించుకోవాలని ప్రభుత్వం పక్షం నిర్ణయించుకుంది. అలాగే.. వెయ్యిరోజుల పాలన పై కూడా చర్చించి.. ప్రజలకు ఏయే మేళ్లు చేశారు.. ఏమేరకు రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారు.. అనే విషయాలను కూడా వివరించాలని నిర్ణయించారు. అజెండాలోనూ వీటిని పేర్కొన్నారు.ఇక, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ విషయానికి వస్తే.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను.. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, హైడ్రా కమిషనర్ వ్యవహారం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, ఎల్ నినో ప్రభా వం సహా.. ఇతర అంశాలను కూడా ప్రస్తావించాలని నిర్ణయించుకుంది. తద్వారా ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని తొలుత నిర్ణయించింది. కానీ, అనూహ్యంగా అసెంబ్లీ వాతావరణమే మారిపోయింది.మూడు రోజుల అసెంబ్లీలో ఒక్కటంటే ఒక్క సమస్య కూడా ప్రస్తావనకురాలేదు. అటు అధికార పక్షం, ఇటు ప్రధాన ప్రతిపక్షాలు ఒకరిపై ఒకరు నిప్పులు చెరుగు కోవడమే సరిపోయింది. అసెంబ్లీ తొలి రోజు సోమవారం.. వెయ్యి రోజుల పాలనలో ఏమీ జరగలేదని చెబుతూ.. నల్ల టీషర్టులు ధరించి నిరసన వ్యక్తం చేయడం నుంచి స్పీకర్‌పై బీఆర్ ఎస్ ఎమ్మెల్సీలు.. చేసిన వ్యాఖ్యలు సభను కుదిపి వేశాయి. పోనీ రెండో రోజైనా సర్దుకున్నాయా? అంటే.. లేదు. ఎమ్మెల్సీల వ్యవహారం.. ఇరుపక్షాల మాటల దాడితోనే సభా సమయం కరిగిపోయింది.మూడో రోజు కూడా ఇదే తంతు సభలో కొనసాగింది. తమపైనే దాడి చేశారంటూ.. బీఆర్ ఎస్ ఎమ్మెల్యేల పై కాంగ్రెస్ పార్టీ, కాదు.. మీరే మమ్మల్ని అవమానించారని.. మహిళలపైనా దాడులు చేశారని బీఆర్ ఎస్ నేతలు యుద్ధాన్ని తలపించేలా సభలో వాగ్యుద్ధం చేసుకున్నారు. ఫలితంగా.. సభలో రభస తప్ప.. మరేమీ కనిపించలేదు. రోజుకు 8- 12 లక్షల రూపాయల మేరకు ఖర్చు చేస్తున్న సభలో ఒక్క ప్రజా సమస్యపైనా.. నాయకులు నోరు విప్పకపోవడం గమనార్హం.ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ఎల్ నినో.. రాజధానిలో అడుగంటుతున్న శాంతి భద్రతలు..(డీజీపీ ఆనందే వెల్లడించారు) వంటి అంశాలపై ఒక్కరు సైతం మాట్లాడకపోవడం గమనార్హం. మరి రభస ఎవరి కోసం.. రేపు సభ అయిపోయిన తర్వాత.. ఎవరి మానాన వారు తమ తమ పనుల్లో ఉంటారు. మరి ప్రజా సమస్యలపై చర్చించేది ఎప్పుడు? అనేది ధర్మసందేహం.!

# ఆ ఇద్దరు ఎమ్మెల్సీల సస్పెన్షన్.. ఏం జరుగుతుంది?

**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ కు చెందిన ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను సస్పెండ్ చేస్తూ.. శాసన మండలి తీర్మానం చేసింది. ఈ తీర్మానంపై మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి.. మూజువాణి ఓటు(చెయ్యి ఎత్తడం ద్వారా) నిర్వహించారు. ఈ నేపథ్యంలో మెజారిటీ సభ్యులు చెయ్యి ఎత్తి తమ అంగీకారం తెలిపారు. దీంతో వారిని సస్పెండ్ చేస్తూ.. గుత్తా సుఖేందర్ రెడ్డి తీర్మానం చదివి వినిపించారు. దీనికి ముందు.. సదరు ఇద్దరు ఎమ్మెల్సీల వైఖరిపై సభలో మాట్లాడిన మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనరసింహలు.. వారి ప్రవర్తన, స్పీకర్ ప్రసాద్ కుమార్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండించారు.





అదే విధంగాపలువురు సభ్యులు కూడా వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గౌరవ ప్రదమైన , రాజ్యాంగబద్ధమైన స్పీకర్‌పదవిలో ఉన్న వారిని ఉద్దేశించి దూషణలకు దిగడం.. మాతృమూర్తిని దూషించడం వంటివి తీవ్రమైన ఘటనలని పలువురు అభిప్రాయ పడ్డారు. ఇవి సభా సంప్రదాయానికి అత్యంత విఘాతమని తెలిపారు. ఇలాంటివారిని కఠినంగా శిక్షించాలని కోరారు. అయితే.. ఈ చర్చ సుమారు 2 గంటలపాటు సాగిన తర్వాత.. ప్రస్తుతం జరుగుతున్న సెషన్ వరకు ఎమ్మెల్సీలు.. తాతా మధు, నవీన్ రెడ్డిలను సస్పెండ్ చేస్తున్నామని గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు.

**అయితే.. ఏంటి?**

మండలి నుంచి సస్పెండ్ అయిన ఇద్దరు ఎమ్మెల్సీలపై ఎలాంటి ప్రభావం పడుతుందన్నది ఆసక్తిగా మారింది. ప్రస్తుతం జరుగుతున్న సెషన్ పూర్తిగా వారు సభకు వచ్చే అవకాశం ఉండదు. అలాగే.. వారికి ఈ సభా కాలంలో మంజూరు చేసే అన్ని అల వెన్సులు కూడా కట్ చేస్తారు. అలానే.. ఈ నెలకు సంబంధించిన వేతనంలోనూ కోత పెడతారు. ఇక, సభ రికార్డుల్లోనూ.. ఈ విషయాన్ని పేర్కొనడం ద్వారా.. వారి సస్పెన్షన్ వ్యవహారం రికార్డుల్లో ఉంటుంది. అలానే.. ఎందుకు? అనే కారణాలను కూడా పేర్కొంటారు. ఇక, సదరు ఎమ్మెల్సీలకు ఉన్న అన్ని అధికారాలు.. తదుపరి సెషన్ వరకు సస్పెండ్ అవుతాయి.

**బీఆర్ఎస్ నిరసన..**

మండలిలో తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిలపై గుత్తా సుఖేందర్ రెడ్డి సస్పెన్షన్ వేటు వేసిన అనంతరం.. బీఆర్ ఎస్ ఎమ్మెల్సీలు.. అక్కడే బైఠాయించి తమ నిరసన తెలిపారు. మండలి ఛైర్మన్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమసభ్యులు తప్పు చేయలేదని.. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని అన్నారు. అంతేకాదు.. తమ పార్టీ అధినేత కేసీఆర్ సూచనల మేరకు వారు విచారం కూడా వ్యక్తం చేశారని తెలిపారు. ఇలాంటి సమయంలో వారిపై సస్పెన్షన్ వేటు వేయడం సమంజసం కాదన్నారు. ప్రజల సమస్యలు ప్రస్తావిస్తున్నందుకే తమపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# శాసనసభను ఆభాసుపాలు చేస్తున్నారు.తలసాని

**హైదరాబాద్ పెన్ పవర్:**

అసెంబ్లీ లాబీలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ శాసన సభను అభాసుపాలు చేస్తున్నారు. రాష్ట్రంలో అనేక అంశాలు ఉన్నాయి. మొదటి రోజు గేటు బయట డ్రామా నడిపించారు. రెండో రోజు కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం వద్ద డ్రామా నడిపించారు. మర్కూక్ మండలంలో కేసిఆర్ చావు కోరుకున్న ఎమ్మెల్యే సభలో ఉన్నాడని అన్నారు.

కేసీఆర్ చావు కోరుకున్న ఎమ్మెల్యేను సస్పెండ్ చెయ్యలేదు. తిరుపతిలో ఉన్న మల్లారెడ్డిని సస్పెండ్ చేశారు. సభలో లేని కేటీఆర్ ను సస్పెండ్ చేశారు. సభలోని గూడెం మహిపాల్ రెడ్డిని సస్పెండ్ చేశారు. 22- ఏ అంశం జీవో 97 చర్చకు వస్తాయిని ప్రభుత్వం భయపడుతుంది. దళిత స్పీకర్ అంటూ స్పీకర్ ను కాంగ్రెస్ అవమానిస్తుంది. గడ్డం ప్రసాద్ కుమార్ అంటే బిఆర్ఎస్ కు గౌరవం. స్పీకర్ గా గడ్డం ప్రసాద్ కుమార్ ఉన్నాడనే బిఆర్ఎస్ పోటీ పెట్టలేదు. ఏఐ తో బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫొటోలు వైరల్ చేస్తున్నారు. రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ చావును కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోరుకుంటున్నారు. కేసీఆర్ చావు కోరుకున్న ఎమ్మెల్యేలను సభలో పెట్టుకున్నారు. మంత్రులు ప్ల కార్డ్స్ సభలో ప్రదర్శిస్తున్నారని అన్నారు.



జగదీష్ రెడ్డి మాట్లాడుతూ బట్టి విక్రమార్క ముఖ్యమంత్రి ఇంటికి వెళ్తే, పసుపు నీళ్లతో కడుగుతున్నారు . చర్చలు జరగాలనే ఉద్దేశ్యం సభలో లేదు. ఏం కొంపలు ఆరిపోయాయని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు హుటాహుటిన సస్పెండ్ చేశారు. ఎర్రవల్లి ఫాం హౌస్ మేము వెళ్తుంటే మమ్మల్ని అరెస్ట్ చేశారు. జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ లో బిఆర్ఎస్ శ్రేణుల పై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేశారని అన్నారు. కేసీఆర్ నివాసం ముట్టడి లో దళితులు మాత్రమే లేరు కాంగ్రెస్ అన్ని కులాల ఎమ్మెల్యేలు కేసీఆర్ నివాసానికి అన్ని కులాల వారిని పంపారు. .గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సా రెడ్డి ఆ ర్యాలీ లో ఉన్నారు .గాయపడ్డారు. ..దళితులు పాల్గొన్నారనే శుద్ధి చేశారని అనవసరంగా కాంగ్రెస్ సభ్యులు రాద్దాశీతం చేస్తున్నారు. ..శుద్ధి చేసిన వారిలో బీ ఆర్ ఎస్ ఎమ్మెల్యేలు ఎవరూ లేరని అన్నారు.

# అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి చర్యలను సహించేది లేదు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి తలవంపు తెచ్చేలా బీఆర్ఎస్ వ్యవహరిస్తోంది. ఎర్రవల్లి వద్ద దళితులు డప్పులు కొడుతూ నిరసన తెలిపిన ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.బుధవారం అయన శాసనమండలిలో మాట్లాడారు. పొన్నం మాట్లాడుతూ దళితులు డప్పులు కొట్టిన ప్రదేశాన్ని శుద్ధి చేయడం దళితులను, యావత్ సమాజాన్ని అవమానించడమే. నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించింది. డప్పు కొట్టడం దళితుల సంప్రదాయ వృత్తిలో భాగం. నిరసనల్లో డప్పులను ఉపయోగించడం కొత్తేమీ కాదు. తెలంగాణ రాష్ట్రం కోసం కొట్లాడినప్పుడు.. రాష్ట్రం ఏర్పడితే 90 శాతం ఉన్న బడుగు, బలహీన, అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందని ఆశించాం. కానీ నేడు ఎస్సీ, ఎస్టీ, బీసీలను నిమ్నంగా భావించే పరిస్థితులు కనిపించడం బాధాకరమని అన్నారు.దళితులు డప్పులు కొట్టి నిరసన తెలిపిన ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం వెనుకటి రోజుల్లో ఉన్న తారతమ్యాలను గుర్తుకు తెస్తోంది. ఇలాంటి చర్యలు సమాజంలో తీవ్ర అసమానతలకు, శాంతిభద్రతల సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. 14 సార్లు ఎన్నికల్లో గెలిచిన ప్రజాస్వామ్యవాది, రాజ్యసభ ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని కూడా బీజేపీ నేతలు శుద్ధి చేశారు. అక్కడ బీజేపీ ఇక్కడ బీఆర్ఎస్ ం దళితులకు వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.. ఇప్పుడు దళితులు డప్పులు కొడుతూ నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేయడం దళితులను అవమానించడమే. పసుపు పవిత్రమైనదే.. గౌరమ్మ, కొమురవెల్లి మల్లన్న, ఎల్లమ్మ ఆలయాల్లో బండారిగా ఉపయోగించే పసుపును ఇలా అవమానకరమైన రీతిలో శుద్ధి కార్యక్రమాలకు ఉపయోగించడం బాధాకరం. దళితులను అవహేళన చేస్తూ, వారు నిరసన తెలిపిన ప్రదేశాన్ని శుద్ధి చేయడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు.. తలవంచుకునే పరిస్థితి. ఇలాంటి సంఘటనలను శాసన మండలి తీవ్రంగా ఖండించాలి. నిన్న ఎర్రవల్లి వద్ద జరిగిన ఘటనపై సభ విచారం వ్యక్తం చేయాలి. బీఆర్ ఎస్ నేతలు చేసిన తప్పును సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి. అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి చర్యలను సహించేది లేదు. తెలంగాణలో సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు.

# ఫ్యూచర్ సిటీకి సిక్స్ లైన్స్ రోడ్

**హైదరాబాద్ పెన్ పవర్:**
భారత్ ఫ్యూచర్ సిటీకి కీలకమైన రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఓఆర్ఆర్ రావిర్యాల ఇంటర్‌ఛేంజ్ నుంచి ఆమన్‌గల్లు వరకు 41.5 కిలోమీటర్ల మేర ఆరు లైన్లరహదారిని నిర్మిస్తున్నారు. రెండు విడతల్లో చేపడుతున్న ప్రాజెక్టుకు మొత్తం రూ.4,621 కోట్ల వ్యయం చేస్తున్నారు. భవిష్యత్‌లో మరో నాలుగు లైన్ల విస్తరణకు వీలుగా ప్రణాళిక రూపొందించారు. మెట్రో లేదా రైల్వే కారిడార్ కోసం 20 మీటర్ల స్థలాన్ని రిజర్వు చేశారు. ప్రాజెక్టు పూర్తయితే ఫ్యూచర్ సిటీకి రవాణా, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.తెలంగాణ ప్రభుత్వంప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీకి రాజమార్గం రెడీ అవుతోంది. రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రేడియల్ రోడ్డు-1లో భాగంగా చేపడుతున్న ఈప్రాజెక్టులో భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మార్గమధ్యంలో ఉన్న చిన్నచిన్న కొండలను తొలగిస్తూ రహదారి నిర్మాణానికి అవసరమైన మట్టిపనులు చేపడుతున్నారు.అవసరమైన చోట్ల వంతెనల నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) రావిర్యాల ఇంటర్‌ఛేంజ్ నుంచి ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు ఆమన్‌గల్లు వరకు 41.5 కిలోమీటర్లపొడవున ఈ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మిస్తున్నారు. ఆరు లైన్ల యాక్సెస్ కంట్రోల్ విధానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో రహదారిని అభివృద్ధి చేస్తున్నారు. మొత్తం 100 మీటర్ల వెడల్పుతో నిర్మించే ఈ మార్గంభవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందుతోంది.ప్రస్తుతం ఆరు లైన్ల రహదారిని నిర్మించనుండగా.. భవిష్యత్తులో మరో నాలుగు లైన్లను విస్తరించేందుకు వీలుగా ప్రణాళిక రూపొందించారు. ఇందుకు అనుగుణంగా అవసరమైన భూసేకరణ చేపడుతున్నారు. ఈ రహదారి పూర్తయితే ఓఆర్ఆర్, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య అనుసంధానం బలోపేతం కావడంతో పాటు ఫ్యూచర్ సిటీకి వేగవంతమైన రాకపోకలు సాధ్యమవుతాయి.ప్రాజెక్టును రెండు విడతల్లో చేపడుతున్నారు. తొలివిడతలో రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు 19.2 కిలోమీటర్ల మేర రహదారిని నిర్మిస్తున్నారు. కొంగర్‌ఖుర్ద్, ఫెరోజ్‌గూడ, కొంగరకలాన్,



లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట్ ప్రాంతాల మీదుగా ఈ మార్గం సాగుతుంది. తొలి విడత నిర్మాణానికి రూ.1,911 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. రెండో విడతలో మీర్‌ఖాన్‌పేట్ నుంచి ఆమన్‌గల్లు వరకు 22.3 కిలోమీటర్ల మేర రహదారి నిర్మించనున్నారు. కుర్మిద్ద, కడ్తాల్, ఆకుతోటపల్లి, ఆమన్‌గల్లు ప్రాంతాల మీదుగా ఈ మార్గం సాగుతుంది. రెండో విడత కోసం రూ.2,710 కోట్ల వ్యయం చేయనున్నారు. రెండు విడతల పనులను రిత్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎల్‌అండ్‌టీ సంస్థలు చేపడుతున్నాయి.రహదారి మధ్యలోభవిష్యత్తులో మెట్రో లేదా రైల్వే కారిడార్ ఏర్పాటు చేసేందుకు 20 మీటర్ల స్థలాన్ని ప్రత్యేకంగా రిజర్వు చేయడం ప్రాజెక్టులో మరో కీలక అంశం. దీంతో భవిష్యత్‌లో ప్రజా రవాణా వ్యవస్థను ఈ కారిడార్‌తో అనుసంధానించేందుకు అవకాశం ఉంటుంది. ఎక్స్‌ప్రెస్‌వేకు ఇరువైపులా మూడు లేన్ల సర్వీస్ రోడ్లు, రెండు మీటర్ల గ్రీన్‌బెల్ట్, మూడు మీటర్ల వెడల్పుతో సైకిల్ ట్రాక్, రెండు మీటర్ల ఫుట్‌పాత్, రెండు మీటర్లయుటిలిటీ కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఇది కేవలం వాహనాల రాకపోకలకు మాత్రమే కాకుండా పాదచారులు, సైక్లిస్టులు, స్థానిక రవాణాకు కూడా ఉపయోగపడే సమగ్ర రహదారి వ్యవస్థగారూపుదిద్దుకోనుంది.రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే అందుబాటులోకి వస్తే భారత్ ఫ్యూచర్ సిటీతో హైదరాబాద్ నగరానికి అనుసంధానం మరింత మెరుగుపడనుంది. రహదారి వెంట పారిశ్రామిక, వాణిజ్య,నివాస అభివృద్ధికి ఊతం లభించే అవకాశం ఉంది. ముఖ్యంగా వేగవంతమైన రవాణా సదుపాయాలతో ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెరగడంతో పాటు రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు బిగ్ బూస్ట్ ఉంటుందనినిపుణులు చెబుతున్నారు.

# కాంగ్రెస్ లో రేవంత్ కు ఫుల్ పవర్స్...



**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాలు గమనిస్తే ఒక స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. అంతర్గత ప్రజాస్వామ్యం పేరుతో బహిరంగంగా విమర్శలు చేసుకోవడం, మీడియాముందుకు వచ్చి సొంత పార్టీ నేతలపై లేదా ప్రభుత్వంపై అసంతృప్తి వెళ్లగక్కడం కాంగ్రెస్‌లో చాలా కాలంగా నడుస్తున్న సంస్కృతి. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు టీపీసీసీ డిసిప్లినరీయాక్షన్ కమిటీ చర్యలకు శ్రీకారం చుట్టింది. నాగార్జునసాగర్, నాగర్‌కర్నూల్ ఎంపీ, కమిటీ ఛైర్మన్ మల్లు రవి నేతృత్వంలో వరుసగా నోటీసులు ఇస్తూ అసంతృప్తులకు చెక్ పెడుతున్నారు.ఇటీవలే ఒకే రోజుఏకంగా తొమ్మిది మంది కీలక నేతలకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం గాంధీ భవ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టించింది. ఇందులో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కాన్వాయ్‌పై దాడి ఘటనకు సంబంధించిఐదుగురు స్థానిక నేతలకు నోటీసులు ఇవ్వగా.. గజ్వేల్‌లో ఘర్షణలలో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, జూపల్లి మల్లారెడ్డిలకు నోటీసులు వెళ్లాయి. ఆదిలాబాద్ వివాదంలో కంది శ్రీనివాస్ రెడ్డి, సంజీవ్‌రెడ్డిల వివరణ కోరారు. ఎంతటి సీనియర్ నేతలైనా సరే, బహిరంగ వివాదాలకు దిగితే సహించేది లేదని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారుఈ కఠిన వైఖరి వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీనాయకత్వానికి ఢిల్లీ అధిష్టానం పూర్తి స్థాయిలో స్వేచ్ఛను ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా కేబినెట్ విస్తరణ అంచనాల వేళ, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి సీనియర్లుఘాటు వ్యాఖ్యలు చేసినప్పటికీ, ఆ తర్వాత సీఎం సమావేశాల్లో పాల్గొని లైన్‌లోకి రావడం ద్వారా ఒక స్పష్టమైన సంకేతం వెళ్లింది. తిరుగుబాటు స్వరాలు వినిపిస్తే మంత్రి పదవులే కాదు, పార్టీలో ఉనికికేప్రమాదమనే విషయాన్ని ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తప్పించడం ద్వారా అధిష్టానం ప్రాక్టికల్‌గా రుజువు చేసింది.ఇకపై ఎవరూ నోరెత్తకుండా రేవంత్ రెడ్డి చెప్పినట్లే వింటారా? అనే కోణంలో చూస్తే.. ఇది కేవలం రేవంత్ రెడ్డి ఏకపక్ష నిర్ణయం మాత్రమే కాదు. అధిష్టానం ప్రతినిధి మీనాక్షి నటరాజన్ మార్గదర్శకంలోనే మల్లు రవి ఈ కఠిన చర్యలు తీసుకుంటున్నారు. పార్టీ క్రమశిక్షణను కాపాడే బాధ్యతను రేవంత్ రెడ్డి-పీసీసీలకే అప్పగించడంతో చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతీ ఒక్కరూ పార్టీ గీత దాటితే చర్యలు ఖాయమని అర్థమైపోయింది. కాంగ్రెస్ లాంటి కల్చర్ ఉన్న పార్టీలో అసమ్మతిని నూటికినూరు శాతం అణచివేయడం సులభం కాకపోయినా, ఈ కఠిన నిర్ణయాల వల్ల తాత్కాలికంగానైనా నేతలు సైలెంట్ అయ్యే అవకాశం ఉంది. రాబోయే స్థానిక పోరులో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డిటీమ్ ముందుకు సాగుతున్న తరుణంలో, ఈ క్రమశిక్షణా అస్త్రం పార్టీ శ్రేణుల్లో ఐక్యతను తీసుకొస్తుందో లేదో వేచి చూడాలి.

# ఎండిపోతున్న పంటలు... రైతుల గగ్గోలు...

**నిజామాబాద్, సెప్టెంబర్ 9, పెన్ పవర్:**
తెలంగాణలో వర్షాకాల సీజన్ కీలక దశకు చేరుకున్న సమయంలో వర్షాభావ పరిస్థితులు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే ఆశించిన స్థాయిలో పంటల సాగు జరగకపోగా.. ప్రస్తుతంపంటల ఎదుగుదలకు అత్యవసరమైన వర్షాలు లేకపోవడం సమస్యగా మారింది. రాష్ట్రంలో ఈ వర్షాకాల సీజన్‌లో ఇప్పటివరకు సాధారణ వర్షపాతంతో పోలిస్తే 22.5 శాతం లోటు నమోదైంది. ముఖ్యంగా20 జిల్లాల్లోని 376 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు రైతాంగంపై ప్రభావం చూపుతున్నాయి.నాలుగు నెలల వర్షాకాల సీజన్‌లో జూన్‌లో 11.74 శాతం, జూలైలో 1.36 శాతం, ఆగస్టులో 37.67 శాతం, సెప్టెంబరులో ఇప్పటివరకు ఏకంగా 77.76 శాతం వర్షపాతం లోటు నమోదైంది.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు సాధారణంగా 626.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 485.5 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. దీంతో 140.6 మిల్లీమీటర్ల లోటు ఏర్పడింది.జిల్లాల వారీగా పరిస్థితిని పరిశీలిస్తే హనుమకొండలో అత్యధికంగా 48.73 శాతం లోటు నమోదైంది. ఆ తర్వాత వరంగల్‌లో 47.58, జనగామలో 44.14, జోగులాంబ గద్వాలలో 42.44,భద్రాద్రి కొత్తగూడెంలో 37.93 శాతం లోటు ఉంది. ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, మహబూబాబాద్, ఖమ్మం, వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్,నారాయణపేట, వనపర్తి, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్ జిల్లాల్లోనూ వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి.

రాష్ట్రంలోని 621 మండలాల్లో 15 మండలాల్లో అత్యధిక లోటు,361 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. 213 మండలాల్లో సాధారణ వర్షపాతం ఉండగా.. 32 మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. వర్షాభావం ప్రభావం ప్రధానంగా వరి సాగుపై పడింది. రాష్ట్రంలోమొత్తం వ్యవసాయ పంటల సాధారణ విస్తీర్ణం 1,32,38,446 ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 1,22,70,185 ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. అంటే 92.69 శాతం విస్తీర్ణంలో మాత్రమే సాగు పూర్తయింది.గత ఏడాది ఇదే సమయానికి 1,28,76,525 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి.ప్రధాన పంట వరి పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. సాధారణంగా 65,95,645 ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉండగా..ఇప్పటివరకు 53,88,969 ఎకరాల్లో మాత్రమే సాగైంది. అంటే 81.7 శాతం విస్తీర్ణానికే పరిమితమైంది. గత ఏడాది ఇదే సమయానికి 63,66,253 ఎకరాల్లో వరి సాగైంది. కీలక సాగుసమయం దాటిపోవడంతో ఇక వరి విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం వరి పంట ఎదుగుతున్న దశలో ఉండటంతో వర్షాలు లేక పొలాల్లో నీటి కొరత ఏర్పడుతోంది.కొన్ని ప్రాంతాల్లో నాట్లు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. మరోవైపు పత్తి, ఇతర పంటలు కాత, పూత దశకు చేరుకున్నాయి. ఈ దశలో తగినంత తేమ అందకపోతే దిగుబడులపై ప్రభావం పడే అవకాశంఉంది. వ్యవసాయశాస్త్రవేత్తల ప్రకారం పంటలను ప్రస్తుత పరిస్థితి నుంచి గట్టెక్కించాలంటే కనీసం రెండు నుంచి మూడు భారీ వర్షాలతో పాటు వారం రోజులపాటు సాధారణ వర్షాలు అవసరం. అప్పుడేపంటలకు అవసరమైన తేమ లభించి దిగుబడులపై ప్రతికూల ప్రభావాన్ని కొంతవరకు తగ్గించే అవకాశం ఉంటుంది. ఇదిలా ఉండగా, వరి సాగుకు అనుకూల పరిస్థితులు లేకపోవడంతో ప్రత్యామ్నాయపంటలపై వ్యవసాయశాఖ దృష్టి సారిస్తోంది. వరి పొలాల్లో గడ్డి పెరిగిన ప్రాంతాల్లో ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్ సాగు ఆశాజనకంగా ఉంటుందని రైతులకు అవగాహన కల్పిస్తోంది. ఆయిల్‌పామ్‌సాగును ప్రోత్సహించేందుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సూక్ష్మసేద్య పరికరాలను అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

## మైలేజ్ ఎవరికి డ్యామేజ్ ఎవరికి

**హైదరాబాద్, సెప్టెంబర్ 9, పెన్ పవర్:**
తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాల తొలిరోజే అసెంబ్లీ ప్రాంగణం తీవ్ర ఉద్రిక్తతకు, రాజకీయ వ్యూహప్రతివ్యూహాలకు వేదికగా మారింది. సభ లోపల ఏం జరిగిందనే దానికంటే కూడా, సభ బయట

ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ , అధికార కాంగ్రెస్ మధ్య నడిచిన పొలిటికల్ వార్ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అసెంబ్లీ ప్రారంభానికి ముందే పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగిన బీఆర్ఎస్‌నాయకత్వం, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు నల్ల చొక్కాలు ధరించి, ప్లకార్డులతో నిరసనకు దిగింది. కేటీఆర్, హరీశ్‌రావు నేతృత్వంలో గులాబీ శ్రేణులు చేసిన ఈ హంగామాతో మీడియా దృష్టి మొత్తంఒక్కసారిగా వారివైపే మళ్లింది.అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు నిరసనకారులను అడ్డుకోవడంతో తోపులాట జరిగి వాతావరణం మరింత వేడెక్కింది. ప్రభుత్వంపై నైతిక విజయం సాధించి, రాజకీయాన్ని పూర్తిగాతమకు అనుకూలంగా మార్చుకోవాలన్న బీఆర్ఎస్ వ్యూహం మొదటి దశలో విజయవంతమైనట్లే కనిపించింది. మీడియా అటెన్షన్ సాధించడం, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రక్షణలో పడేయడంలో ప్రతిపక్షం

అనుకున్న లక్ష్యాన్ని దాదాపు చేరుకుంది. అయితే, ఈ పొలిటికల్ గేమ్‌లో బీఆర్ఎస్ సాధించిన మైలేజ్ అంతా ఒక్క చిన్న తొందరపాటు వ్యాఖ్యతో తలకిందులైంది.భద్రతా సిబ్బందితో జరిగిన తోపులాట,పోలీసుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేసే క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. స్పీకర్ పదవినీ, వ్యవస్థలను ఉద్దేశించి ఆయన చేసినట్లుగా ప్రచారంలోకి వచ్చిన అనుచిత వ్యాఖ్యలురాజకీయంగా పెద్ద దుమారాన్ని లేపాయి. ప్రభుత్వ విధానాలపై దాడి చేయాల్సిన ప్రతిపక్షం, ఈ ఒక్క ఘటనతో ఒక్కసారిగా స్వయంగా ఆత్మరక్షణలో పడిపోవాల్సిన పరిస్థితి తలెత్తింది. నిరసనలతోసంపాదించిన మైలేజ్ కాస్తా ఈ వివాదంతో ఆవిరైపోయింది. బీఆర్ఎస్ దూకుడుకు కౌంటర్ ఇచ్చేందుకు సరైన అవకాశం కోసం చూస్తున్న అధికార కాంగ్రెస్‌కు తాతా మధు వ్యాఖ్యలు అతిపెద్ద అస్త్రంగామారాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహలతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా బీఆర్ఎస్ వైఖరిపై విరుచుకుపడ్డారు.దళిత వర్గానికి చెందిన సభాపతిని, రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ స్థానాన్ని అవమానించారంటూ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీంతో పొలిటికల్ నరేటివ్ ఒక్కసారిగా మారిపోయి కాంగ్రెస్‌స్పష్టమైన ఆధిక్యంలోకి వచ్చింది.అధికార పక్షం నుంచి అనూహ్య రీతిలో ఎదురుదాడి జరగడం, సమాజంలో కూడా ప్రతికూల సంకేతాలు వెళ్తున్నాయని గ్రహించిన బీఆర్ఎస్ తీవ్ర ఒత్తిడికి లోనైంది. వివాదంమరింత ముదరకుండా ఉండేందుకు ఎమ్మెల్సీ తాతా మధు వెంటనే స్పందిస్తూ, తాను సభాధిపతిని ఉద్దేశించి ఆ మాటలు అనలేదని, కేవలం తమపై దౌర్జన్యం చేసిన పోలీసుల తీరుపైనే మాట్లాడాననివివరణ ఇచ్చుకున్నారు. ఏదేమైనా ఆ వ్యాఖ్యల వల్ల ఎవరైనా మనస్తాపం చెంది ఉంటే ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించక తప్పలేదు. వర్షాకాల సమావేశాల తొలిరోజు అసెంబ్లీ వెలుపల నడిచిన ఈపొలిటికల్ డ్రామా తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర మైండ్ గేమ్‌కు అద్దం పట్టింది. ఆరంభంలో నల్ల టీషర్టుల నిరసనతో హంగామా సృష్టించి పైచేయి సాధించిన బీఆర్ఎస్, సొంత నేత చేసిన వ్యాఖ్యల వల్ల

చివరకు డిఫెన్స్‌లో పడాల్సి వచ్చింది. సమయాన్ని ఏమాత్రం వృథా చేయకుండా ఆ తప్పును పట్టుకుని తిప్పికొట్టిన కాంగ్రెస్, మొదటిరోజు పొలిటికల్ అడ్వాంటేజ్ సాధించడంలో విజయం సాధించిందనే

చెప్పాలి. ప్రూఫ్ లతో చూపించిన అధికార పార్టీతెలంగాణ అసెంబ్లీ వేదికగా అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య సాగుతున్న రాజకీయ యుద్ధం ఊహించని మలుపులు తిరుగుతోంది. సమావేశాల ప్రారంభ వేళ ప్రజా సమస్యలపైప్రభుత్వాన్ని నిలదీసి ఇరకాటంలో పెట్టాలని భావించిన బీఆర్ఎస్, అనూహ్యంగా తానే తీవ్ర ఆత్మరక్షణలోకి జారుకుంది. ఆందోళనలతో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని వేసిన ఎత్తుగడలు కాస్తా, అధికారపక్షం విడుదల చేసిన వీడియో ఆధారాలు, స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల దుమారంతో బెడిసికొట్టాయి.అసెంబ్లీ సమావేశాల తొలి రోజే నల్ల టీషర్టులు ధరించి, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన ర్యాలీతోసభలోకి ప్రవేశించాలని బీఆర్ఎస్ వ్యూహం రచించింది. అయితే అసెంబ్లీ సమీపంలో పోలీసులు గులాబీ నేతలను అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు తమ ప్రజాప్రతినిధులపైదౌర్జన్యం చేశారని, మహిళా సభ్యులతో దురుసుగా ప్రవర్తించారని బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆరోపణలు గుప్పించారు. మహిళా ఎమ్మెల్యేలు మీడియా ముందే కన్నీటిపర్యంతం కావడం, కొందరు నేతలకుగాయాలయ్యాయని ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందడంతో తొలిరోజు ప్రజల్లో కాస్త సానుభూతి వ్యక్తమైంది. పోలీసుల అత్యుత్సాహమే ఇందుకు కారణమంటూ ప్రభుత్వంపై నైతిక దాడినిప్రారంభించింది.బాధితుల కార్డుతో పైచేయి సాధించవచ్చని భావించిన గులాబీ దళానికి ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్ ఊహించని షాక్ ఇచ్చింది. ఘటనా స్థలంలో రికార్డయిన వీడియోలు, ఫోటోలను ప్రభుత్వం

ఆధారాలతో సహా మంగళవారం బహిర్గతం చేయడంతో కథ అడ్డం తిరిగింది. పోలీసులు దాడి చేయలేదని, గులాబీ ప్రజాప్రతినిధులే ఖాకీలపై భౌతిక దాడులకు దిగారని ఈ దృశ్యాలు స్పష్టం చేస్తున్నాయి.నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తిస్తున్న పోలీసుల చొక్కాలు పట్టుకుని లాగడం, విధుల్లో ఉన్న మహిళా పోలీసులపైకి దూసుకువెళ్లడం కనిపించింది. వీటన్నింటికీ మించి స్వయంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌కేటీఆర్ ఓ పోలీసు అధికారిని తోసేస్తున్న దృశ్యాలు వెలుగులోకి రావడంతో బీఆర్ఎస్ కథనం ఒక్కసారిగా బలహీనపడింది. శాంతిభద్రతలను కాపాడే పోలీసులపైనే దాడి చేసి, ఎదురు బాధితులమని ప్రచారంచేసుకోవడం ఏమిటన్న ప్రశ్నలు ప్రజాక్షేత్రంలో మొదలయ్యాయి.

## హిజ్రాల దందాపై పోలీసులు దృష్టి

**రంగారెడ్డి, సెప్టెంబర్ 9, పెన్ పవర్:** శుభకార్యాలు, వేడుకలు జరిగే ప్రదేశాలకు హిజ్రాలు కచ్చితంగా ఎలా వస్తారు? ఎక్కడ ఏ చిన్న ఫంక్షన్ జరిగినా వారికి ముందుగా సమాచారం ఎలా అందుతుంది? ఈ ప్రశ్నలు చాలామంది మదిని తొలిచేవే. ఇటీవల హైదరాబాద్‌లోని చింతల్‌లో ఓ గృహప్రవేశం సందర్భంగా హిజ్రాలు ప్రవర్తించిన తీరుపై తీవ్ర దుమారం రేగడంతో వారి సమాచార వ్యవస్థపై చర్చ మొదలైంది. దీని వెనుక ఓ పక్కా వ్యవస్థ, పెద్ద నెట్‌వర్క్ పనిచేస్తోందనే విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది.ఇంతకీ వీరికి సమాచారం ఎలా అందుతుందంటే.. దీని వెనుక పక్కా కమీషన్ దందా నడుస్తోందని ఓ హిజ్రా స్వయంగా ఓ యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూలో వెల్లడించారు. పెళ్లిళ్లు, గృహప్రవేశాల వంటి శుభకార్యాల వివరాలను తమకు చేరవేసేందుకు ప్రత్యేకంగా కొందరు వ్యక్తులు పనిచేస్తారని ఆమె తెలిపారు. వారి ద్వారానే తమకు ఫంక్షన్ల లోకేషన్లు తెలుస్తాయని వివరించారు.

**సమాచారం ఇచ్చేది వీరే..**

ఆమె చెప్పిన వివరాల ప్రకారం.. శుభకార్యాలకు సంబంధించిన వ్యక్తులే హిజ్రాలకు ప్రధాన ఇన్ఫార్మర్లు.

టెంట్ హౌస్ వాళ్లు: ఫంక్షన్‌కు టెంట్లు, కుర్చీలు సరఫరా చేసేవారు. పంతుళ్లు: పూజలు, శుభకార్యాలు జరిపించే పురోహితులు. గోమాతను తెచ్చేవారు: గృహప్రవేశాల వంటి వాటికి గోమాతను తీసుకువచ్చేవారు.

సన్నాయి మేళం వాళ్లు: ఫంక్షన్లలో సంగీత కార్యక్రమాలు నిర్వహించేవారు. బిల్డర్లు, వాచ్‌మెన్లు: కొత్తగా నిర్మించిన ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో పనిచేసేవారు. ఈ వ్యక్తులు ఫలానా చోట ఫంక్షన్ జరుగుతోందని ముందుగానే తమకు ఫోన్ చేసి లోకేషన్ పంపిస్తారని సదరు హిజ్రా తెలిపారు.కేవలం సమాచారం ఇవ్వడమే కాదు, దీనికి వారు కమీషన్ కూడా తీసుకుంటారని ఆమె చెప్పడం గమనార్హం. గతంలో ఒక్కో లోకేషన్‌కు రూ.200 నుంచి రూ.500 ఇచ్చేవాళ్లమని, ఇప్పుడు డిమాండ్ పెరగడంతో రూ.2000 ఇవ్వనిదే ఎవరూ సమాచారం ఇవ్వడం లేదని ఆమె అన్నారు. ముఖ్యంగా గృహప్రవేశానికి గోమాతను తీసుకొచ్చేవారు రూ.3000 వరకు డిమాండ్ చేస్తారని, అంత ఇస్తేనే గానీ అడ్రస్ చెప్పరని వివరించారు. ఈ నెట్‌వర్క్‌లో ఎవరు ముందుగా సమాచారం ఇస్తే, వారికే కమీషన్ డబ్బులు చెల్లిస్తామని తెలిపారు.చింతల్ ఘటనపై స్పందిస్తూ, కొందరు హిజ్రాలు మాత్రమే డబ్బుల కోసం దౌర్జన్యంగా ప్రవర్తిస్తారని, వారి వల్లే తమ వర్గం మొత్తానికీ చెడ్డపేరు వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా కడుపు నింపుకోవడానికే ఈ పని చేస్తామని, చాలామంది ఎంత ఇస్తే అంత తీసుకుని ఆశీర్వదించి వెళ్లిపోతారని చెప్పారు. కొందరు దాతలు తమనుస్వయంగా ఇళ్లకు పిలిపించుకుని గౌరవిస్తారని గుర్తుచేశారు. ఏదేమైనా శుభకార్యాల వద్ద హిజ్రాల సందడి వెనుక ఇంత పెద్ద కమీషన్ నెట్‌వర్క్ పనిచేస్తోందనే విషయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## ఘనంగా తెలంగాణ భాష దినోత్సవం



కాళోజి నారాయణకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

**గార్ల పెన్ పవర్ సెప్టెంబర్ 9:** గార్ల మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవాన్ని జాతీయ సేవా పథకం పిఓ వేముల రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు తొలుత నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు లెక్చరర్ వేముల రవీందర్ ను కళాశాల సిబ్బంది శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఐవి రాజకుమారి మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో ఎందరో కవులు, రచయితలకు కాళోజీ స్ఫూర్తిగా నిలిచారని, తెలంగాణ భాషా పరిరక్షణకు కృషి చేయడంతో పాటు తన రచనలు, కవితల ద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యం, ఉద్యమ స్ఫూర్తిని నింపిన మహనీయుడని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జోగ్యా ప్రసాదరావు సోమన్న నాగేశ్వరరావు సుజాత రాకేష్ లక్మాలాల్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజాకవి కాళోజీ స్ఫూర్తి చిరస్మరణీయం

గార్ల పెన్ పవర్ సెప్టెంబర్ 9: తెలుగు సాహిత్యానికి ప్రజాకవి కాళోజీ నారాయణరావు చేసిన సేవలు చిరస్మరణీయమని గార్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతి హతిరం నాయక్ అన్నారు. గార్ల మండల కేంద్రంలోని స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు తొలుత నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ యాసకు, భాషకు గౌరవాన్ని కలిగించిన మహనీయుడు, ప్రజాకవి కాళోజీ అని, నిజాం నిరంకుశత్వాన్ని ఎదిరించిన పోరాట యోధుడు అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జేరినా బేగం పంచాయతీ కార్యదర్శి మధు నాయుడు జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ వార్డు సభ్యులు తోడేటి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హాథిరాం రహీం గ్రామపంచాయతీ సిబ్బంది సుధాకర్ దాసు తదితరులు పాల్గొన్నారు.




నివాళులు అర్పిస్తున్న సర్పంచ్

## తూంకుంట నర్సారెడ్డిని పరామర్శించిన ఉప్పల శ్రీనివాస్ గుప్త

**ఎల్బీనగర్, పెన్ పవర్ సెప్టెంబర్ 9:** ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద బుధవారం జరిగిన ఘటన లో గాయపడి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట మాజీ డీసీసీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి గారిని టీపీపీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. నర్సారెడ్డి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అందుతున్న వైద్య చికిత్స, ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో వివరంగా మాట్లాడారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు మెరుగైన వైద్యం అందేలా అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. నర్సారెడ్డి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.



## ఈవీల కోసం ఎగబడుతున్న జనం

**ముంబై, సెప్టెంబర్ 9, పెన్ పవర్:** రోజురోజుకూ వాహన కొనుగోలుదారుల అభిరుచి మారిపోతోంది. మొదట్లో ఎలక్ట్రిక్ వాహనాలను కొనేందుకు జనం అంతగా ఆసక్తి చూపించలేదు. కానీ క్రమంగా ఇవి జోరందుకుంటున్నాయి. ఇప్పుడు ఆగస్ట్ నెలలో రికార్డు స్థాయిలో ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడుబోయాయి. ఓవరాల్‌గా 2026 ఆగస్టులో ఈవీ రిటైల్ విక్రయాలు 2,98,448 యూనిట్లుగా నమోదయ్యాయి. అంతకుముందు ఏడాది ఇదే సమయంతో చూస్తే ఏకంగా 52.9 శాతం వృద్ధి కనిపించింది. అంటే ఇప్పుడు సాధారణ పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ ఏ స్థాయిలో పెరిగిందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ సేల్స్ డేటాను విడుదల చేసింది.అయితే ఈ ఎలక్ట్రిక్ వాహనాల్లో కేవలం కార్లు మాత్రమే కాదు.. టూ వీలర్లు, 3 వీలర్లు, ప్యాసింజర్ వాహనాలు, కమర్షియల్ వాహనాలు ఇలా అన్నీ ఉంటాయి. వీటి సేల్స్ 2025 ఆగస్టులో 1,95,250 యూనిట్లుగా ఉండేది. మొత్తంగా వాహనాల మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాల వాటా 9.5 శాతం నుంచి ఇప్పుడు 12.3 శాతానికి చేరినట్లు ఫాడా వెల్లడించింది. ఇక్కడ సెగ్మెంట్ వారీగా చూస్తే.. టూ వీలర్ సెగ్మెంట్లో చూస్తే మొత్తంగా 1,83,204 వాహనాలు అమ్ముడుబోయాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడే 67.05 శాతం విక్రయాలు పెరిగాయి. జులైతో పోలిస్తే మాత్రం స్వల్పంగా 10.37 శాతం తగ్గడం గమనార్హం. ఇక ఎలక్ట్రిక్ ప్యాసింజర్ రిటైల్ వాహనాల విక్రయాలు గతేడాది ఆగస్టుతో పోలిస్తే 51.89 శాతం పెరిగి 30,696 యూనిట్లకు పెరిగాయి. జులైతో పోలిస్తే ఇక్కడ 6.78 శాతం తగ్గింది. ఇక్కడ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ బ్రాండ్ నుంచే 13,158 యూనిట్లు అమ్ముడుబోవడం విశేషం. తర్వాత మహీంద్రా అండ్ మహీంద్రా 5464 యూనిట్ల విక్రయాలతో రెండో స్థానంలో ఉంది.త్రీ వీలర్ సెగ్మెంట్లో రిటైల్ వెహికిల్ సేల్స్ 79846 యూనిట్లకు చేరుకున్నాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడ వృద్ధి 25.28 శాతంగా నమోదైంది. ఇక ఇదే సమయంలో ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాల రిటైల్ సేల్స్ దాదాపు మూడింతలయ్యాయి. గతేడాది ఆగస్టుతో పోలిస్తే ఏకంగా 188.3 శాతం వృద్ధి చెంది ఇప్పుడు 4702 యూనిట్లకు చేరుకోవడం విశేషం. జులైతో పోలిస్తే కూడా ఇక్కడ 30 శాతానికిపైగా వృద్ధి నమోదైంది. భారత విద్యుత్ వాహనాల చరిత్రలోనే ఈ ఆగస్ట్ అత్యుత్తమంగా నిలిచినట్లు ఫాడా ప్రెసిడెంట్ సాయి గిరిధర్ తెలిపారు. పండగ సీజన్ కాకపోయినా, నాలుగు విభాగాల్లో ఈవీ సేల్స్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఈవీ ఆదరణకు అద్దం పడుతోందని చెప్పారు.

# సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్

### 33 బెంచీల ఏర్పాటు, రాజీ పడదగిన కేసులకు సత్వర పరిష్కారం

**ఎల్బీనగర్, పెన్ పవర్ సెప్టెంబర్ 9 :** పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన కేసులకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు ఈ నెల 12న రంగారెడ్డి జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. జిల్లాలోని వివిధ న్యాయస్థానాల పరిధిలో మొత్తం 33 బెంచీలను ఏర్పాటు చేసి, కక్షిదారులకు సత్వర న్యాయం అందించేలా ఏర్పాట్లు చేశారు. సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, మోటార్ వాహన ప్రమాద పరిహారం, కుటుంబ వివాదాలు, బ్యాంకింగ్ తదితర రాజీ పడదగిన కేసులతో పాటు ప్రీ-లిటిగేషన్ కేసులను కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం కల్పించారు. లోక్ అదాలత్ ద్వారా ఇరు పక్షాల పరస్పర అంగీకారంతో కేసులను త్వరగా పరిష్కరించుకోవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జిల్లా & సెషన్స్ జడ్జి ఎ. కర్ర కుమార్ తెలిపారు. దీనివల్ల కక్షిదారులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు వివాదాలకు సత్వర పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి. పవన్ కుమార్ మాట్లాడుతూ, సెప్టెంబర్ 12న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు, న్యాయవాదులు సద్వినియోగం చేసుకొని తమ కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, సంబంధిత అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు.





# గుడుంబా స్థావరాలపై పోలీసుల ఉక్కుపాదం

### 20 లీటర్ల గుడుంబా స్వాధీనం 300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం 34 వాహనాలు సీజ్



సీజ్ చేసిన వాహనాలతో పోలీసులు



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

**గార్ల, పెన్ పవర్, సెప్టెంబర్ 9:** గుడుంబా తయారీ, విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గార్ల మండల పరిధిలోని సీతంపేట గ్రామంలో బుధవారం గార్ల బయ్యారం సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. గుడుంబా తయారీ స్థావరాలను గుర్తించి 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోవడంతో పాటు, తయారీకి సిద్ధంగా ఉంచిన 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు.అదే సమయంలో సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 34 వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. గుడుంబా తయారీ, విక్రయాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు మత్తు పదార్థాల నియంత్రణపై పోలీసులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గంజాయి నిర్మూలన, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. అనంతరం ఈ సందర్భంగా బయ్యారం సీఐ రవీందర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆదేశాల మేరకు గుడుంబా తయారీ, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఎంతటివారైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అక్రమ గుడుంబా కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గ్రామాల్లో మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. అనుమానాస్పదంగా గుడుంబా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ దాడుల్లో గార్ల ఎస్సై సాయికుమార్, బయ్యారం ఎస్సై ప్రశాంత్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో విషాదం

# విద్యార్థి మృతి



మృతుడు సాత్విక్



మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు



మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని ధర్నా చేస్తున్న నేతలు



మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న అధికారులు, నేతలు

- వ్యాయామం చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిన 8వ తరగతి విద్యార్థి సాత్విక్
- కొడుకు మృతితో కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు
- గురుకుల పాఠశాల నిర్వహణపై విద్యార్థి సంఘాల ఆగ్రహం

**ఖమ్మం, పెన్ పవర్, సెప్టెంబర్ 9:** ఉదయం ఆరు గంటలకే గురుకుల పాఠశాలలో విషాదం చోటుచేసుకుంది. రోజువారీ వ్యాయామంలో భాగంగా మైదానంలో వ్యాయామం చేస్తున్న 8వ తరగతి విద్యార్థి సాత్విక్ ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. ఉదయం వరకు తమ కుమారుడు ఆరోగ్యంగా ఉన్నాడని భావించిన తల్లిదండ్రులకు కొద్దిసేపటికే అతడు మృతి చెందాడనే వార్త తెలియడంతో వారి గుండెలు పగిలిపోయాయి. రఘునాథపాలెం మండలంలోని బాలుర బీసీ గురుకుల పాఠశాలలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఖమ్మం తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామానికి చెందిన సలిగంటి హరీష్, ప్రియాంక దంపతుల కుమారుడు గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో గురుకుల పాఠశాలలోనే వ్యాయామం చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే పాఠశాల సిబ్బంది విద్యార్థిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే వైద్యులు పరీక్షించి విద్యార్థి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వ్యాయామ సమయంలో విద్యార్థి అకస్మాత్తుగా అస్వస్థతకు గురై మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించినట్లు తెలిసింది. కుమారుడి మృతి విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. తమ కుమారుడు విగతజీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యుల రోదనలు అక్కడున్న వారిని సైతం కలచివేశాయి. విద్యార్థి మృతదేహానికి అవసరమైన వైద్యపరమైన ప్రక్రియలు నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులు విద్యార్థి నేతలు దానం చేశారు. అనంతరం మృతదేహాన్ని కాకరవాయి గ్రామానికి తీసుకురాగా, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, బంధువులు తరలివచ్చి నివాళు లర్పించారు. చిన్న వయసులోనే విద్యార్థి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అనంతరం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

**గురుకులాల నిర్వహణపై ప్రశ్నలు**

ఈ ఘటనతో జిల్లా వ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వ్యాయామం, క్రీడల సమయంలో విద్యార్థులకు అత్యవసర ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు తక్షణ వైద్యం అందించే ఏర్పాట్లు ఉన్నాయా? విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారా? అనే ప్రశ్నలు తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నుంచి వినిపిస్తున్నాయి. గురుకుల పాఠశాలలో జరిగిన ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం లేకుండా రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కోరాయి. మరో కుటుంబానికి ఇలాంటి కన్నీటి పరిస్థితి రాకుండా గురుకులాల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు ప్రభుత్వం ఆర్థిక ప్రాధాన్యం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

**సాత్విక్ కుటుంబానికి ప్రభుత్వ సహాయం**

రఘునాథపాలెం మండలంలోని బీసీ గురుకుల పాఠశాలలో మృతి చెందిన కాకరవాయి గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థి సాత్విక్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. విద్యార్థి మృతి విషయం తెలుసుకున్న వెంటనే అధికారులు స్పందించి మృతుడి కుటుంబానికి రూ.1.20 లక్షల తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించారు. అలాగే పొంగులేటి రాఘవ, పీఎస్ఆర్ ట్రస్ట్ తరపున దహన సంస్కారాల కోసం రూ.10 వేల సహాయం అందించారు. మృతుడు విద్యార్థి కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ విధానంలోనైనా ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని స్థానిక నాయకులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ఘటనపై మంత్రి విచారం వ్యక్తం చేసి, మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

# జనసైనికుల్లో నెలకొన్న నైరాశ్యం




**కాకినాడ, సెప్టెంబర్ 9, పెన్ పవర్:** జనసేనలో స్తబ్దత నెలకొంది. ఇటు నేతల్లోనూ అటు కార్యకర్తల్లోనూ ఈ నైరాశ్యం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం పెద్దగా లేదు. అక్టోబరు చివరలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ నైరాశ్యం జనసేనను ఎటు వైపు తీసుకెళుతుందన్న చర్చ ఇటు పార్టీలోనూ, అటు కూటమిలోనూ జరుగుతోంది. పవన్ కల్యాణ్ అస్వస్థతకు గురయి కేరళలో ఆయుర్వేద చికిత్స తీసుకు వచ్చిన తర్వాత కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొంటారా? లేదా? అన్న దానిపై స్పష్టత లేదు. పవన్ ప్రచారానికి రాకుంటే పార్టీ తీవ్రంగా నష్టపోతుందన్న భావన జనసైనికుల్లోనూ, కూటమిలోని మిగిలిన పార్టీల్లోనూ వ్యక్తమవుతుంది. ఈ కారణం వల్లనే జనసైనికుల్లోనూ, నేతల్లోనూ కొంత స్తబ్దత నెలకొందని చెప్పాలి. జనసేన పార్టీలో ఎప్పుడైనా నైరాశ్యం లేదా స్తబ్దత నెలకొన్నప్పుడు, ఆ నైరాశ్యాన్ని పారదోలి పార్టీని ముందుకు నడిపేది ముమ్మాటికీ ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మాత్రమే. రాజకీయాల్లో ఒడిదొడుకులు సహజం. 2019 ఎన్నికల ఓటమి తర్వాత లేదా కూటమి రాజకీయాల నేపథ్యంలో కార్యకర్తలలో అక్కడక్కడా గందరగోళం, నైరాశ్యం ఏర్పడిన ప్రతిసారీ పవన్ కళ్యాణ్ తన స్ఫూర్తిదాయక ప్రసంగాలు, వ్యూహాత్మక నిర్ణయాలతో శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతూ వస్తున్నారు. పార్టీలో నైరాశ్యాన్ని పారదోలేందుకు, క్యాడర్‌ను ఉత్తేజపరిచేందుకు కేవలం పవన్ కల్యాణ్ మత్రమే కారణమవుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయడం, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టడం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమన్వయ కమిటీలను నియమించి దిశానిర్దేశం చేయడం ద్వారా శ్రేణులకు ఆయన భరోసా ఇస్తున్నారు. 2024 ఎన్నికల్లో సాధించిన 100% విజయంతో ప్రస్తుతం జనసేన ఏపీ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉంది. డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రజా సమస్యలపై స్పందిస్తున్న తీరు కార్యకర్తల్లో గర్వాన్ని, ఉత్సాహాన్ని నింపుతున్నాయి. నాదెండ్ల మనోహర్, నాగబాబు మరియు ఇతర ముఖ్య నేతలు పార్టీ అంతర్గత వ్యవహారాలను చక్కదిద్దుతూ, స్థానిక నాయకులను సమన్వయం చేస్తూ నైరాశ్యానికి తావులేకుండా చూస్తున్నారు. జనసేన బలం వారి అంకితభావం గల జనసైనికులు, వీరమహిళలు. విపక్షాల విమర్శలను తిప్పికొడుతూ సోషల్ మీడియా వేదికగా పార్టీ సిద్ధాంతాలను వారు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. పార్టీ ఎదుగుదల క్రమంలో ఇప్పుడు పవన్ కల్యాణ్ ఈ నైరాశ్యాన్ని పారదోలాలంటే స్వయంగా పూనుకోవాలి. అలాగే ఆగస్టు 15వ తేదీ నాటికి నియమిస్తామన్న కమిటీల నియామకాన్ని వెంటనే చేపట్టాలి. నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించాలన్నఅభిప్రాయం వ్యక్తమవుతుంది.

# పార్టీల పేర్లతో ఐడీలు తీవ్రమైన ఈగో పోరు

**విజయవాడ, సెప్టెంబర్ 9, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వ విధానాలు, విజయాలు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుపడుతున్న ప్రధాన శక్తి ప్రతిపక్షం కంటే కూడా ఇరు పార్టీల సానుభూతిపరులుగా సోషల్ మీడియాలో చెలామణి అవుతున్నవారే. అనడంలో ఎలాంటి సందేహం లేదు. క్షేత్రస్థాయిలో నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ పొత్తు ధర్మాన్ని పాటించి పాలనపై దృష్టి సారిస్తుంటే, సోషల్ మీడియాలో ఇరు పార్టీల పేర్లతో తిరిగే ఐడీలు తీవ్రమైన ఈగో పోరుతో కూటమి స్ఫూర్తికే ఘోరమైన విఘాతం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా సినీ హీరోల అభిమానుల మధ్య ఉండే పాత కక్షలు, వ్యక్తిగత ఆధిపత్య పోరును రాజకీయాలకు రుద్ది, పరస్పరం పార్టీ అధినేతలను, వారి కుటుంబ సభ్యులను అసభ్యకరంగా దూషించుకునే స్థాయికి దిగజారిపోతున్నారు.సాధారణంగా ఏ రాజకీయ పార్టీకైనా సోషల్ మీడియా విభాగం లేదా సానుభూతిపరులు అనేది ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా సంస్కరణలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే డిజిటల్ సైన్యంలా పనిచేయాలి. అయితే ఈ రెండు పార్టీల సోషల్ మీడియా అతివాదులు మాత్రం ప్రభుత్వం సాధిస్తున్న విజయాలు, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాలను పక్కనబెట్టి.. పరస్పరం చురకలు వేసుకోవడానికి, ఎన్టీఆర్ లేదా చిరంజీవి వంటి దిగ్గజాల పేర్లను లాగి బురద చల్లుకోవడానికే సమయాన్ని వెచ్చిస్తున్నారు. అసలైన ప్రాధాన్యతలను విడిచిపెట్టి వ్యక్తిగత ద్వేషాన్ని ప్రచారం చేసే వీరు ఎంతమాత్రం పార్టీ సానుభూతిపరులు అనిపించుకోరు, పైగా ప్రత్యర్థి పార్టీ వైఎస్ఆర్‌సీపీకి అయాచితంగా పొలిటికల్ అడ్వాంటేజ్‌ను ప్లేట్‌లో పెట్టి ఇస్తున్నారు.వైసీపీ అమలు చేస్తున్న ఫేక్ నెరేటివ్‌లు, ప్రభుత్వ విధానాలపై చేస్తున్న తప్పుడు ప్రచారాలను సంయుక్తంగా తిప్పికొట్టాల్సిన సమయంలో.. ఈ రెండు వర్గాలు ఒకరి శాఖల్లోని లోపాలను మరొకరు వెతికి నెట్‌లో రచ్చకెక్కడం కూటమి ప్రభుత్వ పరువు తీస్తోంది. ఇటు టీడీపీ శ్రేణులు, అటు జనసేన సైనికులు పరస్పరం డిపార్ట్‌మెంట్ వ్యాఖ్యలపై కౌంటర్లు ఇచ్చుకోవడం వల్ల ప్రజల్లోకి ప్రభుత్వంలో సమన్వయం లేదు అనే తీవ్ర ప్రతికూల సంకేతాలు వెళు తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్న ఈ కీలక సమయంలో, ప్రయివేటు అకౌంట్ల నుంచి జరిగే ఈ విపరీతమైన ఈగో వార్ రాజకీయంగా కూటమి పునాదులకే ఎసరు పెట్టే ప్రమాదం ఉంది. దీన్ని ఆసరా చేసుకుని వైసీపీ సోషల్ మీడియా టీడీపీ, జనసేన పేరుతో ఫేక్ అకౌంట్లను రంగంలోకి తెచ్చి మరింతగా వివాదాలను పెంచుతోంది.ఈ పరిస్థితికి చెక్ పెట్టాలంటే కేవలం హెచ్చరికలు, హితవులతో సరిపెట్టుకుంటే లాభం లేదు. ఇరు పార్టీల నాయకత్వాలు సీరియస్‌గా స్పందించి, తమ అధికారిక సోషల్ మీడియా వింగ్‌ల ద్వారా క్రమశిక్షణను కఠినంగా అమలు చేయాల్సి ఉంది. హద్దులు దాటి పరస్పర అధినేతలను, కుటుంబ సభ్యులను అసభ్యకరంగా దూషిస్తున్న ఐడీలను గుర్తించి, వారు సొంత కేడర్ అయినా సరే సైబర్ పోలీసుల ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదా పార్టీల నుంచి బహిరంగంగా దూరం పెట్టడం చేయాలి. పార్టీ ఆత్మగౌరవం కంటే కూటమి బంధం, ప్రభుత్వ స్థిరత్వమే ముఖ్యమని ఇరు అధినేతలు కేడర్‌కు గట్టిగా స్పష్టం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఉమ్మడి రాజకీయ ప్రత్యర్థి వైఎస్ఆర్‌సీపీపై పోరాడటాన్ని మర్చిపోయి, తమలో తామే సోషల్ మీడియాలో కొట్టు చావడం అనేది కూటమి ఐక్యతకు కన్పించని శత్రువులా మారింది.

# న్యాయపోరాటంలో డీఎస్సీ అభ్యర్థులు




**విజయవాడ, సెప్టెంబర్ 9, పెన్ పవర్:** మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కష్టాన్ని, పారదర్శకంగా జరిగిన నియామకాల ప్రక్రియను దెబ్బతీసేలా సాగుతున్న ఫేక్ ప్రచారాలపై ఇక కేవలం ప్రెస్ మీట్ల స్పష్టతలతో సరిపెట్టుకోవడం సాధ్యం కాదు. నిబంధనల ప్రకారం కష్టపడి మెరిట్ సాధించి ఉద్యోగాలు పొందిన టీచర్లు తమ కష్టాన్ని కించపరిచేలా సోషల్ మీడియా, కొన్ని మీడియా ఛానెళ్లలో జరుగుతున్న తప్పుడు దాడిపై నేరుగా న్యాయపోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం వచ్చింది. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ తమ ఆత్మగౌరవాన్ని, భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న వారిపై ప్రతి ఉపాధ్యాయుడు వ్యక్తిగతంగా సివిల్, క్రిమినల్ పరువునష్టం కేసులు వేయడం ద్వారానే ఈ వికృత క్రీడకు అడ్డుకట్ట పడుతుంది.ఆరోపణలకు గురవుతున్న బాధిత ఉపాధ్యాయులందరూ ఐక్యంగా ఒక వేదికపైకి వచ్చి, రూ. కోట్ల పరిపరిహారాన్ని డిమాండ్ చేస్తూ క్రిమినల్ దావాలు దాఖలు చేయాలి. ఫేక్ స్కామ్ అంటూ కోర్టు పరిధిలో తేలని విషయాలను జడ్జిమెంట్లుగా ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు, యూట్యూబర్లు, రాజకీయ నాయకులకు లీగల్ నోటీసులు పంపాలి. స్వయంగా కష్టపడి సాధించుకున్న ఉద్యోగాన్ని సవాలు చేస్తూ విచారణ పేరుతో మానసిక క్షోభకు గురిచేస్తున్న ప్రతి ఒక్కరినీ కోర్టు బోనులో నిలబెట్టినప్పుడే, బాధ్యతారాహిత్యంగా మాట్లాడే వారికి చట్టం పవర్ ఏంటో అర్థమవుతుంది.మరోవైపు ఏపీ ప్రభుత్వం కూడా ఇక ఎంతమాత్రం ఉపేక్షించే ధోరణిలో ఉండకూడదు. అధికారులు ప్రతిసారీ స్క్రీన్లపై ఆధారాలు చూపుతూ కేస్-టు-కేస్ ఓపికగా సమాధానాలు ఇచ్చినంత కాలం ఇచ్చారు. కానీ, ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ వ్యవస్థల పరువు తీయడమే లక్ష్యంగా కుట్రపూరిత ప్రచారాలు చేస్తున్న వారిపై ప్రభుత్వమే స్వయంగా కేసులు నమోదు చేయాలి. ఫేక్ న్యూస్, డీఎస్సీ నియామకాల ప్రాసెస్‌పై ఎప్పటికప్పుడు వస్తున్న ఆరోపణలు, సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారాలు కేవలం ఒక వ్యవస్థను మాత్రమే కాకుండా, రాత్రింబవళ్లు కష్టపడి ఉద్యోగాలు సాధించిన వేలాదిమంది ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కూడా దెబ్బతీస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చే వివరణలు లేదా పత్రికా ప్రకటనలు కేవలం తాత్కాలిక సడలింపునిస్తాయే తప్ప, ఇలాంటి దుష్ప్రచారాలకు శాశ్వత ముగింపు పలకలేవు. చట్టం ఇచ్చిన రక్షణలను సద్వినియోగం చేసుకుంటూ, ఆధారాలు లేని తప్పుడు ప్రచారాలపై కఠినమైన చట్టపరమైన చర్యలకు పూనుకోవాల్సిన అవసరం ఇప్పుడు ఎంతైనా ఉంది.భారతీయ శిక్షాస్మృతి పరిధిలోని క్రిమినల్ నిబంధనల ప్రకారం కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించినందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చు. అంతేకాకుండా, సివిల్ కోర్టులలో కోట్ల రూపాయల పరువు నష్టం దావాలు వేయడం ద్వారా తప్పుడు ప్రచారం చేసేవారికి ఆర్థికపరమైన భయాన్ని కలిగించవచ్చు. సోషల్ మీడియా ద్వారా ఈ ప్రచారాలు జరుగుతున్నందున, సమాచార సాంకేతిక పరిజ్ఞాన చట్టం కింద కూడా ఫిర్యాదులు చేసి, ఆయా ఖాతాలను బ్లాక్ చేయించడంతో పాటు బాధ్యులపై సైబర్ కేసులు నమోదు చేయవచ్చు. ప్రభుత్వం , విద్యాశాఖ కేవలం ప్రేక్షక పాత్ర వహించకుండా, డిఫెన్సివ్‌గా సమాధానాలు ఇవ్వడంతో సరిపెట్టకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రభుత్వ యంత్రాంగం నిర్వహించే అధికారిక పరీక్షల పై అసత్యాలు వ్యాప్తి చేయడం ప్రభుత్వ ప్రతిష్టను కూడా దెబ్బతీస్తుంది. కాబట్టి, సదరు ఉద్దేశపూర్వక దాడి వెనుక ఉన్న మూలాలను గుర్తించి, పోలీసు శాఖ ద్వారా సుమోటోగా కేసులు నమోదు చేయడం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా డైరెక్ట్ క్రిమినల్ కంప్లైంట్ నమోదు చేయించడం ప్రభుత్వం వైపు నుంచి జరగాల్సి ఉంది. వివరణల కాలం ముగిసింది.. చట్టపరమైన చర్యల కాలం మొదలైంది అనే సంకేతం సమాజంలోకి వెళ్లాలి.

చక్రపాణి రెడ్డి బూమ్ రాంగ్ అవుతుందా

డీఎస్సీలో ఉద్యోగం సంపాదించి కుప్పంలో ఓ స్కూల్లో పని చేస్తున్నారు చక్రపాణి రెడ్డి. ఆయన మాజీ సైనికుడు, సెయిలింగ్ క్రీడాకారుడు కూడా. దేశ సేవ నుంచి రిటైరైన తర్వాత బీఈడీ పూర్తి చేసి ఉద్యోగం సంపాదించుకున్నారు. ఆయనతో రిపోర్టర్ అనుచితంగా ప్రవర్తించాడు. ఉపాధ్యాయ దినోత్సవం రోజే స్కూల్ కు వెళ్లి పిల్లల ముందే చొక్కా పట్టుకుని సర్టిఫికెట్లు చూపించాలని దౌర్జన్యం చేశాడు. ఇవన్నీ ఫోన్ లో రికార్డు అయ్యాయి. దాంతో పోలీసు కేసు నమోదు అయింది.ఇంత వరకూ బాగానే ఉన్నా.. చక్రపాణి రెడ్డిపై సాక్షి పేరుతో దౌర్జన్యం చేయడం మాత్రం ఓ వర్గంలో కలకలం రేపుతోంది. స్పోర్ట్స్ కోటా పేరుతో బీసీలపై దాడి చేస్తూ వచ్చారు ఇప్పటి వరకూ. అయితే రెడ్డి వర్గాన్ని కూడా వదలడం లేదని కుప్పం టీచర్ ఉదంతంతో క్లారిటీ వచ్చింది. ఓసీల్లో ఉండి ఉద్యోగం తెచ్చుకోవడం ఎంత ఆ వర్గంలో ఉండే వారికి తెలుసు. మాజీ సైనికుడు అయిన చక్రపాణి రెడ్డికి ఉద్యోగం వస్తే ఆయనను అవమానించడమే కాదు.. సాక్షిలోనూ తప్పుడు ప్రచారం చేశారు. ఈ అంశం రెడ్డి వర్గంలోనూ చర్చకు వస్తోంది.మాగుంట శ్రీనివాసులరెడ్డి ఇటీవల వెలిగొండ వేదికపై జగన్ ను మూర్ఖుడని తిట్టారు. ఇలాంటివి చేయాలని జగన్ రెడ్డి చెప్పరు కానీ ఆయన నైజానికి తగ్గట్లే జరుగుతాయి. ఆయన కు అవి ఇష్టం కాబట్టి సజ్జల చేయిస్తారు. దాని వల్ల ఎంత నష్టం జరుగుతుందో చెప్పడం కష్టం. మాగుంట మాట్లాడిన మాటల కన్నా.. కుప్పం టీచర్ చక్రపాణి రెడ్డి ఆవేదన .. వైసీపీకి ఊహించని నష్టం చేయబోతోంది.

## కొత్త పొలిటికల్ పార్టీకి స్పేస్ ఉందా

**విజయవాడ, సెప్టెంబర్ 9, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఏళ్ల తరబడి కీలక సూత్రధారిగా, వైసీపీకి ఆయువుపట్టులా వ్యవహరించిన విజయసాయిరెడ్డి ఇప్పుడు సొంతంగా పార్టీ పెట్టేందుకు రెడీ అయ్యారు. తాను సీఎంని అవుతా అంటే ఇంకా తేడాగా ఉంటుందని .. జెన్ జీని సీఎంను చేస్తానని వింత మాటలు చెబుతూ ప్రెస్మీట్ పెట్టారు. ఆయన తీరు చూసిన వారికి ఎవరికైనా రాజకీయ ఉత్సాహం గానీ, దూకుడు గానీ కనిపించడం లేదని అనిపిస్తుంది తీవ్రమైన అలసట, ముఖంలో నీరసం స్పష్టంగా కనిపిస్తోంది. ఏదో ఒత్తిడితో ఆయన రాజకీయ ప్రకటన చేస్తున్నట్లుగా కనిపిస్తోంది.విజయసాయిరెడ్డికి ఉన్న ఏకైక బలం ఆర్థిక వనరులు. రాజకీయాల్లో డబ్బు ఉంటే సరిపోదు, దానిని నమ్మివచ్చే నాయకులు, కేడర్ ఉండాలి అనేది ప్రాథమిక సూత్రం. విజయసాయిరెడ్డి వద్ద వనరులకు లోటు లేకపోయినా, కేవలం ఆయన పెట్టే ఖర్చులను చూసి , డిజిటల్ మీడియా ఫండింగ్‌ను ఆశించి వచ్చే అనుచరులు మాత్రమే ఆయన చుట్టూ చేరే అవకాశం ఉంది. ప్రజాదరణ, మాస్ ఇమేజ్ ఉన్న రాజకీయ నేతలెవరూ తమ భవిష్యత్తును ఆయన కొత్త పార్టీకి తాకట్టు పెట్టే సాహసం చేయరు. నియోజకవర్గాల్లో పట్టున్న నాయకులు కాకుండా, కేవలం నిధులు గుంజుకునే అవకాశం కోసమే వచ్చే ద్వితీయ శ్రేణి నేతలు, తాత్కాలిక అవకాశవాదులతో పార్టీ నడపడం ద్వారా ఆయనకు రాజకీయంగా ఒరిగేదేమీ ఉండదు. చివరికి మిగిలేది కేవలం ఖర్చు మాత్రమే.ఈ కొత్త ప్రయోగం వెనుక ఆయన అసలు కారణం ఏమిటన్న ప్రశ్న వస్తోంది. వైసీపీని వీడిన నాటి నుంచి జగన్ వైఖరిపై తీవ్ర అసంతృప్తి ఉన్నప్పటికీ, జగన్ పక్కన తనకు దక్కాల్సిన ప్రాధాన్యత , స్థానం మళ్లీ లభిస్తుందనే ఆశ ఆయనలో లోలోపల ఉందనే సంకేతాలు పదే పదే కనిపిస్తున్నాయి. నేరుగా వైఎస్సార్‌సీపీలోకి వెళ్లలేని పరిస్థితి ఉండటంతో, బయట ఒక మూడో ప్రత్యామ్నాయంగా లేదా ఒక రాజకీయ శక్తిగా తన ఉనికిని చాటుకోవడం ద్వారా.. జగన్ తన ప్రాధాన్యతను గుర్తించేలా చేయాలనే ఒక బార్గేనింగ్ స్ట్రాటజీ కూడా ఇందులో దాగి ఉండవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.మరోవైపు, పాత కేసుల నుంచి రక్షణ, రాజకీయ రంగంలో కొనసాగుతున్నామనే ఒక కవచాన్ని కాపాడుకోవడం లేదా ఇతర కేంద్ర పార్టీల ఒత్తిళ్లకు తలొగ్గడమూ ఈ కొత్త పార్టీ వెనుక కారణాలు కావచ్చు. అయితే, సొంతంగా ప్రజాకర్షణ లేని వ్యూహకర్తలు పార్టీలు పెట్టి జనం ముందుకు వెళ్లినప్పుడు ఎదురయ్యే ఆర్థిక, రాజకీయ పరాభవాలు చరిత్రలో చాలానే ఉన్నాయి. సాయిరెడ్డి వంటి సీనియర్ ఆడిటర్, వ్యూహకర్తకు ఈ విషయం తెలియంది కాదు. అయినప్పటికీ, ఆశయం కంటే ఒత్తిళ్లు, వ్యూహాల కంటే ఖర్చులే ఎక్కువగా ఉన్న ఈ కొత్త రాజకీయ ప్రయాణంలో విజయసాయిరెడ్డికి లభించే రాజకీయ మైలేజ్ అతిస్వల్పమే. పార్టీ నిర్మాణం, డిజిటల్ మీడియా నిర్వహణ పేరిట కోట్లాది రూపాయల ఖర్చు మినహా.. క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంకు ఏమీ ఏర్పడదు.

## నాలుగు నెలల్లోనే రాబడి లోటు ఏకంగా 36,942 కోట్ల

**విజయవాడ, సెప్టెంబర్ 9, పెన్ పవర్:**
కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక స్థితి క్లిష్టంగాఉంది. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లోనే రాబడి లోటు ఏకంగా 36,942 కోట్లకు చేరుకుంది. ఇది యేడాది మొత్తానికి బడ్జెట్‌లో అంచనా వేసిన 22,003 కోట్ల కంటే ఎక్కువ. అదే సమయంలో ద్రవ్య లోటు 49,134 కోట్లకు చేరింది. ఇది వార్షిక అంచనాలో 64 శాతం. నికర రుణాలు కూడా సరిగ్గా అంతే మొత్తంలో ఉండటం రాష్ట్ర రుణ భారాన్ని స్పష్టం చేస్తోంది.ఈ గణాంకాలను ఆర్థిక వ్యవస్థ కోణంలో చూస్తే రాబడి లోటు 168% పెరగడం అంటే రాష్ట్రానికి వచ్చే రోజూవారీ ఆదాయం కన్నా నిత్యం చేసే ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయని అర్థం. పన్నులు, పన్నేతర మార్గాల ద్వారా వచ్చే స్వీయ ఆదాయం సరిపోకపోవడంతో ప్రభుత్వ నిర్వహణకే పెద్ద ఎత్తున నిధులు కొరవడుతున్నాయి. ఇతర ప్రధాన రాష్ట్రాలతో పోలిస్తే, ఆంధ్రప్రదేశ్ అత్యధిక రుణాలు , అత్యధిక రాబడి లోటుతో మొదటి వరుసలో నిలుస్తోంది.ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి ఇంత క్లిష్టంగా మారడానికి ప్రధాన కారణం జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు , సంక్షేమ పథకాల ఉచితాల వ్యయం విపరీతంగా పెరిగిపోవడమే. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో సింహభాగం ఈ రోజువారీ నిబద్ధతలకే సరిపోతోంది. మరోవైపు, ఆదాయ మార్గాలను పెంచుకోవడంలోనూ, సంపద సృష్టించే మూలధన వ్యయం సాధించడంలోనూ ఆశించినంత వేగం కనిపించడం లేదు. బడ్జెట్ అంచనాలకు, వాస్తవ రాబడులకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసమే ఈ పరిణామానికి దారితీసింది.ఈ తరహా లోటు నిరంతరం పెరిగిపోతే రాష్ట్ర భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. సంక్షేమ పథకాలు లేదా రోజువారీ నిర్వహణ ఖర్చుల కోసం తెచ్చిన అప్పుల వల్ల మూలధన సృష్టి నిలిచిపోయి అభివృద్ధి కుంటుపడుతుంది. తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించడానికే మళ్లీ కొత్త అప్పులు చేయాల్సి రావడం వల్ల రాష్ట్రం రుణ సంక్షోభం దిశగా వెళ్లే ప్రమాదం ఉంది. పైగా, క్రెడిట్ రేటింగ్‌లు తగ్గిపోయి భవిష్యత్తులో కొత్త అప్పులు పుట్టడం కూడా కష్టమవుతుంది. ఈ సంక్షోభం నుండి గట్టెక్కాలంటే ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తోంది. కేవలం అప్పులపై ఆధారపడటం తగ్గించి, కొత్త పరిశ్రమలు, పెట్టుబడుల ద్వారా పన్ను ఆదాయాన్ని పెంచుకునే ప్రణాళికలు రూపకల్పన చేయాలి. ఉత్పాదకేతర ఖర్చులను అదుపు చేస్తూ, సంపదను సృష్టించే మూలధన రంగానికి ప్రాధాన్యం ఇస్తోంది.ఈ ఫలితాలు వచ్చే సరికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

## రెబల్స్ డేంజర్ బెల్స్

**తిరుపతి, సెప్టెంబర్ 9, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా పెరుగుతోంది. ఈ ఎన్నికలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత కీలకంగా చూస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాజయం తర్వాత గ్రామీణ, పట్టణ స్థాయిలో తమ పార్టీకి ఎంతమేర బలం ఉందో నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలను ఒక అవకాశంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంతో పోలిస్తే కేడర్‌లో ఉత్సాహం పెరిగిందని, ప్రజల్లో కూడా తమకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని వైసీపీ నాయకత్వం అంచనా వేస్తున్నట్లు సమాచారం.పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో ఇప్పటికే ఎన్నికల సన్నద్ధతపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా స్థానిక ఎన్నికల్లో ఎక్కడా పోటీ లేకుండా ఏకగ్రీవంగా స్థానాలు వదిలేయకూడదనే సంకేతాలను పార్టీ శ్రేణులకు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రతి ప్రాంతంలో అభ్యర్థులను సిద్ధం చేసి, క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికిని బలంగా చూపించాలని సూచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని వైసీపీ భావిస్తోంది.మరోవైపు అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ , జనసేన పార్టీ , భారతీయ జనతా పార్టీ మధ్య స్థానిక సంస్థల సీట్ల పంపకం అంత సులభంగా ఉండకపోవచ్చని వైసీపీ అంచనా వేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా స్థానిక స్థాయిలో కూడా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఒకే నిర్ణయంతో పనిచేస్తారా అనే సందేహాలు ఉన్నాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. స్థానిక రాజకీయాల్లో వ్యక్తిగత బలం, వర్గ సమీకరణాలు ఎక్కువగా ప్రభావం చూపుతాయి. దీంతో టికెట్ దక్కని ఆశావహులు స్వతంత్రంగా లేదా రెబల్ అభ్యర్థులుగా బరిలోకి దిగే అవకాశముందని వైసీపీ లెక్కలు వేస్తోంది.అయితే ఈ అంచనాలన్నింటికంటే ముఖ్యంగా జగన్ ప్రచారం కీలకమవుతుందని పార్టీ నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులు, మేయర్ స్థానాలు, జెడ్పీ పీఠాలు వంటి పదవులు స్థానిక రాజకీయాల్లో గణనీయమైన ప్రభావం చూపుతాయి. జిల్లా కేంద్రాలు, ప్రధాన నగరాల్లో వచ్చే ఫలితాలు భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే జగన్ కనీసం కీలక జిల్లాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తే పార్టీకి ఊపు వస్తుందని నాయకులు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో జగన్ ప్రచారానికి దూరంగా ఉన్నారు. అయితే అప్పటికి వైసీపీ అధికారంలో ఉండటం, ప్రభుత్వ యంత్రాంగం మరియు రాజకీయ పరిస్థితులు తమకు అనుకూలంగా ఉండటం వంటి అంశాలు పార్టీకి కలిసివచ్చాయి. ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉండటంతో నాయకత్వం మరింత చురుగ్గా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.కూటమి ప్రభుత్వంపై జగన్ చేసే విమర్శలు, స్థానిక సమస్యలపై ఆయన ప్రసంగాలు ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితే పార్టీకి అదనపు ప్రయోజనం కలుగుతుందని వైసీపీ నేతలు ఆశిస్తున్నారు. అయితే ఆయన రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తారా, లేక ఎంపిక చేసిన ప్రాంతాలకే పరిమితమవుతారా అనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. స్థానిక ఎన్నికల షెడ్యూల్, రాజకీయ పరిస్థితులను బట్టి జగన్ ప్రచారంపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## పసుపు నీళ్లు తెచ్చిన పంచాయతీ !



తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశాడని, దానికి కారణం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అని, కాబట్టి ఆయన స్పీకర్ కు క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ పార్టీ చావుడప్పు పేరుతో ఎర్రవెల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం ముట్టడికి పిలుపునిచ్చింది. భువనగిరి నుండి ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, బీర్ల అయిలయ్య, వేముల వీరేశం తదితరులు, గజ్వేల్ నుండి మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ఆయన కూతురు, డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి తదితరులు వేలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తలతో బయలుదేరారు.దీంతో ఎర్రవెల్లి పరిసర గ్రామాలలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్య దాడులు, పోలీసులు అడ్డుకోవడం, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి గాయాలు కావడం, ఆసుపత్రిలో చేరడం జరిగింది. కాంగ్రెస్ కార్యకర్తలు వెనుదిరిగిన తర్వాత బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ చావుడప్పు పేరుతో దాడికి వచ్చారంటూ, వచ్చిన రహదారి మీద పసుపునీళ్లు చల్లారు.ఈ నేపథ్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ దళితులు ముట్టడికి వచ్చారనే పసుపు నీళ్లు చల్లారు. దళితులు అంటే అంత చులకన ఎందుకు ? దళిత స్పీకర్ ను అవమానించడమే కాకుండా, పసుపు నీళ్లు చల్లి మరోసారి అవమానిస్తారా ? అంటూ కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీ మీద ప్రశ్నల వర్షం కురిపించింది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, వేముల వీరేశం, అద్దంకి దయాకర్, బల్మూరి సుమన్ తదితరులు దీనిని ఖండించారు.దళితులను ముందుపెట్టి కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తుందని, అసలు వచ్చిన వారిలో దళితులు ఎక్కడ ఉన్నారని, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డిలు దళితులా ? చావుడప్పు పేరుతో కేసీఆర్ నివాసాన్ని ముట్టడించిన కార్యక్రమం బూమరాంగ్ అయినందుకే పసుపునీళ్లతో దళితులను అవమానించారన్న వాదన లేవనెత్తుతున్నారని బీఆర్ఎస్ వాదిస్తుంది.శాసనసభ సమావేశాల సంధర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేశారంటున్న వ్యాఖ్యలు గందరగోళానికి దారితీయగా, చావుడప్పు కార్యక్రమం నేపథ్యంలో కేసీఆర్ చావాలని కోరుకుంటున్నామని, ఆయన తెలంగాణకు పట్టిన పీడ అని కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అనడం మరో గందరగోళానికి దారి తీసింది. అయితే తాను ఫ్లోలో అన్నప్పుడు అలా వచ్చిందని, కేసీఆర్ చావాలని తాను కోరుకోవడం లేదని శంకర్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో పసుపునీళ్లు చల్లి ప్రక్షాళన చేసిన కార్యక్రమం వివాదాస్పదం కావడం గమనార్హం.

## దేశాధినేతకన్నా జజూా ఎక్కువ సంపాదిస్తున్నారా?.. షాకింగ్ రియాలిటీ!



ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన వ్యక్తులు అంటే మనకు వెంటనే గుర్తుకొచ్చేది దేశాధ్యక్షులు లేదా ప్రధానమంత్రులు. కోట్ల మంది ప్రజల భవిష్యత్తును నిర్ణయించే పవర్ వారి చేతుల్లో ఉంటుంది కాబట్టి వాళ్లకు ఎక్కువ సంపాదన ఉంటుంది అని కొందరు అనుకుంటారు. కానీ శాలరీ విషయానికి వస్తే మాత్రం, ఒక బిగ్ టెక్ లేదా ప్రైవేట్ కంపెనీ సీఈఓ సంపాదన ముందు మన దేశాధినేతల జీతాలు చాలా చిన్నగా కనిపిస్తాయి. అసలు ఈ భారీ వ్యత్యాసానికి కారణమేంటి? డిజిటల్ యుగంలో ఈ పవర్, మనీ గేమ్ ఎలా నడుస్తోందో ఇప్పుడు చూద్దాం.

**సంపాదనలో మైండ్ బ్లోయింగ్ గ్యాప్:**

అమెరికా ప్రెసిడెంట్ వార్షిక వేతనం సుమారు 4 లక్షల డాలర్లు (రూ. 3.3 కోట్లకు పైగా). కానీ గూగుల్, మైక్రోసాఫ్ట్ లేదా ఆపిల్ వంటి కంపెనీల సీఈఓల ఏడాది సంపాదన వందల కోట్ల రూపాయల్లో ఉంటుంది. ఇక ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ బాస్ ఒక రోజులో సంపాదించేది, దేశాధ్యక్షుడి ఏడాది జీతం కంటే ఎన్నో రెట్లు ఎక్కువ ఉండటం నిజంగానే షాకింగ్ అనిపిస్తుంది.

**అధికారం ఒకరిది -- ఆర్థిక శక్తి ఇంకొకరిది:**

దేశ నాయకుల చేతిలో చట్టాలు చేసే అధికారం, మిలటరీ బలం మరియు రాజ్యాంగ పరమైన అధికారాలు ఉంటాయి. కానీ కార్పొరేట్ సీఈఓల చేతిలో వేల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ, డేటా మరియు మార్కెట్ పవర్ ఉంటాయి. ఇక నేటి డిజిటల్ యుగంలో ఒక పెద్ద టెక్ కంపెనీ తీసుకునే నిర్ణయం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, సమాచారాన్ని తీవ్రంగా ప్రభావితం చేయగలదు.

**బాధ్యతలు వేరు -- రివార్డులు వేరు:**

దేశ నాయకులు ప్రజాసేవ కోసం ఎన్నికవుతారు. కాబట్టి వారి జీతాలు ప్రజల పన్నుల డబ్బు నుంచే వస్తాయి. అందుకే వాటిపై పరిమితులు ఉంటాయి. కానీ సీఈఓలు కంపెనీ లాభాలు, షేర్ హోల్డర్ల లాభాల ఆధారంగా స్టాక్ ఆప్షన్స్, బోనస్‌లు పొందుతారు. ఇక ఒక కంపెనీ మార్కెట్ విలువను వేల కోట్లకు పెంచినప్పుడు, సీఈఓలకు అందుకు తగ్గట్టుగా భారీ ఆఫర్లు దక్కుతాయి.

**ప్రజాసేవ జం మార్కెట్ వాల్యూ:**

రాజకీయ నాయకులకు జీతం తక్కువగా ఉన్నప్పటికీ, వారికి లభించే ఉచిత బంగ్లాలు, ప్రత్యేక విమానాలు, భద్రత మరియు ప్రపంచస్థాయి గౌరవం కోట్లతో కొలవలేనివి. మరోవైపు సీఈఓల నైపుణ్యానికి దక్కే కార్పొరేట్ వాల్యూ వారి శాలరీ ప్యాకేజీల్లో స్పష్టంగా కనిపిస్తుంది.ప్రపంచాన్ని నడిపించే పొలిటికల్ పవర్ నాయకుల దగ్గర ఉంటే, గ్లోబల్ మార్కెట్లను శాసించే మనీ పవర్ కార్పొరేట్ బాస్ ల దగ్గర ఉంది. ఇక అధికారిక బాధ్యతలు, సంపాదన వేర్వేరు మార్గాల్లో సాగుతున్నా, ఆధునిక సమాజంలో ఈ ఇద్దరి ప్రభావం అత్యంత కీలకమైనదే అని చెప్పక తప్పదు.

# సభ నుండి సస్పెండ్.. మండలి నుండి వాకౌట్!



తెలంగాణ శాసనసభ సమావేశాల నుండి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను ఈ సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. శాసనసభ సమావేశాలకు నల్ల టీషర్టులతో వస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకున్న నేపథ్యంలో స్పీకర్ ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారని మొదలయిన వివాదం చిలికి చిలికి గాలివానగా మారి ఈ రోజు పార్టీ ఎమ్మెల్ట్యే లను సస్పెండ్ చేయడం వరకు వచ్చింది.ఈ నేపథ్యంలో తెలంగాణ శాసనసభలో బీఆర్ఎస్ సభ్యుల తీరుపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. సభా నియమావళిని ప్రతి సభ్యుడు పాటించాల్సిన బాధ్యత ఉందని, బీఆర్ఎస్ సభ్యులు పదేపదే వెల్‌లోకి వచ్చి సభాపతితో వాగ్వాదానికి దిగడం, ఆయన సూచనలను పట్టించుకోకపోవడం సరికాదని భట్టి విక్రమార్క అన్నారు.సభను సజావుగా నిర్వహించేందుకు సభ్యులందరూ సహకరించాలని, ఈ సభ, ఈ రాష్ట్రం ఆత్మగౌరవంపై ఏర్పడిందని. ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నాలు మంచిది కాదు. రాష్ట్ర శ్రేయస్సు దృష్ట్యా ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని ఆయన అన్నారు.ఈ నేపథ్యంలోనే సభను అడ్డుకుంటున్న సభ్యుల సస్పెన్షన్‌కు శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా, స్పీకర్ ఆమోదించారు. సస్పెన్సన్ జాబితాలో హరీశ్‌రావు, కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, గంగుల, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కోవా లక్ష్మి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజయుడు, వివేకానంద, కె.సంజయ్, తలసాని, అనిల్ జాదవ్ ఉన్నారు.అయితే స్పీకర్ సభ నుండి సస్పెండ్ చేయడాన్ని బీఆర్ఎస్ పార్టీ తప్పుపడుతున్నది. ప్రజా సమస్యల మీద నిలదీస్తామనే సభ నుండి సస్పెండ్ చేశారని, ఇది బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్ కాదు, ప్రజా సమస్యలపై కాంగ్రెస్ సస్పెన్షన్ అని, నియంతృత్వం ఎంత పెరిగితే, ప్రజల తిరుగుబాటు అంత బలపడుతుందన్న విషయం గుర్తుంచుకోవాలని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉప నేత హరీష్ రావు అన్నారు.అటు శాసనమండలిలో నిన్న ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను

సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు వాకౌట్ చేశారు. ఇటు శాసనసభ నుండి స్పీకర్ సస్పెండ్ చేయగా, అటు శాసనమండలి నుండి వాకౌట్ చేయడం గమనార్హం. అనంతరం శాసనసభ లోపల, బయట జరిగిన పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి లోక్ భవన్ కు వెళ్లిన కేటీఆర్ గవర్నర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ వివాదం ఏ మలుపులు తిరుగుతుందో వేచిచూడాలి.

# గ్రీన్‌కార్డ్ కోసం ఎదురుచూస్తున్న భారతీయులకు మరో షాక్..




అమెరికాలో సొంతింటి కల నెరవేర్చుకోవాలని.. గ్రీన్‌కార్డ్‌తో తమ జీవితాల్లో స్థిరత్వం లభిస్తుందని ఏళ్లుగా నిరీక్షిస్తున్న వేలాది మంది భారతీయ ఐటీ నిపుణుల ఆశలపై మళ్ళీ నల్లటి మేఘాలు అలుముకున్నాయి. రాత్రింబవళ్లు కష్టపడి కంపెనీల పురోగతికి ప్రాణం పెట్టే టెక్కీలకు.. అమెరికా డ్రీమ్ అంత తేలికగా నెరవేరేలా కనిపించడం లేదు. ప్రముఖ ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్‌లో పనిచేస్తున్న విదేశీ ఉద్యోగులకు.. ముఖ్యంగా భారతీయులకు అమెరికా కార్మిక శాఖ (యూఎస్.డీఓఎల్) తీసుకున్న తాజా నిర్ణయం కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.కాగ్నిజెంట్‌కు చెందిన కొత్త పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ (పీఈఆర్ఎం) దరఖాస్తుల ప్రాసెసింగ్‌పై ఆంక్షలు విధించినట్లు వార్తలు వెలువడటంతో ఉద్యోగుల గుండెల్లో రైళు పరిగెడుతున్నాయి. కంపెనీకి చెందిన హెచ్1బీ, పీఈఆర్ఎం నియామక ప్రక్రియలపై విచారణ పూర్తయ్యే వరకు కొత్త పీఈఆర్ఎం ఫైలింగ్స్ ముందుకు సాగవని తెలుస్తోంది. గ్రీన్‌కార్డ్ వైపు పడే మొదటి అడుగు 'పీఈఆర్ఎం'. ఆ తొలి అడుగే పడకుండా ఆగిపోతే తాము అమెరికాలో మరిన్ని ఏళ్లు అనిశ్చితి మధ్య గడపాల్సి వస్తుందని టెక్కీలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అమెరికాలో చట్టబద్ధంగా ఉంటూ పన్నులు చెల్లిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు తమ శ్రమను ధారపోస్తున్నప్పటికీ.. ప్రతి చిన్న మార్పుకూ తమ భవిష్యత్తు తలకిందులవుతుండటంపై టెక్కీల కుటుంబాలు మనోవేదనకు గురవుతున్నాయి.

అమెజాన్, ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి సంస్థల సరసన నిలిచే కాగ్నిజెంట్ నుంచి 2026 ఆర్థిక సంవత్సరంలోనే వేలాది మందికి హెచ్1బీ అనుమతులు లభించాయి. అందులో మెజారిటీ నిపుణులు భారతీయులే కావడం వల్ల ఈ తాజా పరిణామం నేరుగా వారి జీవితాలపైనే తీవ్ర ప్రభావం చూపనుంది.

ఇది కేవలం ఒక్క కాగ్నిజెంట్ కథ మాత్రమే కాదు. 'క్లౌడెరా' అనే మరో టెక్ కంపెనీపై కూడా అమెరికా ప్రభుత్వం 180 రోజుల పాటు పీఈఆర్ఎం దరఖాస్తులను నిలిపివేస్తూ చర్యలు తీసుకుంది. స్వదేశంలో ఉన్న కుటుంబాలకు దూరంగా ఉంటూ ఎప్పటికైనా గ్రీన్‌కార్డ్ వస్తుందనే ఒక్క చిన్న ఆశతో ఉద్యోగాలు చేస్తున్న కుటుంబాలకు ఇటువంటి వార్తలు చావుదెబ్బలా మారుతున్నాయి. ఇప్పటికే పీఈఆర్ఎం ప్రక్రియలో ఉన్నవారి పరిస్థితి ఏంటనే దానిపై కూడా స్పష్టత లేకపోవడంతో ఉద్యోగుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.సంస్థల నిబంధనల విచారణల నడుమ.. ఏ పాపం ఎరుగని సాధారణ భారతీయ ఉద్యోగుల జీవితాలు, వారి పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడం తీవ్ర విచారకరం. కాగ్నిజెంట్ యాజమాన్యం త్వరితగతిన స్పందించి ఈ సమస్యకు ఒక స్పష్టమైన పరిష్కారం చూపుతుందని, తమ కలల ప్రాసెస్ మళ్లీ పట్టాలెక్కుతుందని వేలాది మంది ఐటీ ఉద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# ఈ ట్రంప్ వద్దు.. ఆయన చేసే కంపు వద్దు..
# జనాలు డిసైడ్ అయిపోయారు

రెండోసారి గద్దెనెక్కిన డోనాల్డ్ ట్రంప్ తాత తన మార్కు నిర్ణయాలతో అమెరికన్ల ఫ్యూజులు ఎగరదీస్తున్నారు. "మళ్లీ అధ్యక్షుడినైతే ప్రపంచంలో శాంతి దూతగా వెలిగిపోతా.. దేశాన్ని స్వర్గం చేస్తా" అని హామీలిస్తే.. కట్ చేస్తే ఇప్పుడు అమెరికా ఓటర్లు "బాబోయ్.. ఈ నయా ట్రంపిజం మాకొద్దురా నాయనా" అని గుండెలు బాదుకునే పరిస్థితి వచ్చింది. రాబోయే మధ్యంతర ఎన్నికలు రిపబ్లికన్లకు పెద్ద పరీక్షగా మారగా ఓటర్ల మూడ్ చూస్తే ట్రంప్‌కి 'రిటర్న్ గిఫ్ట్' ఇచ్చేలా ఉన్నారు.




**ఓటర్ల మూడ్ మారుతోందా?**

అమెరికాలో మధ్యంతర ఎన్నికలు అధ్యక్షుడి పాలనకు ఒకరకంగా ప్రజాభిప్రాయ పరీక్షగా నిలుస్తాయి. అధ్యక్షుడి పార్టీకి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా ఓటర్లు ఇచ్చే తీర్పు.. తదుపరి రెండేళ్ల రాజకీయ పరిస్థితులను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. ఇదే సమయంలో ట్రంప్‌కు సంబంధించిన ప్రజాభిప్రాయ అంచనాలు రిపబ్లికన్లలో ఆందోళన పెంచుతున్నాయి. ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థ, జీవన వ్యయం, ఉద్యోగాలు, విదేశాంగ విధానం వంటి అంశాలపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. అంటే.. ఎన్నికలు కేవలం డెమొక్రాట్లు వర్సెస్ రిపబ్లికన్ల పోరుగా కాకుండా.. 'ట్రంప్ పాలనకు ఓటర్ల మార్కులు ఎన్ని?' అనే అంశంగా మారుతున్నాయన్నమాట.

**జేబులు గుల్ల చేస్తున్న 'అమెరికా ఫస్ట్' సర్కస్**

'అమెరికా ఫస్ట్' అంటూ స్థానిక పరిశ్రమలను కాపాడటానికి ట్రంప్ గారు దిగుమతులపై సుంకాల బాదుడు మొదలుపెట్టారు. దెబ్బకి విదేశీ వస్తువులతో పాటు దేశీయ వస్తువుల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. "దిగుమతులపై పన్నులు పెంచితే ఆ భారం చివరకు మా జేబులకేగా పడేది తాతా" అని సామాన్య అమెరికన్లు లబోదిబోమంటున్నారు. దేశభక్తి మాట ఎలా ఉన్నా పొద్దున్నే కాఫీ నుంచి సాయంత్రం గ్రాసరీ వరకు ప్రతిచోటా బిల్లు చూసి జనాలు బిక్కమొహమేస్తున్నారు.

**మధ్యంతర ఎన్నికల్లో అసలు పోటీ ఇక్కడే!**

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడి పేరు నేరుగా బ్యాలెట్‌పై ఉండకపోయినా.. అధ్యక్షుడి పనితీరు మాత్రం ఓటర్ల నిర్ణయంపై ప్రభావం చూపుతుంది. రిపబ్లికన్ అభ్యర్థులకు ఓటు వేయడం అంటే ట్రంప్ విధానాలకు మద్దతు ఇవ్వడంగానే కొంతమంది ఓటర్లు భావించే పరిస్థితి ఏర్పడితే.. అది అధికార పార్టీకి సమస్యగా మారవచ్చు. మరోవైపు డెమొక్రాట్లు కూడా ఇదే అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. 'ట్రంప్‌కు చెక్ పెట్టాలి' అనే ప్రచారాన్ని బలంగా తీసుకెళ్లే అవకాశం ఉంది.

**ప్రపంచ శాంతి.. అమెరికన్లకు గుండెకోత**

ప్రపంచ యుద్ధాలను ఆపేస్తానని ప్రచారం చేసుకున్న ట్రంప్.. తీరా పీఠం ఎక్కాక మధ్యప్రాచ్యంలో జరుగుతున్న రచ్చను ఆపలేక చేతులెత్తేశారు. "మా పన్నుల డబ్బులు పట్టుకెళ్లి పక్క దేశాల ఘర్షణలకు తగలేయడం ఏంటి? ముందు మా ఇంట్లో తలనొప్పులు తీర్చండి" అని అమెరికన్లు నిలదీస్తున్నారు. 'సూపర్ పవర్' బిల్డప్ పక్కనబెట్టి ముందు మన బ్రతుకులు చూడండని ఓటర్లు గట్టిగానే సౌండ్ చేస్తున్నారు.

**యూత్ డిస్‌కనెక్ట్.. నినాదాలు వద్దు.. ఉద్యోగాలు ముద్దు..**

ఒకప్పుడు ట్రంప్‌ను 'సిస్టమ్‌ను మార్చే విప్లవ వీరుడు'గా చూసిన కుర్రకారు ఇప్పుడు రూటు మార్చారు. గ్రాడ్యుయేషన్ పూర్తి కాగానే చేతిలో భారీ రుణాలు, చేతికి చిక్కని ఉద్యోగాలు, సొంతిల్లు కొనాలంటే చుక్కలు కనిపిస్తుంటే.. యూత్‌కి ట్రంప్ పైత్యం మీద విరక్తి పుడుతోంది. సోషల్ మీడియా డైలాగులు కడుపు నింపవని గ్రహించిన కుర్రాళ్ళు ఇప్పుడు ట్రంప్‌కి ఓటుతో బుద్ధి చెప్పేందుకు రెడీ అవుతున్నారు.

మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ బొమ్మ నేరుగా బ్యాలెట్ మీద ఉండకపోవచ్చు.. కానీ ఈసారి పడబోయేది ఆయన మార్కు పాలనకే మార్కులు.. డెమొక్రాట్లు ఈ అసంతృప్తిని క్యాష్ చేసుకునేందుకు కాచుకుని కూర్చున్నారు. మరి ట్రంప్ మావ తన పాత మ్యాజిక్ రిపీట్ చేసి గట్టెక్కుతారా? లేక 'హస్తం' గాలిలో కొట్టుకుపోతారా? అనేది కాలమే చెప్పాలి.అందుకే ఇప్పుడు ట్రంప్ ముందున్న అసలు సవాలు.. ప్రత్యర్థులను ఓడించడం మాత్రమే కాదు. తనపై అసంతృప్తిగా మారుతున్న ఓటర్లను మళ్లీ తనవైపు తిప్పుకోవడం... మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఇదే ప్రశ్న మరింత కీలకంగా మారనుంది. 'ట్రంప్ మాకొద్దు' అనే అసంతృప్తి నిజంగా ఓటుగా మారుతుందా? లేక ఎన్నికల నాటికి ట్రంప్ మళ్లీ తన రాజకీయ మ్యాజిక్‌తో పరిస్థితిని మార్చేస్తారా? అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు దీనికి సమాధానం చెప్పనున్నాయి

# కుప్పకూలిన వ్యవస్థ!

ఢిల్లీలోని సత్య నికేతన్‌లో ఒక ఐదంతస్తుల భవనం కుప్పకూలింది. 'హాస్టల్ డేజ్' అనే విచిత్రమైన పేరుతో నడుస్తున్న ప్రైవేటు విద్యార్థి వసతిగృహంలో, ఇల్లు వదిలి చదువుకోసం వచ్చిన యువకులు కిక్కిరిసి ఉన్నారు. శిథిలాల్లో సహాయక బృందాలు గాలిస్తున్న కొద్దీ కనీసం ఏడుగురు మృతిచెందినట్టు నిర్ధారణ కాగా, మృతుల సంఖ్య ఇంకా పెరుగుతూనే ఉంది. డజన్ల కొద్దీ రాత్రంతా శిథిలాల్లో చిక్కుకుని, లేదా అత్యవసర చికిత్సలో గడిపారు. ఇది దైవఘటన కాదు. ఏళ్ల తరబడి కళ్లు మూసుకుని చూసీ చూడనట్టు వ్యవహరించిన ఒక వ్యవస్థ, ఊహించదగిన పర్యవసానమే! వెంటనే బయటపడిన కారణాలు కూడా అంతే స్పష్టం. ఈ నిర్మాణం దాదాపు 50 ఏళ్ల నాటిది, మొదట్లో నివాస భవనంగా కట్టి, తర్వాత అవసరమైన అనుమతులు లేకుండానే నిశ్శబ్దంగా చెల్లింపు అతిథి గృహంగా (పీజీ) మార్చేశారు. ఆగస్టులో మళ్లీ అద్దెదారులకు అప్పగించారు. అప్పుడు కూడా చుట్టూ పునరుద్ధరణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. నివేదికల ప్రకారం, కార్మికులు బేస్‌మెంట్‌ను తవ్వుతూ, భారాన్ని మోసే గోడలను తొలగిస్తుండగా, రెండు అంతస్తుల పైన విద్యార్థులు నిద్రిస్తున్నారు. రెండు రోజుల రుతుపవన వర్షం అదే బేస్‌మెంట్‌లో నీటిని నిల్వ చేసింది. వరద నీటి నిల్వ, కొనసాగుతున్న మరమ్మతులే కూలిపోవడానికి కారణమని ఢిల్లీ సీఎం పేర్కొన్నారు. ఈ వాస్తవాల్లో ప్రతి ఒక్కటీ, విడివిడిగా చూసినా, ఒక ఉల్లంఘనే. అన్నీ కలిపి చూస్తే, ఒక్క అద్దెదారుడినైనా ఉంచకూడని భవనం గురించి చెబుతున్నాయి, కానీ ఇందులో డజన్ల కొద్దీ జనం ఉన్నారు. 186 సత్య నికేతన్ చిరునామాలో ఉన్న ఈ భవనంలో 15 గదులుండగా, ఒక్కో గదిలో ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు ఉండేవారు, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక మెడికల్ షాపు కూడా ఉండేది. కూలిపోయే సమయానికి భవనంలో 40నుంచి 50మంది వరకూ ఉన్నారని అంచనా. వీరిలో బీహార్, ఉత్తరప్రదేశ్‌తోసహా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులతోపాటు, మరమ్మతు పనులు చేస్తున్న కార్మికులూ ఉన్నారు.

అయితే, ఈ కుప్పకూలికను కేవలం ఒక్క గైర్హాజరు యజమానిపైనే నెట్టేసి, ఇప్పుడు అరెస్టై, అభియోగాలు ఎదుర్కొంటున్న అతడిపైనే బాధ్యత మోపడం, మిగతా అందరినీ చాలా తేలికగా వదిలేయడమే అవుతుంది. ఈ హాస్టల్‌కు లైసెన్స్ ఎవరో ఇచ్చి ఉండాలి, లేదా లైసెన్స్ లేకుండానే అది నడుస్తోందని ఎవరో గుర్తించడంలో విఫలమై ఉండాలి. ఈ భవనాన్ని ఎవరో తనిఖీ చేసి ఉండాలి, లేదా తనిఖీ చేయకుండానే క్లియరెన్స్ ఇచ్చి ఉండాలి. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ), తన భద్రతా విభాగం నుంచి ఐదుగురు అధికారులను, దక్షిణ మండల డిప్యూటీ కమిషనర్‌తోసహా నలుగురు స్ట్రక్చరల్ ఇంజినీర్లను సస్పెండ్ చేసింది. దీని పర్యవేక్షణ వ్యవస్థ కేవలం కాగితాలపైనే ఉందని, మరెక్కడా లేదన్న మౌన అంగీకారమే ఇది. ప్రతి రుతుపవన సీజన్‌లో, గడియారంలా క్రమం తప్పకుండా బాధితులతో సహా వచ్చిపడే ఈ విషాదాలను ఢిల్లీ కోల్పోతున్న శిథిల నిర్మాణాల్లో ఇది మొదటిది కాదు. ఇక్కడ కనిపిస్తున్న నిర్లక్ష్యం యాదృచ్ఛికం కాదు, ఇది వ్యవస్థ యొక్క స్థిరమైన స్థితి, అప్పుడప్పుడు జరిగే అంత్యక్రియలతో మాత్రమే అంతరాయం కలుగుతుంది. భద్రతా ఆందోళనల కారణంగా ఈ భవనాన్ని గతంలో ఖాళీ చేయించారని, అయితే తర్వాత మళ్లీ కార్యకలాపాల్లోకి తీసుకొచ్చారని కూడా వెల్లడైంది. అంటే, ప్రమాదాన్ని ఒకసారి గుర్తించి కూడా, తగిన చర్యలు తీసుకోకుండా అధికారులు వదిలేశారన్న మాట. భవన యజమాని హరి రామ్ బన్సాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు కాగా, అతను పరారీలో ఉన్నాడని, అతడిపై లుక్‌అవుట్ నోటీసు జారీ చేసినట్టు సమాచారం. ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు కాగా, ఆమోదం లేని వాణిజ్య విద్యార్థి వసతి గృహాల నిర్వహణకు సంబంధించి ఢిల్లీ వర్సిటీ, ఎంసీడీ రెండూ నియంత్రణ బాధ్యతను పంచుకుంటున్నాయని కోర్టు గుర్తుచేయడం గమనార్హం. ఈ ఘటనకు, ఒక బీజేపీ ఎమ్మెల్యేకు మధ్య రాజకీయ సంబంధాలు ఉన్నాయని ఒక విద్యార్థి సంఘం బహిరంగంగా ఆరోపించినా, ఆ ఆరోపణలు ఇంకా రుజువుకాలేదు, దర్యాప్తులో భాగంగా వీటిని పరిశీలించాల్సి ఉంది. ఈలోగా, పక్కనే ఉన్న మరో పీజీ భవనాన్ని ఎంసీడీ సీల్ చేసింది, ఢిల్లీ మేయర్ స్వయంగా సంఘటనా స్థలానికి వెళ్లి, ఆమోదం లేని బహుళ అంతస్తుల నిర్మాణాలపై శిక్షాత్మక చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

ఇలాంటి కుప్పకూలిక తర్వాత జరిగేది నిస్పృహకరంగా ముందే రాసిపెట్టుకున్న స్క్రిప్టులా ఉంటుంది. సంతాపాలు, ఒక అరెస్టు, న్యాయవిచారణ, ఆడిట్ల హామీలు. ఢిల్లీ ప్రభుత్వం ఇప్పటికే హాస్టళ్లు, నర్సింగ్ హోమ్‌లు, పాఠశాలలకు తప్పనిసరి నిర్మాణ ఆడిట్లు, భద్రతా సర్టిఫికెట్లను ప్రకటించింది. ఇది అవసరమైనదే, చాలా ఆలస్యంగా వచ్చిందే. కానీ అమలు మళ్లీ అదేవిధంగా విఫలమైతే విలువలేనిదే. సత్య నికేతన్ నివాసితులు ఇప్పటికే ఆరోపిస్తున్న లంచగొండితనం నుంచి రక్షణ పొందిన స్వతంత్ర తనిఖీ అధికారులు లేకుండా, ఆడిట్‌లకు పెద్దగా విలువ ఉండదు. ఒక విద్యార్థి లేదా తల్లిదండ్రులు లీజుపై సంతకం చేసేముందు తనిఖీ చేయగలిగే ప్రజా రిజిస్ట్రీ లేకుండా, సర్టిఫికేషన్‌కు పెద్దగా విలువ ఉండదు. సస్పెన్షన్ మాత్రమే జవాబుదారీతనానికి పైకప్పు కాకూడదు. చట్టవిరుద్ధ మార్పిడులను క్లియర్ చేసిన లేదా విస్మరించిన అధికారులు, వాటిని నిర్మించిన వ్యక్తులతో సమానంగా బాధ్యత వహించాల్సిందే. హాస్టల్ నడపడానికి ఎవరు అర్హులన్న నిబంధనలు ఢిల్లీకి లోటు లేదు. మృతదేహాలను లెక్కించే ముందు కాకుండా, ముందుగానే వాటిని అమలు చేసే సంకల్పమే లోటు. ఇది కేవలం ఢిల్లీ సమస్య మాత్రమే కాదు - భారత్‌లోని విశ్వవిద్యాలయ పట్టణాల్లో లక్షలాది మంది విద్యార్థులు ఇలాగే మార్చిన హాస్టళ్లలో నివసిస్తున్నారు, వదులుగా లైసెన్స్ పొందినవి, తనిఖీ చేసినా అదే షెడ్యూలుపైనే - ఏదైనా కూలిపోయేవరకూ ఎన్నడూ కాదు. నియమాలు రాయడం సరిపోదు, వాటిని నిజాయితీగా అమలు చేయడమే అసలైన సవాలు. భవన నిర్మాణ అనుమతులు, వాటి మార్పిడి, వినియోగ మార్పులను ఎప్పటికప్పుడు నిజ-సమయ డేటాబేస్‌లో నమోదు చేసి, ప్రజలు స్వేచ్ఛగా వెరిఫై చేసుకునే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. తనిఖీ అధికారులకు స్వతంత్రత కల్పించి, వారిపై నియంత్రణ ఉంచే ఉన్నతస్థాయి పర్యవేక్షణ యంత్రాంగాన్ని బలోపేతం చేయాలి. అవినీతిపరులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుని, వారికి కూడా భవన యజమానులతో సమానంగా క్రిమినల్ బాధ్యత వర్తింపజేయాలి. ఏడు కుటుంబాలు ఇప్పుడు ఆ అంతరం మూల్యం ఏమిటో తెలుసుకున్నాయి. తర్వాతి కుప్పకూలిక తర్వాత కాకుండా, తర్వాతి రుతుపవనానికి ముందే ఆ అంతరాన్ని మూసివేయడమే నిజాయితీగల నివాళి!

## పనికొచ్చే పలుకు



# కష్టపడటమే.. ముందు నేర్పించాలి!

పిల్లలకు కష్టం తెలియకుండా పెంచడం అంటే ప్రేమ చూపించడమే అనుకుంటాం. అడిగినది ఇవ్వడం, ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడడం, ఎదుర్కోవాల్సిన ప్రతి సమస్యనూ మనమే పరిష్కరించడం.. ఇవన్నీ ప్రేమకు ప్రతీకలుగానే కనిపిస్తాయి. కానీ ఒక చిన్న ప్రశ్న వేసుకోవాలి. మన పిల్లలకు కష్టాలు రాకుండా కాపాడుతున్నామా? లేక కష్టాలను ఎదుర్కొనే శక్తినే దూరం చేస్తున్నామా? జీవితం ఎప్పుడూ మనం కోరుకున్నట్టుగా ఉండదు. అందుకే పిల్లలకు ప్రతి అసౌకర్యం నుంచి రక్షణ కల్పించడం కంటే.. ఆ అసౌకర్యాన్ని ఎలా ఎదుర్కోవాలో నేర్పించడం ముఖ్యం. 'జెంటిల్ పేరెంటింగ్' పేరుతో పిల్లలకు ప్రతి విషయంలోనూ అతిగా వెసులుబాటు ఇవ్వడం కొన్నిసార్లు వారి స్వతంత్రతకు బదులు ఆధారపడే మనస్తత్వాన్ని పెంచవచ్చు. ఏ పని చేయమన్నా ఇష్టం లేదంటే వదిలేయడం, తప్పు చేసినా పెద్దగా పట్టించుకోకపోవడం, నియమాలు పెట్టడానికి సంకోచించడం.. ఇవన్నీ పిల్లలపై ప్రేమగానే కనిపించినా, భవిష్యత్తులో వారి నిర్ణయ సామర్థ్యంపై ప్రభావం చూపవచ్చు. మరోవైపు కఠినమైన క్రమశిక్షణ పేరుతో పిల్లల అభిప్రాయాలను పూర్తిగా పట్టించుకోకపోవడం కూడా సరైన పద్ధతి కాదు. అందుకే ప్రేమకు హద్దులు.. స్వేచ్ఛకు బాధ్యత.. క్రమశిక్షణకు ఆప్యాయత కలిసిన 'అథారిటేటివ్ పేరెంటింగ్' అవసరం.

పిల్లల మాట వినడం అంటే వాళ్లు చెప్పిన ప్రతిదానికీ అంగీకరించడం కాదు. వాళ్లు ఎందుకు అలా ఆలోచిస్తున్నారో తెలుసుకోవడం. ఒక నియమం ఎందుకు పెట్టామో వివరించడం. తప్పు చేస్తే శిక్షించడం కంటే, ఆ తప్పు వల్ల కలిగే పరిణామాన్ని అర్థమయ్యేలా చెప్పడం. నిర్ణయం తీసుకునే అవకాశం ఇవ్వడంతో పాటు, ఆ నిర్ణయానికి సంబంధించిన బాధ్యతను కూడా వాళ్లకే అప్పగించడం. ఈ చిన్న చిన్న అలవాట్లే పిల్లల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, బాధ్యత, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని పెంచుతాయి. మంచి జీవనశైలి అంటే మనపై మనం కఠినంగా ఉండటం కాదు. మన భవిష్యత్తుపై బాధ్యతతో ఉండటం. ఆరోగ్యంగా ఉండాలనుకుంటే కొంత క్రమశిక్షణ అవసరం. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే కొన్ని నియమాలు అవసరం. ఆర్థికంగా ఎదగాలంటే ఖర్చులపై నియంత్రణ అవసరం. సంబంధాలు బాగుండాలంటే మన మాటకంటే ఎదుటివారి మాట వినే అలవాటు అవసరం. ఇవన్నీ ఒకే విషయాన్ని చెబుతాయి. స్వేచ్ఛ అంటే నియమాలు లేకపోవడం కాదు; సరైన నియమాలను మనమే ఎంచుకుని వాటికి కట్టుబడి ఉండటం.

జీవితంలో కష్టం పూర్తిగా తొలగిపోవాలని కోరుకోవడం సహజం. కానీ కష్టాలు లేని జీవితం కంటే, కష్టాలు వచ్చినా నిలబడగలిగే జీవితం విలువైనది. అందుకే పిల్లలను పెంచడంలోనైనా.. మనల్ని మనం తీర్చిదిద్దుకోవడంలోనైనా ఒక సమతుల్యత అవసరం. అతి ప్రేమ వద్దు.. అతి కఠినత కూడా వద్దు. ప్రేమ ఉండాలి.. కానీ దానికి దిశ చూపించే నియమం ఉండాలి. స్వేచ్ఛ ఉండాలి.. కానీ దానికి తోడు బాధ్యత ఉండాలి. తప్పులు చేసే అవకాశం ఉండాలి.. కానీ వాటి నుంచి నేర్చుకునే ధైర్యం కూడా ఉండాలి. చివరికి మంచి పేరెంటింగ్ మన పిల్లల భవిష్యత్తును మాత్రమే మార్చదు. అది మన జీవితాన్ని చూసే విధానాన్నీ మార్చగలదు. పిల్లలకు మనం నేర్పాలనుకునే క్రమశిక్షణను ముందుగా మనమే పాటిస్తే.. వాళ్లకు చెప్పే మాటలకంటే మన జీవితం గొప్ప పాఠంగా మారుతుంది. కష్టం నుంచి కాపాడటం కంటే.. కష్టాన్ని ఎదుర్కొనే శక్తిని ఇవ్వడం గొప్ప ప్రేమ. అదే సూత్రాన్ని మన జీవితానికీ వర్తింపజేస్తే.. జీవనశైలి మాత్రమే కాదు, మన వ్యక్తిత్వమే కొత్త రూపం దాల్చుతుంది.

# వ్యూహం నుంచి ఆచరణవైపు..

2026 ఆగస్టులో జపాన్ రక్షణ మంత్రి షింజిరో కొయిజుమి భారత్ పర్యటన, తరచూ కార్యాచరణ కంటే సంస్థాగతంగానే ఎక్కువ అభివృద్ధి చెందిన ఒక భాగస్వామ్యం పరిణామంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. ఆగస్టు 20న న్యూఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమైన కొయిజుమి, ఆస్ట్రేలియాతో కలిపి రెండు దేశాల పర్యటనలో భాగంగా భారత్‌కు వచ్చారు. ప్రకటించిన ఒప్పందాలు, న్యూఢిల్లీ, టోక్యో ఇప్పుడు వార్షిక చర్చలు, 2+2 యంత్రాంగం, విన్యాసాలు, రవాణా ఏర్పాట్లు, రక్షణ సాంకేతిక చర్చల ద్వారా దశాబ్దానికిపైగా నిర్మించుకున్న సంస్థాగత భద్రతా పదజాలాన్ని, ఇప్పుడు మరింత పొందికైన భద్రతా సంబంధంగా అనుసంధానించే ప్రయత్నం చేస్తున్నాయని సూచిస్తున్నాయి. ఇది ముఖ్యమైనది ఎందుకంటే, భారత్-జపాన్ రక్షణ సంబంధం ఇప్పుడు అదనపు వ్యూహాత్మక సమన్వయ ప్రకటనలు క్షీణిస్తున్న రాబడులను ఇచ్చే దశకు చేరుకుంది. యథాతథ స్థితిని బలవంతంగా మార్చే ప్రయత్నాలు, సముద్ర ఉమ్మడి ప్రాంతాల భద్రత, ఇండో-పసిఫిక్‌లో పెరుగుతున్న సైనికీకరణ గురించి ఇరు దేశాలు ఇప్పటికే ఆందోళనలను పంచుకుంటున్నాయి. ఈ సమన్వయాలను వారి కలిసి పనిచేసే సామర్థ్యాన్ని మెరుగుపరచే ఏర్పాట్లుగా మార్చడమే అసలైన సవాలు. కొత్త సముద్ర భద్రతా చట్రం ఈ సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తోంది. రాజ్‌నాథ్ సింగ్, కొయిజుమి సముద్ర భద్రతా సహకారంపై ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేశారు, ఇది భారత నౌకాదళానికి, జపాన్ మారిటైమ్ సెల్ఫ్-డిఫెన్స్ ఫోర్స్‌కు మధ్య మరింత సన్నిహిత సహకారానికి చట్రాన్ని అందిస్తుంది.


సమాచార పంపిణీ, సముద్ర ప్రాంత అవగాహన (ఎండీఏ)పై ప్రాధాన్యత ఇవ్వడం ముఖ్యమైనది, ఎందుకంటే భారత్, జపాన్ ఇండో-పసిఫిక్ ప్రధాన సముద్ర రంగానికి రెండు వ్యతిరేక చివరల్లో కీలక స్థానాలను ఆక్రమించి ఉన్నాయి. జపాన్ తక్షణ భద్రతా ఆందోళనలు తూర్పు చైనా సముద్రం, తైవాన్ చుట్టూ ఉన్న జలాల్లో కేంద్రీకృతమై ఉండగా, భారత్ భౌగోళిక స్థానం దానికి హిందూ మహాసముద్ర ప్రాంతంలో కేంద్ర పాత్రను ఇస్తుంది. మెరుగైన సమాచార పంపిణీ వ్యవస్థ, క్రమంగా ఈ పరస్పర అనుసంధానిత సముద్ర ప్రాంతాల్లో మరింత నిరంతర వ్యూహాత్మక చిత్రాన్ని సృష్టించగలదు. ఈ రెండు ప్రధాన సముద్ర శక్తుల మధ్య మరింత అవగాహన, పరస్పర కార్యాచరణ సామర్థ్యం, కార్యాచరణ పరిచయాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం. నౌకా నిర్మాణంపై చర్చలు కూడా అంతే ముఖ్యమైనవి కావొచ్చు - జపాన్ సాంకేతిక నైపుణ్యాన్ని, భారత ఉత్పత్తి సామర్థ్యాలను కలిపి నౌకా నిర్మాణం, డిజైన్‌లో సంయుక్త అభివృద్ధిని అన్వేషించాలని నిర్ణయించారు. మేక్ ఇన్ ఇండియా చట్రం కింద భారత ఉత్పత్తి సామర్థ్యాలను జపాన్ వినియోగించుకోవడంపై చర్చలను మరింత లోతుగా చేయాలని, నౌకా మరమ్మతు సదుపాయాలకు పరస్పర ఏర్పాట్ల వైపు కదలాలని కూడా ఒప్పందం కుదిరింది - ఇది ద్వైపాక్షిక సంబంధంలో దీర్ఘకాలిక బలహీనతను పరిష్కరించి, వ్యూహాత్మక, రాజకీయ సమన్వయం కంటే స్థిరంగా వెనుకబడిన రక్షణ-పారిశ్రామిక సహకారానికి ఊతమివ్వగలదు. జపాన్ యూనికార్న్ సమీకృత కమ్యూనికేషన్ల యాంటెన్నా వ్యవస్థను (నౌకల్లో స్టెల్త్ సాంకేతికత) బదిలీ చేయాలన్న ప్రతిపాదన, ఈ



ప్రయత్నానికి అత్యంత కనిపించే చిహ్నంగా మిగిలింది - జపాన్ రక్షణ మంత్రిత్వ శాఖ దీన్ని రెండు దేశాల మధ్య తొలి రక్షణ పరికరాల బదిలీ ప్రాజెక్టుగా అభివర్ణించినా, ఈ ప్రాజెక్టు కొత్తదేమీ కాదు - భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) భాగస్వామ్యంతో యూనికార్న్ మాస్ట్‌ల సహ-అభివృద్ధికి 2024 నవంబర్‌లోనే ఒక అవగాహన ఒప్పందంపై సంతకం జరిగింది. కాబట్టి, ఆగస్టు సమావేశం కొత్త ప్రాజెక్టు ప్రారంభానికి బదులు, అమలు దిశగా మరో ముందడుగుగా నిలిచింది.

న్యూఢిల్లీ, టోక్యోలు తమ 2015 నాటి రక్షణ పరికరాలు, సాంకేతిక బదిలీ ఒప్పందాన్ని నిర్దిష్ట ఫలితాలుగా మార్చడంలో ఇబ్బంది పడుతూనే ఉన్నాయి. భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ), జపాన్ సముపార్జన, సాంకేతిక, రవాణా సంస్థ మధ్య సహకారాన్ని లోతుగా చేసే ప్రణాళికలతోపాటు, ఇప్పుడు ముందస్తు అమలుపై చూపిస్తున్న నిబద్ధత, అవకాశాలను గుర్తించడం మాత్రమే కాకుండా, ఫలితాలను అందించడంపైనే నేటి విశ్వసనీయత ఆధారపడి ఉందన్న గుర్తింపును సూచిస్తోంది. విన్యాసాల విషయానికొస్తే, జపాన్ యుద్ధ విమానాలు తొలిసారిగా భారత్‌లో వీర్ గార్డియన్ విన్యాసంలో (సెప్టెంబర్ 9-22, 2026) పాల్గొంటున్నాయి. ద్వైపాక్షిక విన్యాసాల సంక్లిష్టతను పెంచడానికి, మానవరహిత వ్యవస్థలను అనుసంధానించడానికి, తక్కువ నోటీసుతో నిర్వహించే విన్యాసాలను అన్వేషించడానికి ఇరు పక్షాలూ అంగీకరించాయి. ప్రత్యేక కార్యాచరణ దళాల మధ్య సహకారం, భారత్ భవిష్యత్ సమీకృత థియేటర్ కమాండ్‌ల గురించి కూడా వారు చర్చించారు. ఈ కార్యక్రమాలు కార్యాచరణ సన్నద్ధతపై పెరుగుతున్న శ్రద్ధతో కూడిన రక్షణ సంబంధాన్ని సూచిస్తున్నాయి. న్యూఢిల్లీకి ప్రయాణించడానికి ముందు, కొయిజుమి ముంబైలోని పశ్చిమ నౌకాదళ కమాండ్‌ను, ఐఎన్ఎస్ చెన్నైని సందర్శించారు. దీంతో ఆయన పర్యటన బంగాళాఖాతం, మలక్కా జలసంధి అనే సుపరిచిత వ్యూహాత్మక భౌగోళికతను దాటి విస్తరించింది. పశ్చిమ తీరం భారత్ విస్తృత సముద్ర ప్రయోజనాలకు కేంద్రం. కీలక సముద్ర మార్గాలు, ఇంధన ప్రవాహాలు, పశ్చిమ హిందూ మహా సముద్రంలో పెరుగుతున్న భారత బాధ్యతలను కలిగి ఉంది.

విస్తృత ప్రాంతీయ నేపథ్యాన్ని విస్మరించలేం. నౌకాయాన స్వేచ్ఛకు ఆటంకం కలిగించే లేదా బలవంతంగా, బెదిరింపుల ద్వారా యథాతథ స్థితిని మార్చాలని చూసే ఏకపక్ష చర్యలను వ్యతిరేకిస్తూ సంయుక్త ప్రకటన పునరుద్ఘాటించింది. వ్యూహాత్మక సందేశం స్పష్టంగా ఉండటానికి ఏ దేశమూ చైనా పేరు ప్రస్తావించాల్సిన అవసరం లేకపోయింది. అయితే, భారత్-జపాన్ సహకారం ప్రాముఖ్యత సరిగ్గా చైనా-కేంద్రీకృత ఎజెండాను దాటి ముందుకు సాగగల సామర్థ్యంలోనే ఉంది. సముద్ర భద్రత, స్థితిస్థాపక సరఫరా గొలుసులు, రక్షణ పారిశ్రామిక సామర్థ్యం, రవాణా, మూడో దేశాలతో సహకారం -ఇవన్నీ విస్తృత ప్రాంతీయ భద్రతా నిర్మాణంలో భాగాలుగా మారుతున్నాయి. ఈ పర్యటన, భారత్-జపాన్ సంబంధాల్లో విస్తృత ఊపు క్షణంతోనూ ముడిపడి ఉంది. ఆర్థిక భద్రత, కీలక సాంకేతికతలు, స్థితిస్థాపక సరఫరా గొలుసుల్లో సహకారాన్ని విస్తరించిన 2026 జులై వార్షిక శిఖరాగ్ర సమావేశం తర్వాత వెంటనే వచ్చిన ఈ రక్షణ మంత్రిత్వ స్థాయి భేటీ, భద్రత ఇప్పుడు విస్తృత వ్యూహాత్మక భాగస్వామ్యంతో ఎంతగా ముడిపడుతోందో నిరూపిస్తోంది. భారత పారిశ్రామిక సామర్థ్యాలను, జపాన్ సాంకేతిక బలాలను అనుసంధానిస్తూ, మరింత స్థితిస్థాపక ఇండో-పసిఫిక్‌ను తీర్చిదిద్దాలన్న వారి ఉమ్మడి ఆసక్తిని బలోపేతం చేస్తూ, రక్షణ సహకారం ఈ ఎజెండాల మధ్య అనుసంధాన కణజాలాన్ని అందించగలదు. అసలైన పరీక్ష ఇప్పుడు అమలులోనే ఉంటుంది. భారత్, జపాన్ వ్యూహాత్మక పునాదులను నిర్మిస్తున్నాయి, కొయిజుమి పర్యటన రెండు దేశాలూ చివరకు కష్టతరమైన పనిపై దృష్టి పెట్టడం మొదలుపెట్టాయని సూచిస్తోంది. అదే వ్యూహాత్మక సమన్వయాన్ని వినియోగించదగిన సామర్థ్యంగా మార్చడం. ■




పరిస్థితులన్నీ ప్రతికూలంగా మారినప్పుడు మీరు ఆధారపడదగిన ఆయుధం ఏంటో తెలుసా..? శ్రమ! రోజూ శ్రమిస్తూనే ఉండండి. ఫలితం వెంటనే కనిపించకపోయినా ఆగిపోకండి. ఎందుకంటే ప్రతి ప్రయత్నం మిమ్మల్ని మీ లక్ష్యానికి కొంచెం దగ్గర చేస్తుంది. పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్నా.. నిరంతర శ్రమ ముందు అవి ఎంతోకాలం నిలబడలేవు. శ్రమకు పట్టుదల తోడైతే అసాధ్యం అనుకున్నదీ సాధ్యమవుతుంది. కాబట్టి పరిస్థితులు మారే వరకు ఎదురుచూడకండి.. మీ శ్రమతోనే పరిస్థితులను మార్చే ప్రయత్నం చేయండి. అది కచ్చితంగా మళ్లీ మిమ్మల్ని విజయపథంలోకి తీసుకెళ్తుంది.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# బిగ్‌ఫుట్ కోసం వేట..!



అమెరికాలోని మైనే రాష్ట్రం డమారిస్కొట్టా పట్టణంలో వరుసగా 'బిగ్‌ఫుట్' కనిపించిందంటూ పోలీసులకు భారీగా ఫిర్యాదులు వచ్చాయి. దీంతో పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు చేయగా.. అసలు విషయం బయటపడింది. బిగ్‌ఫుట్ అనుకున్నది ఓ వ్యక్తి ధరించిన అత్యంత వాస్తవికమైన కాస్ట్యూమ్ అని తేలింది. అయితే ఈ ఘటనతో నిరాశ చెందకుండా.. తమ పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండటం, ఒకరి కోసం మరొకరు స్పందించడం గొప్ప విషయమని పోలీసులు పేర్కొన్నారు. "బిగ్‌ఫుట్ దొరకలేదు.. కానీ పరస్పరం చూసుకునే అరుదైన సమాజం కనిపించింది" అంటూ అభినందించారు.

# చికెన్‌లో నిమ్మరసం పిండుకుంటే..



చికెన్‌లో నిమ్మరసం పిండుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై చాలామందికి అనుమానాలున్నాయి. అయితే నిపుణుల అభిప్రాయం ప్రకారం.. చికెన్‌లో నిమ్మరసం కలుపుకోవడం ఆరోగ్యానికి మంచిది. నిమ్మలోని ఆమ్లత్వం చికెన్‌లోని ప్రొటీన్లను విచ్ఛిన్నం చేసి మాంసాన్ని మరింత మృదువుగా చేస్తుంది. సిట్రిక్ యాసిడ్ వల్ల ప్రొటీన్లు చిన్న కణాలుగా విడిపోయి, చికెన్ త్వరగా జీర్ణం అవ్వడానికి తోడ్పడుతుంది. చికెన్.. అనగానే.. నాన్‌వెజ్ ప్రియులు లొట్టలేసుకుంటూ మరి తింటారు.. చికెన్ లో ప్రొటీన్ తోపాటు ఎన్నో పోషకాలు దాగున్నాయి. అయితే.. చికెన్ కాంబినేషన్ విషయంలో జాగ్రత్తగా ఉండాలంటూ డైటీషియన్లు తరచూ హెచ్చరిస్తుంటారు. కోడి మాంసంతో కలిపి కొన్ని పదార్థాలను తినకూడదని.. దీనివల్ల అనారోగ్య సమస్యలు తలెత్తవచ్చని పేర్కొంటున్నారు. అయితే.. చికెన్‌లో నిమ్మకాయ రసం పిండుకోవచ్చా లేదా అనే అనుమానం చాలామందిలో ఉంటుంది. చికెన్‌ను వండే ముందు మసాలాలు కలిపేటప్పుడు లేదా వండిన తర్వాత తినే సమయంలో నిమ్మరసాన్ని తరచుగా వాడుతుంటారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, చికెన్‌లో నిమ్మరసం పిండుకోవడం ఆరోగ్యానికి మంచిదే కాకుండా, అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ముఖ్యంగా, చికెన్‌లో నిమ్మరసం కలుపుకోవడం వల్ల అందులోని ఆమ్లత్వం ప్రొటీన్లను విచ్ఛిన్నం చేస్తుంది. నిమ్మలోని సిట్రిక్ యాసిడ్ కారణంగా ప్రొటీన్లు చిన్న చిన్న కణాలుగా విడిపోవడంతో, చికెన్ మరింత మృదువుగా తయారవుతుంది. ఇది ఆహారం తీసుకున్న తర్వాత చికెన్ త్వరగా జీర్ణం అవ్వడానికి గణనీయంగా ఉపయోగపడుతుంది. చికెన్ తినేటప్పుడు కొందరు జీర్ణ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటుంటారు. నిమ్మరసం పిండుకొని తినడం వల్ల ఈ సమస్యల నుంచి బయటపడవచ్చు. కొంతమంది చికెన్‌ను స్కిన్‌తో సహా తినడానికి ఇష్టపడతారు. అలాంటి వారికి కూడా నిమ్మరసం ప్రయోజనకరంగా ఉంటుంది. చికెన్ స్కిన్ నుంచి వచ్చే కొవ్వును సమతుల్యం చేయడంలో నిమ్మరసం సహాయపడుతుంది, తద్వారా శరీరంలో కొలెస్ట్రాల్ పెరగకుండా నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అదనంగా, చికెన్‌ను వండే ముందు మేరినేట్ చేసేటప్పుడు నిమ్మరసం కలుపుతారు. ఇది చికెన్ సరిగ్గా ఉడకడానికి దోహదపడుతుంది. నిమ్మలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే. ఈ విటమిన్ సి, ఆహారం నుండి ఐరన్‌ను గ్రహించడానికి శరీరానికి అత్యవసరం. చికెన్‌లో లీన్ ప్రొటీన్, విటమిన్స్ బీ6, బీ12, ఐరన్ వంటి ఖనిజాలు ఉంటాయి. కాల్షియం కూడా చికెన్‌లో ఉంటుంది. వీటిని శరీరం సమర్థవంతంగా గ్రహించడానికి విటమిన్ సి అవసరం. అందువల్ల, చికెన్‌లో నిమ్మరసం కలుపుకోవడం వల్ల పోషక విలువలు మరింత పెరుగుతాయి. మొత్తంగా చూస్తే, చికెన్‌లో నిమ్మరసం కలుపుకోవడం వల్ల ఎలాంటి ప్రతికూల ప్రభావాలు ఉండవని, బదులుగా మాంసం మృదువుగా మారడం, జీర్ణక్రియ మెరుగుపడటం, కొలెస్ట్రాల్ నియంత్రణ, పోషకాల శోషణ పెరగడం వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలే కలుగుతాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# సవాళ్లను ఎదుర్కొంటేనే విజయం?



ప్రతిరోజూ ఉదయం నిద్రలేవగానే ఆ రోజు పూర్తి చేయాల్సిన పనుల గురించి మన మెదడు ఒక ప్రణాళికను సిద్ధం చేసుకుంటుంది. లక్ష్యం చిన్నదైనా పెద్దదైనా ఒకసారి నిర్ణయం తీసుకున్న తర్వాత విజయం లభించే వరకు అదే ఉత్సాహాన్ని, పట్టుదలను కొనసాగించడం చాలా ముఖ్యం. అప్పుడే మనం అనుకున్న గమ్యాన్ని చేరుకోగలం. జీవితంలో అడ్డంకులు ఎదురవ్వడం సహజం, మనం ఒకటి తలిస్తే దైవం మరొకటి తలచినట్లు పరిస్థితులు తారుమారు కావచ్చు. అటువంటి సమయాల్లో నిరాశ చెందకుండా పట్టుదలతో పోరాడి చిన్న అవకాశాన్ని కూడా వదులుకోకుండా ముందుకు సాగాలి. ఓటమి అంచుల్లో ఉన్నప్పుడు కూడా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే విజయం మన సొంతం అవుతుంది. జీవితంలో విజయం సాధించాలంటే కేవలం కలలు కనడం సరిపోదు, వాటిని నిజం చేసుకునే క్రమంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి. ఒక్కోసారి పరిస్థితులు అనుకూలించక అలసట కలగవచ్చు, కానీ ఆ సమయంలోనే మనలోని అంతర్గత శక్తిని బయటకు తీయాలి. గోమతి అనే మహిళ జీవితంలో జరిగిన సంఘటన దీనికి చక్కని ఉదాహరణగా నిలుస్తుంది.


ఆమె 1979లో మదురై కామరాజ్ యూనివర్సిటీలో డిగ్రీలో చేరారు. ఉత్సాహంగా చదువు మొదలుపెట్టిన కొద్ది రోజులకే అనారోగ్య సమస్యల వల్ల చదువు ఆపేయాల్సి వచ్చింది. ఒక ఏడాది వృథా అయిందని బాధపడుతున్న సమయంలో, యూనివర్సిటీ నుండి పొరపాటున వచ్చిన ఒక పరీక్షా దరఖాస్తు ఆమె జీవితాన్ని మార్చేసింది. ఆ అవకాశాన్ని వదులుకోకుండా భర్త అనుమతితో కేవలం మూడు నెలల కఠోర శ్రమతో పరీక్షలు రాసి విజయం సాధించారు. ఫలితంగా ఆమె అనుకున్నట్లుగానే పట్టభద్రురాలిగా గుర్తింపు పొందారు. మనకు ఎటువంటి ప్రతిభ లేదని చాలామంది ఫిర్యాదు చేస్తుంటారు, కానీ ప్రతి మనిషిలోనూ ఒక ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుంది. దానిని గుర్తించి అంకితభావంతో కృషి చేస్తే లక్ష్యం మన చెంతకు చేరుతుంది. ఏదైనా పనిని ప్రారంభంలో కష్టంగా అనిపించినా ఇష్టంతో చేయడం మొదలుపెడితే అందులో వేగంగా పురోగతి సాధించవచ్చు. లక్ష్య సాధనలో సమయం చాలా విలువైనది, అన్ని పనులను మనమే చేయాలని అనుకోకుండా బాధ్యతలను పంచుకోవడం వల్ల సమయం ఆదా అవుతుంది. జీవిత ప్రయాణంలో మనం తప్పుడు మార్గంలో వెళ్తున్నామని తెలిసిన వెంటనే సరిదిద్దుకోవాలి. తప్పుడు బస్సు ఎక్కామని తెలిసినప్పుడు తదుపరి స్టాప్‌లోనే దిగిపోవడం తెలివైన పని, లేదంటే మరింత సమయం వృథా అవుతుంది. అలాగే శారీరక దృఢత్వం కోరుకునే వారు బ్రహ్మ ముహూర్తంలో నిద్రలేచి నడకను అలవాటు చేసుకోవాలి. అది ఇంటిని శుభ్రం చేయడం వంటి చిన్న పని అయినా, ఇల్లు కట్టడం వంటి పెద్ద పని అయినా ఏకాగ్రతతో చేస్తే విజయం లభిస్తుంది. మీ లక్ష్యంపై దృష్టి సారించి ప్రపంచాన్ని జయించండి. నిరంతర కృషి, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడమే మిమ్మల్ని ఉన్నత స్థానంలో నిలబెడతాయి. మీ ప్రతిభను నమ్మి ఇష్టంతో పని చేయండి, విజయం మీ ముంగిట ఉంటుంది.

# జీన్స్‌ను ఎన్ని రోజులకోసారి ఉతకాలి



జీన్స్ ఒక స్టైలిష్, సౌకర్యవంతమైన వస్త్రం. పురుషులు, మహిళలూ.. చిన్నా పెద్దా అంతా జీన్స్ ను ఇష్టంగా ధరిస్తారు.. అయితే, వాటిని ఎప్పుడు ఉతకాలో చాలా మందికి గందరగోళంగా ఉంటుంది. జీన్స్.. జీన్స్.. జీన్స్.. చిన్నా పెద్దా అందరూ ఇష్టపడే.. స్టైలిష్, సౌకర్యవంతమైన వస్త్రం.. ఈ రోజుల్లో జీన్స్ కేవలం ఒక దుస్తువు మాత్రమే కాకుండా.. అవి ప్రతి ఒక్కరి దైనందిన జీవనశైలిలో ఒక అంతర్భాగంగా మారాయి. కాలేజీ అయినా, ఆఫీసు అయినా, లేదా సాధారణంగా బయటకు వెళ్ళినా, సరిగ్గా సరిపోయే ఒక జీన్స్ ప్యాంటు ప్రతి సందర్భంలోనూ స్టైల్, సౌకర్యం రెండింటినీ అందిస్తుంది. కానీ వాటిని తరచుగా లేదా తప్పుగా ఉతకడం అందరూ చేసే సాధారణ పొరపాటు.. ఇలా చేయడం వల్ల జీన్స్ దుస్తులు ముందుగానే చినిగిపోతాయి.. లేదా రంగు మారి పాలిపోయి కనిపిస్తుంది. చాలా మంది జీన్స్ వేసుకున్న ప్రతిసారీ ఉతకాలని అనుకుంటారు.. మరికొందరు వారాలు లేదా నెలల తరబడి వాటిని ఉతకకుండా ఉంటారు. నిజం ఏమిటంటే, జీన్స్ మన్నిక, ఫిట్, రంగును కాపాడుకోవడానికి వాటిని సరైన పద్ధతిలో జాగ్రత్తగా చూసుకోవడం, సరైన సమయంలో ఉతకడం చాలా కీలకం.. జీన్స్ ఇతర దుస్తుల కంటే చాలా దృఢంగా ఉంటాయి.. కానీ అంతమాత్రాన వాటిని ఎలా పడితే అలా ఉతకకూడదు. పదేపదే ఉతకడం వల్ల రంగు వెలిసిపోవడం, బట్ట వదులుగా మారడం, సరిగ్గా సరిపోకపోవడం జరగవచ్చు. నిజానికి, జీన్స్‌ను ఎప్పుడు ఉతకాలి అనేది.. మీరు వాటిని ఎంత తరచుగా ధరిస్తారు, వాతావరణం, మీరు వాటిని ఎంతగా వాడుతున్నారు వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఈ విషయంలో చాలా మంది ఫ్యాషన్ నిపుణులకు భిన్నమైన అభిప్రాయాలు ఉన్నప్పటికీ, బ్రిటిష్ ఫ్యాషన్ డిజైనర్, వ్యాపారవేత్త టామ్ ఫ్రాన్స్ ఒక ఇంటర్వ్యూలో తాను తన జీన్స్‌ను 20 సార్లు ధరించిన తర్వాత ఉతుకుతానని పేర్కొన్నారు. సాధారణంగా, జీన్స్‌ను 10 నుండి 12 సార్లు ధరించిన తర్వాత ఉతకాలి. అయితే, మేము ఇప్పటికే చెప్పినట్లుగా, మీరు జీన్స్ ధరించే కాలం కూడా ముఖ్యమైనదే. మీరు చాలా వేడిగా లేదా చెమట ఎక్కువగాని

ఉండే ప్రాంతంలో ఉన్నట్లయితే, వాటిని 2 నుండి 3 సార్లు ధరించిన తర్వాత ఉతకడం ఉత్తమం. శీతాకాలంలో, మీరు జీన్స్‌ను 7 నుండి 8 సార్లు ధరించిన తర్వాత ఉతకవచ్చు. తరచుగా ఉతకడం వల్ల రంగు వెలిసిపోవడానికి, బట్ట వదులుగా మారడానికి కారణమవుతుందని గుర్తుంచుకోండి.. కాబట్టి అవసరమైనప్పుడు మాత్రమే వాటిని ఉతకడం ఉత్తమం.



# మంచి జీవనశైలితో పూడికలకు కళ్లెం

గుండెపోటు, పక్షవాతం బారినపడకూడదని అనుకుంటున్నారా? అయితే కంటి నిండా నిద్రపోయేలా చూసుకోండి. అలాగే తగినంత శారీరక శ్రమ, వ్యాయామం కూడా చేయండి. ఇవి రక్తనాళాల్లో పూడికలకు దారితీసే వాపుప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) అదుపులో ఉండటానికి గణనీయంగా తోడ్పడుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు.

కణాలు విభజన చెందేటప్పుడు, కొన్నిసార్లు వాటి డీఎన్‌ఏలో మార్పులు జరుగుతుంటాయి. ఇవి కణాలను వేగంగా వృద్ధి చెందేలా, మామూలు కణాల కన్నా మార్పులతో కూడిన కణాల సంఖ్య పెరిగేలా చేస్తుంటాయి. వయసు మీద పడుతున్నకొద్దీ రక్త, రోగనిరోధక కణాలు పుట్టుకొచ్చే మూలకణాల్లో ఇది తరచూ జరుగుతుంటుంది. ఇలా రక్తకణాల్లో కొనసాగుతూ వచ్చిన జన్యుమార్పులు (క్లోనల్ హిమటోపోయెసిస్) వాపుప్రక్రియకు దారితీస్తాయి. ఇది రక్తనాళాల్లో పూడికలకు బీజం వేస్తుంది. దీంతో రక్తనాళాల లోపలి మార్గం సన్నబడి గుండెపోటు, పక్షవాతం ముప్పులు పెరుగుతాయి.ఆరోగ్యకరమైన జీవనశైలితో వాపుప్రక్రియకు కళ్లెం వేయొచ్చు. అయితే క్లోనల్ హిమటోపోయెసిస్, దీని ప్రభావాలను ఆరోగ్యకరమైన జీవనశైలి ఎలా ప్రభావితం చేస్తుందన్నది స్పష్టంగా తెలియదు. ఈ నేపథ్యంలో ఇక్హాన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు దీనిపై దృష్టి సారించారు. శారీరకంగా చురుకుగా ఉండి, రక్తకణాల్లో జన్యుమార్పులు గలవారిని ఎంచుకొని పరిశోధించారు. అలాగే ఎలుకల మీదా అధ్యయనం నిర్వహించారు. ఒక మాదిరి నుంచి తీవ్ర శారీరక శ్రమ చేసేవారిలో జాక్2, టెట్2, టీఆర్‌పీ3 జన్యువుల్లో ఒకదాంతో తలెత్తే క్లోనల్ హిమటోపోయెసిస్ తక్కువగా ఉంటున్నట్టు గుర్తించారు. అయితే డీఎన్‌ఎంటీ3ఏ అనే జన్యుమార్పులతో తలెత్తే క్లోనల్ హిమటోపోయెసిస్ మీద ఎలాంటి ప్రభావం కనిపించలేదు.

జాక్2, టెట్2లో మార్పులు గల ఎలుకల్లో నిద్రలేమి మూలంగా క్లోనల్ హిమటోపోయెసిస్ ఎక్కువైంది. అయితే వ్యాయామంతో తగ్గింది.

జన్యుమార్పులపై ఒక్కో రకమైన జీవనశైలి ఒక్కోలా ప్రభావం చూపుతున్నట్టు ఇవి తెలియజేస్తున్నాయి.

క్లోనల్ హిమటోపోయెసిస్ మూలంగా ఎలుకల రక్తనాళాల్లో పూడికలు తీవ్రమయ్యాయి కూడా. నిద్రలేమితో రక్తకణాల్లో ఈ జన్యుమార్పులు ఎక్కువ కాగా.. వ్యాయామంతో తగ్గటం గమనార్హం. కాబట్టి రాత్రిపూట కంటి నిండా నిద్ర పోవటం, తగినంత శారీరక శ్రమ వ్యాయామం చేయటం మంచిది. ఇవి మూలం నుంచే గుండె రక్తనాళాల జబ్బుల నివారణకు తోడ్పడుతుండటం విశేషం.

## జ్వరం వచ్చినా స్నానం చేయొచ్చు



జ్వరం తీవ్రంగా ఉన్నప్పుడు శక్తి తగ్గుతుంది. మరోవైపు చలి పెడుతుంటుంది. ఇలాంటప్పుడు బాత్రూమ్‌లో నిల్చొని స్నానం చేస్తున్నప్పుడు కళ్లు తిరిగి పడిపోవచ్చు. ఈ ఉద్దేశంతో స్నానం చేయొద్దని అంటారు గానీ శక్తి ఉన్నవారు చేస్తే ఎలాంటి ఇబ్బందీ ఉండదు. స్నానం చేస్తే జ్వరం ఎక్కువవుతుందని అనుకోవటం అపోహ. నిజానికి జ్వరం వచ్చినవారికి ఆసుపత్రిలో రోజూ స్పాంజితో ఒళ్లంతా తుడుస్తారు. జ్వరం తీవ్రంగా ఉన్నప్పుడు చల్లటి నీటితో తుడిస్తే త్వరగా ఉష్ణోగ్రత తగ్గుతుంది కూడా. అందువల్ల జ్వరం వస్తే స్నానం చేయకూడదనేమీ లేదు.

**ఆటలమ్మ వస్తే మందులు అవసరం**

ఒకప్పుడు ఆటలమ్మ (చికెన్‌పాక్స్) ఎందుకొస్తుందో తెలియని రోజుల్లో పడక చుట్టూ వేపాకులు పెట్టేవారు. ఒంటికి పసుపు రాసేవారు. వీటితో పొక్కులు చీము పట్టటం తగ్గుతుందని భావించేవారు. ఇప్పుడు ఆటలమ్మకు వైరస్ కారణమనే సంగతి తెలుసు. యాంటీవైరల్ మందులూ అందుబాటులో ఉన్నాయి. కాబట్టి పూర్వకాలంలో మాదిరిగా కాకుండా డాక్టర్‌ను సంప్రదించి, తగు చికిత్స తీసుకోవటం మంచిది. మందులు వాడకపోతే సమస్య తీవ్రం కావొచ్చు. దీంతో న్యుమోనియా, మెదడు వంటి భాగాలు దెబ్బతినటం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదముంది.

**పసర్లలో పస లేదు**

కామెర్లకు పసర్లు పనిచేయవు. నిజానికి కామెర్లు ఒక జబ్బు కాదు. ఇదొక లక్షణం. వైరస్, పిత్తాశయ రాళ్లు, క్యాన్సర్లు, రక్తకణాలు విచ్ఛిన్నం కావటం వంటి రకరకాల అంశాలు కామెర్లకు దారితీస్తుంటాయి. కారణాన్ని బట్టి చికిత్స చేయాల్సి ఉంటుంది. అంతేతప్ప పసర్లతో ఉపయోగం లేదు. ఆలస్యం చేస్తే అనర్థం తప్పదు.

**మంత్రాలకు విషం దిగదు**

పాముకాటుకు మంత్రాలు పనిచేయవు. మనదేశంలో నాలుగురకాల విషపూరిత పాములున్నాయి. వీటన్నింటి విషానికి ఒకేరకం ఇంజెక్షన్ మందు అందుబాటులో ఉంది. విషం పాము కరిచినప్పుడు దీన్ని ఇస్తే ప్రాణాలు నిలుస్తాయి. కానీ మంత్రాల పేరుతో తాత్సారం చేస్తే మొదటికే మోసం వస్తుంది.

## ఒక్క పరుగుతో శతకం మిస్ చేసుకున్న తిలక్.. హాఫ్ సెంచరీ చేజార్చుకున్న తెలంగాణ డీజీపీ కొడుకు



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ పోరులో సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మకు తీరని గుండెకోత మిగిలింది. ఈస్ట్ జోన్ నమోదు చేసిన 708 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఒంటరి పోరాటం చేసిన తిలక్, కేవలం ఒక్క పరుగు దూరంలో (99 రన్స్ వద్ద) శతకాన్ని చేజార్చుకున్నాడు. రోజంతా ఈస్ట్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించి, వీరోచితంగా పోరాడిన తిలక్.. నర్వస్ నైంటీస్‌లో సెంచరీకి ఒక్క అడుగు దూరంలో ఔట్ కావడంతో మైదానంలోనే తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. తిలక్ వర్మ సెంచరీ మిస్ కావడంతో సౌత్ జోన్ డ్రెస్సింగ్ రూమ్‌తో పాటు అభిమానులు తీవ్ర నిరాశలో మునిగిపోయారు.మరోవైపు ఈ మ్యాచ్‌లో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ కుమారుడైన చామ మిలింద్ కూడా దురదృష్టవశాత్తూ తన హాఫ్ సెంచరీని చేజార్చుకున్నాడు. సౌత్ జోన్ వికెట్లు వరుసగా పడుతున్న టైంలోనే క్రీజులోకి వచ్చిన మిలింద్, కెప్టెన్ తిలక్ వర్మతో కలిసి 78 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. 68 బంతుల్లో 7 ఫోర్లతో 43 రన్స్ చేసి ఊపుమీదున్న మిలింద్, స్పిన్నర్ శిఖర్ మోహన్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి, బ్యాటింగ్‌లోనూ 43 రన్స్ చేసిన మిలింద్ పోరాటం అభినందనీయమైనప్పటికీ, కేవలం 7 పరుగుల తేడాతో అర్ధ శతకం మిస్ అవ్వడం అతనికి తీవ్ర నిరాశ మిగిల్చింది.

**ఫాలో-ఆన్ గండంలో సౌత్ జోన్.. ఈస్ట్ జోన్ పేసర్ల దాడి:**

ఈ ఇద్దరు కీలక ప్లేయర్స్ ఔట్ కావడంతో సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్ ఆశలు పూర్తిగా ఆవిరయ్యాయి. ఈస్ట్ జోన్ నిర్దేశించిన 509 పరుగుల ఫాలో-ఆన్ మార్కును చేరుకోవడంలో సౌత్ జోన్ దారుణంగా ఫెయిల్ అయింది. ఈస్ట్ జోన్ స్టార్ వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ కొట్టిన డబుల్ సెంచరీకి తోడు మహమ్మద్ షమీ, ముకేష్ కుమార్ ప్రాణాంతకమైన స్పెల్స్‌తో విరుచుకుపడటంతో సౌత్ జోన్ లోయర్ ఆర్డర్ క్యూ కట్టింది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లోనే ఈస్ట్ జోన్ ఊహించని స్థాయిలో భారీ ఆధిక్యాన్ని సాధించి మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించింది.

**వైభవ్ ఆల్-టైమ్ రికార్డ్.. దులీప్ ట్రోఫీ విన్నర్‌గా ఈస్ట్ జోన్:**

తిలక్ వర్మ సెంచరీ చేజారడం, చామ మిలింద్ పోరాటం ముగియడంతో ఈస్ట్ జోన్ దులీప్ ట్రోఫీ 2026 ఛాంపియన్‌గా నిలవడం ఇప్పుడు కేవలం లాంఛనంగా

మారింది. ఈ చారిత్రాత్మక విజయంతో 15 ఏళ్ల యంగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ దులీప్ ట్రోఫీ టైటిల్ గెలిచిన అత్యంత పిన్న వయస్కుడైన (యంగెస్ట్) ఆటగాడిగా ఆల్-టైమ్ రికార్డు సృష్టించబోతున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లోనే 708 పరుగుల భారీ స్కోరుతో సౌత్ జోన్ వెన్నువిరిచిన ఈస్ట్ జోన్, దులీప్ ట్రోఫీ విజేతగా నిలిచి సరికొత్త చరిత్ర రాయడానికి రెడీ అయింది.

## ఐదు నెలల తర్వాత హార్దిక్ రీఎంట్రీ.. సాయి సుదర్శన్‌కు చోటు: ఇండియాఏ స్క్వాడ్ ఇదిగో!




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా సుమారు ఐదు నెలల విరామం తర్వాత మళ్లీ పోటీ క్రికెట్‌లోకి అడుగు పెట్టబోతున్నాడు. వచ్చే నెల పుదుచ్చేరి వేదికగా ఆస్ట్రేలియా ఏ జట్టుతో జరగనున్న వైట్ బాల్ సిరీస్ కోసం బీసీసీఐ ఎంపిక చేసిన ఇండియా ఏ టీమ్ లో పాండ్యాకు చోటు లభించింది. అక్టోబర్ 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ 3 వన్డేల సిరీస్‌లో హార్దిక్ పాల్గొనడం అతడి ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుంది. ఇండియా ఏ జట్టులో ఎంపికవ్వడంతో వెస్టిండీస్‌తో జరగబోయే వన్డే సిరీస్‌కు పాండ్యా దూరం కానున్నాడు.

**కెప్టెన్లుగా రుతురాజ్ గైక్వాడ్, దేవదత్ పడిక్కల్:**

ఆస్ట్రేలియా ఏ జట్టుతో జరిగే ఈ ప్రతిష్ఠాత్మక సిరీస్ కోసం బీసీసీఐ ఇద్దరు యంగ్ స్టార్లకు సారథ్య బాధ్యతలు అప్పగించింది. సెప్టెంబర్ 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే రెండు మల్టీ-డే (4 రోజుల) మ్యాచ్‌ల సిరీస్‌కు కర్ణాటక స్టార్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇటీవల శ్రీలంక టెస్టు పర్యటనలో నంబర్-3 స్థానంలో వరుసగా రెండు సెంచరీలు కొట్టిన పడిక్కల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ఇక అక్టోబర్ 6 నుంచి జరిగే 50 ఓవర్ల వన్డే సిరీస్‌కు రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌గా ఎంపిక కాగా, పడిక్కల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు.

**ఫిట్‌నెస్ టెస్ట్ పాసైతేనే గ్రౌండ్‌లోకి.. వెస్టిండీస్ సిరీస్‌కు పాండ్యా దూరం:**

హార్దిక్ పాండ్యా రాక కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నప్పటికీ, వైట్ బాల్ సిరీస్ లో అతను ఆడటం అనేది ఎన్‌సీఏ (బీజూా) ఇచ్చే ఫిట్‌నెస్ సర్టిఫికేట్‌పైనే మాత్రమే ఆధారపడి ఉంది. ఒకవేళ పాండ్యా పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తే మ్యాచ్ ప్రాక్టీస్ కోసం ఇండియా ఏ తరపున ఆస్ట్రేలియా ఏపై విరుచుకుపడేందుకు సిద్ధమవుతాడు. ఆసియా గేమ్స్ క్యాంపెయిన్, విండీస్ సిరీస్ ల నేపథ్యంలో సీనియర్ ప్లేయర్స్ అందుబాటులో లేకపోవడంతో యంగ్ ప్లేయర్లను, ఐపీఎల్ 2026లో మెరిసిన స్టార్లను ఎంపిక చేసినట్లు బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ల కమిటీ స్పష్టం చేసింది.

**ఇండియా 'ఏ' పూర్తి స్క్వాడ్స్:**

మల్టీ-డే జట్టు (4 రోజుల మ్యాచ్‌లు): దేవదత్ పడిక్కల్ (కెప్టెన్), సాయి సుదర్శన్ (వైస్ కెప్టెన్), అమన్ మోఖడే, ఆయుష్ పాండే, యశ్ రాథోడ్, షేక్ రషీద్, కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), షామ్స్ ములానీ, తనుష్ కొటియాన్, తుషార్ దేశ్‌పాండే, అంశుల్ కంబోజ్, ప్రాఫుల్ హింగే, ఎన్ జగదీసన్ (వికెట్ కీపర్), నాచికేత్ భుతే, వి వైశాఖ్.

వన్డే జట్టు (50 ఓవర్ల సిరీస్): రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), దేవదత్ పడిక్కల్ (వైస్ కెప్టెన్), ప్రియాన్ష్ ఆర్య, సాయి సుదర్శన్, రజత్ పటీదార్, కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), నిశాంత్ సింధు, విప్రాజ్ నిగమ్, అర్షిన్ కులకర్ణి, అర్షద్ ఖాన్, నమన్ ధీర్, హార్దిక్ పాండ్యా (ఫిట్‌నెస్‌కు లోబడి), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), గుర్జాప్‌నీత్ సింగ్, యశ్ ఠాకూర్.

## దులీప్ ట్రోఫీ: ఇషాన్ కిషన్ మరోసారి విధ్వంసం.. ఈస్ట్ జోన్‌కు 584 పరుగుల భారీ ఆధిక్యం

**హైదరాబాద్ పెన్ పవర్:** దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో సౌత్ జోన్‌పై ఈస్ట్ జోన్ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించి తన పట్టును మరింత బిగించింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా బుధవారం జరిగిన నాలుగో రోజు ఆటలో, కెప్టెన్ ఇషాన్ కిషన్ (80), శిఖర్ మోహన్ (52) అద్భుతమైన హాఫ్ సెంచరీలతో రాణించారు. దీంతో ఆట ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ ఏకంగా 584 పరుగుల భారీ ఆధిక్యం సాధించి, టైటిల్‌ను దాదాపు ఖాయం చేసుకుంది.

**ఇషాన్, మోహన్ అద్భుత భాగస్వామ్యం**

తొలి ఇన్నింగ్స్‌లో 372 పరుగుల భారీ ఆధిక్యం ఉన్నప్పటికీ, ఈస్ట్ జోన్ ఫాలో ఆన్ విధించకుండా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. అయితే, ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ (8), అభిమన్యు ఈశ్వరన్ (0) విఫలమవడంతో ఆరంభంలో తడబడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్, శిఖర్ మోహన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 170 బంతుల్లో 126 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. ముఖ్యంగా ఇషాన్ కిషన్ తనదైన శైలిలో విధ్వంసక బ్యాటింగ్‌తో అలరించాడు. కేవలం 98 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 80 పరుగులు చేశాడు. విజయ్ వేసిన ఒకే ఓవర్లో రెండు సిక్సర్లు, రెండు ఫోర్లతో 20 పరుగులు రాబట్టి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మరో భారీ షాట్‌కు ప్రయత్నించి కిషన్ ఔటవగా, నిలకడగా ఆడిన శిఖర్ మోహన్ (52) కూడా పెవిలియన్ చేరాడు.

**ఒక్క పరుగుతో శతకం చేజార్చుకున్న తిలక్ వర్మ**

అంతకుముందు, ఉదయం సెషన్‌లో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌత్ జోన్ 336 పరుగులకు ఆలౌటైంది.

కెప్టెన్ తిలక్ వర్మ అద్భుత పోరాట పటిమ కనబరిచాడు. అయితే, దురదృష్టవశాత్తూ ఒక్క పరుగు తేడాతో తన తొమ్మిదో ఫస్ట్‌క్లాస్ సెంచరీని చేజార్చుకున్నాడు. 99 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కౌనైన్ ఖురేషీ బౌలింగ్‌లో రిటర్న్ క్యాచ్ ఇచ్చి నిరాశగా వెనుదిరిగాడు. మరో ఎండ్‌లో సీవీ మిలింద్ (43) అతనికి చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత సౌత్ జోన్ ఇన్నింగ్స్ త్వరగా ముగిసింది. ముఖేష్ కుమార్ 3 వికెట్లతో రాణించాడు.

నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. కుమార్ కుశాగ్ర (34 నాటౌట్), ఖురేషీ (26 నాటౌట్) క్రీజులో ఉన్నారు. చివరి రోజు ఆట నామమాత్రమే కాగా, ఈస్ట్ జోన్ విజయం లాంఛనమేనని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

## వార్‌లో 'దాదా' బాలకృష్ణ.. 3 నెలల ముందే 'కింగ్' గేమ్ స్టార్ట్!





ఈ ఏడాది క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న ఇండియన్ బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో ముగ్గురు అగ్ర కథానాయకుల మధ్య భారీ పోరు షురూ అయింది. ఇది నువ్వా నేనా? అంటూ సాగే ఒక భీకర సమరం. టాలీవుడ్ 'కింగ్' అక్కినేని నాగార్జున నటిస్తున్న మైలురాయి చిత్రం 'కింగ్ 100' బరిలోకి దిగుతుండగా, నటసింహం నందమూరి బాలకృష్ణ తన మాస్ యాక్షన్ పవర్ ప్యాక్డ్ 'దాదా' తో పోటీపడుతున్నారు. వీరికి తోడు బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ తన మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా యాక్షన్ థ్రిల్లర్ -కింగ్-తో బాక్సాఫీస్‌ను షేక్ చేయడానికి సిద్ధమయ్యారు. డిసెంబర్ 24నే ఈ ముగ్గురూ తమ సినిమాలను విడుదల చేస్తుండటంతో ఆ తేదీకి దాదాపు మూడు నెలల ముందే తెలుగు రాష్ట్రాల్లో థియేటర్ల ఆధిపత్య పోరు - బిజినెస్ గేమ్ హోరాహోరీగా ప్రారంభమైంది.అక్కినేని నాగార్జున తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 100వ చిత్రంగా 'ఖఱఅస్త్ర100'ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. "నాతో డబ్బు లేనప్పుడు లూజర్ అన్నారు.. డబ్బు ఉన్నప్పుడు కింగ్ అన్నారు.. కానీ నా గుర్తింపు డబ్బు కంటే శక్తివంతమైనది" అనే కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ చిత్రం.. ఒక మనిషి అధికారం - స్వయంకృషితో ఎదిగిన ప్రయాణాన్ని అత్యంత గ్రిప్పింగ్‌గా ఆవిష్కరించబోతోంది. నాగార్జున స్వయంగా అన్నపూర్ణ స్టూడియోస్ డిస్ట్రిబ్యూషన్ వింగ్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటినుంచే థియేటర్ల యజమానులతో ఒప్పందాలు కుదుర్చుకుంటూ బాక్సాఫీస్ స్పేస్‌ను సొంతం చేసుకోవడంలో వేగంగా పావులు కదుపుతున్నారు. థియేటర్ల రేసులో మూడు నెలల ముందే కింగ్ హవా చూపిస్తుండటం ఇప్పుడు ఫిలింనగర్ లో చర్చగా మారింది. కంటెంట్ పరంగా ఎమోషన్- క్లాస్- మాస్ ఎలిమెంట్స్ మేళవింపుగా వస్తున్న -కింగ్ 100- పోటీలో నాగార్జునకు మైలేజ్ ఇచ్చేలా కనిపిస్తోంది.

మరోవైపు నందమూరి బాలకృష్ణ -దాదా- రూపంలో భీకరమైన మాస్ పవర్‌తో థియేటర్లపైకి దండయాత్రకు సిద్ధమయ్యారు. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో 1980ల నాటి ముంబై గ్యాంగ్‌స్టర్ కథాంశంతో చారిత్రాత్మక టైమ్‌లైన్ కలయికతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో బాలయ్య -కింగ్ ఆఫ్ కేయాస్-గా కనిపించనున్నారు. థమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్... మాస్ డైలాగ్‌లు.. ముంబై పోలీసులను సైతం శాసించే పవర్‌ఫుల్ డాన్ పాత్రలో బాలయ్య విశ్వరూపం తెలుగు రాష్ట్రాల్లో ఓపెనింగ్స్ పరంగా భారీ రికార్డులను తిరగరాయడానికి సిద్ధంగా ఉంది. బి, సి సెంటర్లలో బాలకృష్ణకు ఉన్న తిరుగులేని మాస్ ఫాలోయింగ్ ఈ క్రిస్మస్ రేసులో -దాదా-ను అత్యంత బలీయమైన ప్రత్యర్థిగా నిలబెడుతోంది.

ఈ తెలుగు దిగ్గజాల పోరు మధ్యలోకి బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ -కింగ్- సైలెంట్ గా ఎంట్రీ ఇస్తుండటం వాతావరణాన్ని మరింత వేడెక్కించింది. సుహాస్ వర్మ, సిద్ధార్థ్ ఆనంద్ కాంబినేషన్ నుండి వస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో షారూఖ్ సిల్వర్ హెయిర్ లుక్‌తో సరికొత్త అవతారంలో కనిపించనున్నారు. "సౌ దేశోం మే బద్నామ్.. దునియా నే దియా సిర్ఫ్ ఏక్ హి నామ్ - కింగ్" అనే గ్లోబల్ ప్రొఫైల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా తెలుగు హక్కులను దక్కించుకోవడానికి స్థానిక అగ్ర నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు పోటీపడుతున్నారు. నార్త్ బెల్ట్ - గ్లోబల్ మార్కెట్‌లో ఈ చిత్రం భారీ కలెక్షన్లు సాధిస్తుందనే అంచనాలున్నా దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా తెలుగు మార్కెట్‌లో థియేటర్లను దక్కించుకోవడం ఈ బాలీవుడ్ -కింగ్-కి పెద్ద సవాలుగా మారింది.షారూఖ్ ఖాన్‌కు తన పాన్-ఇండియా స్టార్‌డమ్‌ను నిలబెట్టుకోవడానికి - సౌత్ మార్కెట్‌లో తన పట్టును మరింత బలోపేతం చేసుకోవడానికి -కింగ్- విజయం అత్యంత కీలకం. పఠాన్, జవాన్ చిత్రాలతో సౌత్‌లో భారీ వసూళ్లు రాబట్టిన షారూఖ్ ఈసారి నేరుగా నాగార్జున -కింగ్ 100-, బాలకృష్ణ -దాదా- వంటి పక్కా ప్రాంతీయ దిగ్గజాలతో ఒకే రోజు పోటీపడుతుండటంతో బాక్సాఫీస్ యుద్ధం రసవత్తరంగా మారింది. క్రిస్మస్ పండుగ సీజన్ పెద్ద సినిమాలకు అనుకూలమైనదే అయినా థియేటర్ల కేటాయింపులు, స్క్రీన్ల లభ్యత విషయంలో నాగార్జున పక్కా ప్లానింగ్‌తో ఉండటం.. బాలయ్య మాస్ స్టామినా బలంగా నిలవడం వల్ల తెలుగు గడ్డపై ఈ ముగ్గురు -కింగ్-ల మధ్య సమరం సరికొత్త చరిత్ర సృష్టించబోతోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965